అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 21-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 113 | Published from Karimnagar , Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



మోడీ గారూ .. మౌనం వీడండి

- 'మణిపూర్ మామ్స్'

వివరాలు 10లో..

మహిళలకు ఏం చేశారు..?



రెజ్లర్లు అంటే మీకు అంత చిన్న చూపా..?

- బేటీ బచావో..బేటీ పడావో కాగితాలకే పరిమితం
- జులై 7నుంచి 9వరకు హైదరాబాద్‌లో ఐద్వా కేంద్ర కమిటీ సమావేశాలు
- ఆగస్టులో చలో ఢిల్లీ : ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధాసుందర్‌రామన్

వివరాలు 5లో

లౌకికవాదులు ఒక్కటవ్వాలి

23న బీహార్‌లో ప్రతిపక్ష రాజకీయ పార్టీల సమావేశం

- హాజరవుతున్న సీపీఐ(ఎం).. కేసీఆర్ కలిసి రావాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మోడీ 2024లో మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం లౌకికవాదం కనుమరుగవుతుందని, వాటిని రక్షించేవాళ్లు ఏకతాటిపైకి రావాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్నికల వాతావరణం నెలకొందని, అన్ని పార్టీలు ...5లో




గింజ గోస...

విత్తనాలు దొరక్క అన్నదాత అగచాట్లు

సేద్యాన్నే నమ్ముకున్న అన్నదాత అడగడుగునా మోసపోతున్నాడు. పాలకులు,ప్రభుత్వాలు మారినా రైతు తలరాత మారటంలేదు. సీజన్ వచ్చిన ప్రతిసారీ విత్తన సేకరణ సమస్యగా మారుతోంది. విత్తనాలు కావాల్సినంతగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేయలేకపోతోంది. దీంతో నల్లబజారులో రైతన్న నిలువుదోపిడీకి గురవుతున్నాడు.

- నల్లబజారులో పత్తి, మిర్చి విత్తనాలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ఎంఆర్‌పీపై రూ.1200 వరకు అదనం
- డిమాండ్ ఉన్నవి ...లేనివి అంటగడుతున్న వైనం
- తనిఖీలు చేస్తున్నా వెనక్కు తగ్గని విక్రేతలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రైతుల అవసరాలను విత్తన దుకాణాదారులు సొమ్ము చేసుకుంటున్నారు. వర్షాలు కురిస్తే పత్తి, మిర్చి గింజలు లభిస్తాయో లేదోనని.. ఇప్పుడైతే నచ్చిన కంపెనీ విత్తనాలు దొరుకుతాయని మార్కెట్‌కు వచ్చిన రైతుల ఆశలపై నీళ్ల చల్లుతున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తూ.. ఒక్కో ప్యాకెట్‌కు ఎంఆర్‌పీపై రూ.200 నుంచి రూ.1200 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. లేదంటే తాము అడిగిన విత్తనాల ప్యాకెట్లు కొన్ని ఇచ్చి.. దుకాణదారులకు మార్జిన్ అధికంగా ఉండే సీడ్స్‌ను అంటగడుతున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలను ఏ దుకాణానికి వెళ్లి అడిగినా లేవని చెబుతూ.. రూ.850 ఉన్న ప్యాకెట్‌ను దొడ్డిదారిలో రూ.2000 వరకు విక్రయిస్తున్నారని రైతులు చెబుతున్నారు.


బ్లాక్ దందా ఎలా...?

రాష్ట్రవ్యాప్తంగా వరి తర్వాత పత్తి అధిక విస్తీర్ణంలో సాగవుతుంది. రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల వరకు ఈ పంట సాగయ్యే అవకాశం ఉంది. 2020-21లో 60లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 2021-22లో 50 లక్షల ఎకరాలకు పడిపోయింది. 2022-23లో 60 లక్షల ఎకరాల వరకు సాగు చేశారు. గతేడాది పత్తి పంటకు ఆశాజనకంగా ధర లేకపోవడంతో ఈ ఏడాది కొంత విస్తీర్ణం తగ్గొచ్చని అంటున్నా.. రైతులు మాత్రం పత్తిపై ఆసక్తి చూపుతూనే ఉన్నారు. పత్తిలో రాష్ట్రంలోనే అధిక డిమాండ్ ఉన్న యూఎస్ 7067, ఏబీసీహెచ్ 147, బీటీబీజీ-2 గీత, సూపర్ 971, బీజీ-2 విత్తనాల కృత్రిమకొరత సృష్టిస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. గ్రోమోర్‌తోపాటు సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాప్స్‌లో ఈ విత్తనాలను కొనుగోలు చేసేవాళ్లకు మరో మూడు రకాల వేరే కంపెనీ విత్తనాలను బలవంతంగా అంటగడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇవే రకాలు కావాలని రైతులు పట్టుబడితే అధిక రేటుకు ...5లో

ఇదేం తీరు..?

దేశంలో పరిస్థితులు సరిగాలేకపోతే..విదేశీ పర్యటనలు ఆపుకుని చక్కదిద్దిన ప్రధానులను చూశాం. కానీ మోడీ గారు మాత్రం దేశం కష్టాల్లో ఉంటే వదిలేసి మరీ విదేశాల్లో పర్యటనలకు వెళ్తుంటే ఆందోళన చెందుతున్నాం. ఇది ఆయనకు అనవాయితీగా మారింది. దేశంలో నిరసనలు, ఆందోళనలు,అల్లర్లు,ఉద్యమాలు, ప్రకృతి విపత్తులు ఏమొచ్చినా.. పట్టని ప్రధాని.. విదేశాలకు వెళ్ల భారత్ వెలిగిపోతోందని చెప్పుకుంటుంటారు. తాజాగా మణిపూర్‌లో హింస మొదలుకుని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో తుఫాను బీభత్సం కండ్లముందున్నా ఫారిన్ టూర్‌కు విమానమెక్కేశారు.ఈ తీరుపట్ల, మోడీ హయాంలో దేశంలో నెలకొన్న పరిస్థితుల పట్ల దేశంలోనే కాదు విదేశాల్లోనూ మోడీకి నిరసన సెగలు తాకుతున్నాయి. ఆయన పర్యటనలపై ,ఆయనకు బైడెన్ ఆహ్వానంపై పలు అభ్యంతరాలు,విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- అమెరికాకు బయలు దేరిన ప్రధాని మోడీ
- భారత్‌లో బీజేపీ సర్కారు తీరుపై బైడెన్‌కు హెచ్ఆర్‌హెచ్ గ్రూపు లేఖ హక్కుల దుర్వినియోగాన్ని ఖండించండి
- చట్టాలను దుర్వినియోగంపై బహిరంగంగా విమర్శించండి
- మణిపూర్ హింస నేపథ్యంలో ప్రధానిని ఆహ్వానించటం సరికాదు
- 58 సంస్థలు, 200 మందికి పైగా వ్యక్తుల లేఖ



న్యూఢిల్లీ : భారత ప్రధాని మోడీ అమెరికా పర్యటన బుధవారం నుంచి అధికారికంగా ప్రారంభం కానున్నది. ఈ పర్యటన కోసం ఆయన ఇప్పటికే భారత్ నుంచి బయలుదేరారు. అయితే, మోడీ అమెరికా పర్యటన నేపథ్యంలో కొన్ని సంస్థలు, వ్యక్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. భారత్‌లో హక్కుల దుర్వినియోగం, విమర్శకులపై మోడీ సర్కారు వ్యవహరిస్తున్న తీరును ఉటంకిస్తూ అమెరికాలోని లాభాపేక్షలేని గ్రూపు అయిన హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ (హెచ్ఆర్‌హెచ్) అమెరికా అధ్యక్షుడు జో బిడెన్‌కు ఒక లేఖను రాసింది. మోడీ సర్కారు తీరును వ్యతిరేకిస్తూ బహిరంగంగా ఖండించాలని కోరింది. ఈ లేఖపై 58 సంస్థలు, 200 మందికి పైగా వ్యక్తులు సంతకాలు చేశారు.

మోడీకి వ్యతిరేకంగా ర్యాలీ

మణిపూర్‌లో జాతి హింస చెలరేగిన నేపథ్యంలో మోడీని అమెరికా పర్యటనకు ఆహ్వానించటంపై హెచ్ఆర్‌హెచ్ బిడెన్‌ను తప్పుబట్టింది. హెచ్ఆర్‌హెచ్ లేఖ ...2లో

భారత ప్రజాస్వామ్యంపై మూడు దాడులు

సమ్మిట్ ఫర్ డెమోక్రసీకి వారం ముందు భారత ప్రజాస్వామ్యంపై వరుసగా మూడు దాడులను లేఖ ప్రస్తావించింది. "మొదట, అధికార బీజేపీ రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి బహిష్కరించింది. రెండోది, భారత ప్రభుత్వం పంజాబ్‌లో ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. మూడోది, ఉగ్రవాదానికి ...2లో

కాశ్మీర్ అంశం, హక్కుల ఉల్లంఘన, మైనారిటీలపై దాడులు సహా పలు అంశాల ప్రస్తావన

భారత్‌లో మానవ హక్కుల సంక్షోభాన్ని పరిష్కరించడానికి మార్గాలు అన్వేషించటం కోసం.. భారతీయ-అమెరికన్ మానవ హక్కుల, పౌర సమాజ నాయకులతో చర్చించాలని అమెరికా అధ్యక్షుడిని హెచ్ఆర్‌హెచ్ కోరింది. బిడెన్.. మోడీని వ్యక్తిగతంగా విమర్శించడానికి ఇష్టపడకపోయినా.. అధికారాన్ని ఏకీకృతం చేయడానికి, భారత ప్రజల అభీష్టాన్ని దెబ్బతీసేందుకు భారత ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని, ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని విమర్శించడానికి తగినంత అవకాశం ఉన్నదని పేర్కొన్నది. "మీరు మాట్లాడితే ప్రధాని మోడీ వింటారు. మీరు బహిరంగంగా ఒక స్టాండ్ తీసుకుంటేనే అతను, అతని మిత్రులు మారుతారు. భారత్ గురించి పట్టించుకునే మీ మాట వినాలనీ, భారత్‌లో ప్రజల భవిష్యత్తును, హక్కులను ఒక వ్యక్తి దొంగిలించలేడని నిర్ధారించుకోవాలని మేము మిమ్మల్ని కోరుతున్నాం" అని లేఖలో వివరించింది.

డప్పు చప్పుళ్లు... బైక్ ర్యాలీలు...

- రేపు ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు: మంత్రి తలసాని
- హోంమంత్రితో కలిసి ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డప్పు చప్పుళ్లు... బైక్ ర్యాలీలతో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ...2లో

విద్యతోనే వికాసం-అభివృద్ధి

మన ఊరు- మన బడితో 172పాఠశాలలు అందుబాటులోకి..

- ప్రాధాన్యతాపరంగా ఒక్కో సమస్య పరిష్కరించుకుందాం: మంత్రి కేటీఆర్



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

విద్యతోనే వికాసం, అభివృద్ధి సాధ్యమని, రాష్ట్రంలో ప్రాధాన్యతాపరంగా ఒక్కో సమస్యను పరిష్కరించుకుందామని మంత్రి కేటీఆర్ అన్నారు. మన ఊరు-మన బడిలో భాగంగా 172 పాఠశాలలు అందుబాటులోకి వస్తున్నట్టు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రూ.8.5 కోట్లతో అభివృద్ధి చేసిన విద్యా క్యాంపస్‌ను మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. చిన్నారుల బంగారు భవిష్యతుపై మరింత దృష్టి సారించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. చిన్నారులను ఎట్లా తీర్చిదిద్దాలి, వాళ్ల కాళ్లపై నిలబడేలా.. ఇరుగు పొరుగుతో ఎట్లా మెదులుకోవాలో, సంతోషంగా ఎట్లా జీవించాలో కరికులమ్‌లో ప్రభుత్వం పొందుపరుస్తుందన్నారు. మానవ సంబంధాలు మెరుగుపర్చేందుకు బోధనలో భాగంగా ...5లో

బీఆర్ఎస్ దశాబ్ది దగా

రేపు అన్ని నియోజకవర్గాల్లో కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం : టీపీసీసీ పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను దగా చేస్తూ వస్తున్నదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. దీనికి నిరసనగా బుధవారం అన్ని నియోజకవర్గాల్లో 'దశాబ్ది దగా' పేరుతో కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే అధ్యక్షతన రాజకీయాల వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశమైంది. తాజా రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు, పార్టీ ...5లో

దశాబ్ది ఉత్సవాల్లో ఇండ్లు.. గుడిసెల జాడేది?

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్

- గుడిసె వాసులకు పట్టాలు ఇచ్చే వరకూ పోరాటం ఆగదు : ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య
- గోవిందరావుపేట, భూపాలపల్లిలో బస్సుయాత్రకు ఘన స్వాగతం





నవతెలంగాణ-గోవిందరావుపేట/భూపాలపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఇల్లు, ఇండ్ల స్థలాల జాడేదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ప్రశ్నించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ గృహాల సాధనకై ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర మంగళవారం ములుగు జిల్లా గోవిందరావుపుట మండలానికి చేరుకుంది. బస్సుయాత్ర బృందానికి స్వాగతం పలుకుతూ వందలాది మంది డీవైఎఫ్ఐ కార్యకర్తలు.. రెడ్ టీ షర్టు ధరించి ఎర్రజెండాలు కట్టిన బైకులతో పసర గుడిసెవాసుల ప్రాంతానికి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పసరలో సభ నిర్వహించారు. అక్కడ నుంచి జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చేరుకున్న బస్సు యాత్రకు డప్పు చప్పుళ్లు బోనాలతో నృత్యం చేస్తూ బృందానికి స్వాగతం ...5లో

విద్య ఎక్కడుంటే అభివృద్ధి అక్కడే

బడుల్లో క్రీడల పీరియెడ్ ఉండాలి

- తెలంగాణపై కేంద్రం వివక్ష
- రాష్ట్రానికి ఒక్క విద్యాసంస్థనూ కేటాయించలేదు
- విద్యాదినోత్సవంలో మండలి చైర్మెన్ గుత్తా
- బాలల భవితకు బంగారు బాటలు వేద్దాం : సబిత
- అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి : మహమూద్ అలీ
- మూడేండ్లలో విద్యలో సమూల మార్పులు : తలసాని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్య ఎక్కడుంటుందో అభివృద్ధి అక్కడుంటుందని, అభివృద్ధి చెందిన దేశాలే ఇందుకు నిదర్శనమని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో విద్యాదినోత్సవ కార్యక్రమాన్ని ఆ శాఖ నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన గుత్తా ...2లో

అసోంలో వరద ఉధృతి

- 10 జిల్లాల్లో ప్రభావం

గౌహతి: అసోంలో వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. మంగళవారం నాటికి 10 జిల్లాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉందని, ఈ జిల్లాల్లో ఇప్పటికే సుమారు 31 వేల మంది వరదలతో ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. మరోవైపు అస్సాంలో రాబోయే 5 రోజుల్లో భారీ వర్షాలు నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. రెడ్‌ఎలర్ట్ జారీ చేసింది. అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఏఎస్‌డీఎంఏ) విడుదల చేసిన డైలీ ఫ్లడ్ రిపోర్టు ప్రకారం చిరాగ్, దర్రాంగ్, ధేమాజి, ధుబ్రి, దిబ్రూగఢ్, కొక్రాఝార్, లఖీంపూర్, నల్బరి, సోనిట్‌పూర్, ఉదల్‌గురి జిల్లాల్లో 30,700 మందికి పైగా ప్రజలు వరదల బారీన పడ్డారు. అయితే ఏ జిల్లాలోనూ పునరావస కేంద్రాని ఏర్పాటు చేయలేదు. కానీ 25 పంపిణీ కేంద్రాల ద్వారా సహాయక సామాగ్రిని అందచేస్తున్నారు. అలాగే ప్రస్తుతం 444 గ్రామాలు ముంపులో ఉన్నాయని, 4,741.23 హెక్టార్లల్లో పంటలు నాశనమయ్యాయని ఎఎస్‌డిఎంఎ తెలిపింది. అలాగే అనేక ప్రాంతాల్లో కోతలు ఏర్పడుతున్నాయని, కొండ చరియలు విరిగి పడుతున్నాయని తెలిపింది. భారీ వర్షాల కారణంగా రోడ్లు, వంతెనలు వంటి మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతున్నాయని వెల్లడించింది. పట్టణ ప్రాంతాలు కూడా వరద ముంపునకు గురవుతున్నాయని తెలిపింది. బ్రహ్మపుత్రా నదితో సహా రాష్ట్రంలో అన్ని నదులు ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయని చెప్పింది.

నేడు సెంథిల్ బాలాజీకి శస్త్రచికిత్స

చెన్నై : ఈడీ అరెస్టు చేసిన తమిళనాడు మంత్రి వి.సెంథిల్‌బాలాజీకి ఈ నెల 21న ఇక్కడి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో హృదయ సంబంధిత శస్త్రచికిత్సను చేయనున్నారు. ఈ విషయాన్ని తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి మా. సుబ్రమణ్యం మంగళవారం వెల్లడించారు. క్యాష్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో గతవారంలో సెంథిల్‌బాలాజీని ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అదే రోజు సెంథిల్ గుండెపోటుకు గురికావడంతో ముందుగా అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరువాత కోర్టు ఆదేశాలతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 'సెంథిల్‌బాలాజీకి తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. కాబట్టి రేపు చేస్తున్నారు' అని మంత్రి సుబ్రమణ్యం మంగళవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ వైద్యులు గుర్తించేవరకూ కూడా 'క్రిటికల్ బ్లాక్స్' గురించి సెంథిల్‌బాలాజీకి తెలియదని సుబ్రమణ్యం చెప్పారు. ప్రస్తుతం సెంథిల్‌బాలాజీ చికిత్స పొందుతున్న కావేరీ ఆసుపత్రే ఈ నెల 14న అతనికి బైపాస్ సర్జరీ చేయాలని తొలిసారి సూచించింది.

ఆ పార్టీలపై చర్యలు తీసుకోండి

- ఎలక్షన్ కమిషన్‌కు ఏడీఆర్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థుల నేర చరిత్రను ప్రచురించడంలో విఫలమైన రాజకీయ పార్టీలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎలక్షన్ కమిషన్‌కు ఏడీఆర్ లేఖరాసింది. సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో తమ అభ్యర్థుల నేర చరిత్ర, పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి రాజకీయ పార్టీలు వెల్లడించడం తప్పనిసరి అని ఎడిఆర్ తన లేఖలో గుర్తు చేసింది. అలాగే నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయడానికి గల కారణాలను, నేరచరిత్ర లేని ఇతర వ్యక్తులను అభ్యర్థులుగా ఎందుకు ఎంపిక చేయలేకపోయారనే విషయాలను కూడా రాజకీయ పార్టీలు వెల్లడించాల్సి ఉంటుందని ఎడిఆర్ తెలిపింది. తన ఆదేశాలను పాటించనందుకు 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 రాజకీయ పార్టీలకు సుప్రీంకోర్టు జరిమానా విధించిన విషయాన్ని కూడా ఏడీఆర్ గుర్తుచేసింది. దీని తరువాత ఈ ఏడాదిలో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు, 2022లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, పంజాబ్ ఎన్నికలు, 2021లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతం) అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని ఏడీఆర్ తెలిపింది. ఈ ఎన్నికల్లో నిబంధనలు పాటించని రాజకీయ పార్టీలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

నవతెలంగాణ వరంగల్ రీజనల్ మేనేజర్.. బోయినపల్లి దేవేందర్ రావుకు పితృవియోగం

నవతెలంగాణ-వరంగల్



నవతెలంగాణ వరంగల్ రీజనల్ మేనేజర్ బోయినపల్లి దేవేందర్ రావు తండ్రి బోయినపల్లి గోపాల్‌రావు (85) వరంగల్ జిల్లా నల్లబెల్లి గ్రామంలో అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి పలువురు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నారు. మృతునికి నలుగురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు నవతెలంగాణ వరంగల్ రీజియన్ మేనేజర్ బోయినపల్లి దేవేందర్ రావు. కాగా, దేవేందర్, ఆయన కుటుంబానికి నవతెలంగాణ సీజీఎం ఎం.ప్రభాకర్, ఇన్‌చార్జి ఎడిటర్ రాంపల్లి రమేష్, మఫిషిల్ ఇన్‌చార్జి వేణు తమ సంతాపాన్ని తెలిపారు.

ఐఏఎస్ అధికారులతో పాలనను అడ్డుకుంటుంది

- కేంద్రంపై కేజ్రీవాల్ విమర్శలు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ఐఏఎస్ అధికారులతో ఢిల్లీ పాలనను నియంత్రించాలని భావిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్టు ప్రకటించారు. మంగళవారం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్‌సీసీఎస్‌ఏ) మొదటి సమావేశానికి హాజరైన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఎన్నికైన ప్రభుత్వ అధికారాలను లాక్కుందని అన్నారు. మంత్రులకు బదులుగా అధికారులకు బాధ్యతలను కట్టబెట్టిందని, ఆర్డినెన్స్ ఢిల్లీ చీఫ్ సెక్రటరీని కేంద్రం కన్నా ఉన్నత స్థానంలో ఉంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు తీసుకున్న నిర్ణయాలను తోసిపుచ్చే అధికారం ఐఏఎస్‌లకు ఉందని అన్నారు. ఎన్‌సీసీ ఎస్‌ఏ సమావేశానికి కొద్ది రోజుల ముందు ఓ అధికారి సస్పెన్షన్‌కు సంబం ధించిన ఫైల్ తనకు అందిందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. కొన్ని ప్రశ్నలు లేవనెత్త డంతో ఆ ఫైల్ తిరిగి తన దగ్గరకు రాకుండా.. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాల యానికి వెళ్లిందని.. ఎన్‌సీసీఎస్‌ఏకు చెందిన ఇద్దరు సభ్యులు ఆమోదించ డంతో ఆ అధికారి సస్పెండ్ అయ్యారని అన్నారు. త్వరలో ఆర్డినెన్స్ తో పాటు ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లనున్నామని అన్నారు.

విద్య ఎక్కడుంటే అభివృద్ధి అక్కడే

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ అన్నారు. విద్యుత్ వినియోగం, తలసరి ఆదాయం, జీఎస్‌డీపీలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. విద్యావైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగం, విద్యుత్‌రంగం ప్రధాన కార్యక్రమాలుగా రాష్ట్ర ప్రభుత్వం భావించిందని చెప్పారు. విద్యపై ప్రత్యేక ఆసక్తి ఉన్నందునే 1,002 గురుకులాలను సీఎం కేసీఆర్ స్థాపించారని వివరించారు. ఏదో ఒక పాఠశాలలో విద్యార్థి నకలు కొట్టినా గోరంతలు కొండంతలు చేసే పరిస్థితి ఉందని అన్నారు. యూపీఏ హయాంలో మోడల్ స్కూళ్లను ప్రారంభించారని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మోడల్ స్కూళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలపైకి నెట్టిందన్నారు. దీంతో మన రాష్ట్ర ప్రభుత్వమే 192 మోడల్ స్కూళ్లను నిర్వహిస్తున్నదని వివరించారు. మెడికల్ కాలేజీ, నవోదయ విద్యాసంస్థ, గిరిజన విశ్వవిద్యాలయం వంటివి రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేయకుండా వివక్ష చూపుతున్నదని విమర్శించారు. తాను చదువుకునే రోజుల్లో సాయంత్రం క్రీడలు నేర్పించేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. క్రీడల కోసం ప్రత్యేకంగా ఒక పీరియెడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యామంత్రి సబితా ఇంద్రారెడ్డిని కోరారు. పీఈటీలను నియమించాలని సూచించారు. స్కావెంజర్లు, వాచ్‌మెన్లు లేరని, ఆ సమస్యల మీద తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇందులో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. బడి కేవలం పిల్లలదే కాదని, ఉపాధ్యాయులది కూడా అని వివరించారు. సొంత ఇంటిలాగే ఉపాధ్యాయులు బడిని కాపాడుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురుకుల పాఠశాలగా మార్చే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు.

ప్రయివేటుకు ధీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతున్నాం : సబిత

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతున్నామని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. గురుకులాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ, లా కాలేజీ కలిపి 1,200 వరకు గురుకులాలున్నాయని, కేజీ టు పీజీ ఉచిత విద్యలో ఇది భాగమని వివరించారు. తెలంగాణ రాకముందు విద్యారంగానికి రూ.ఎనిమిది వేల కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు రూ.23 వేల కోట్లు కేటాయిస్తున్నామని అన్నారు. విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ వల్లే ఇది సాధ్యమైందన్నారు. డిగ్రీలో కొత్త కోర్సులను ప్రారంభించిన ఉన్నత విద్యామండలిని ఆమె అభినందించారు. మన ఊరు-మనబడి బృహత్తర కార్యక్రమమని చెప్పారు. సర్కారు బడుల దశదిశను మార్చేలా సీఎం కేసీఆర్ దాన్ని రూపొందించారని వివరించారు. 93 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు న్యాక్ గ్రేడ్ రావడం ఆషామాషీ కాదని అన్నారు. గతంలో స్కూళ్ల ప్రారంభమయ్యాక రెండు, మూడు నెలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఇచ్చే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో వెంటనే ఇస్తున్నామని చెప్పారు. గతంలో పాఠ్యపుస్తకాలకు రూ.130 కోట్లు ఖర్చు చేసే వాళ్లమని, ఇప్పుడు రూ.190 కోట్లు ఖర్చయ్యిందని వివరించారు. సర్కారు బడుల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ అంగీకరించారని అన్నారు. మధ్యాహ్న భోజనం గతంలో దొడ్డు బియ్యం వండేవారని, ఇప్పుడు సన్నబియ్యంతో అందిస్తున్నామని గుర్తు చేశారు. పేద విద్యార్థులు ఉదయం తినకుండా వస్తారనే ఉద్దేశంతో మంగళవారం నుంచి రాగిజావ అందిస్తామని వివరించారు. దీనిద్వారా 28,606 ప్రభుత్వ పాఠశాలల్లోని 25,26,907 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. 18 ఏండ్లు నిండిన అమ్మాయిలకే కళ్యాణలక్ష్మి వర్తిస్తుందని అన్నారు. ఈ కారణం వల్ల అమ్మాయిలు ఎక్కువ మంది ఉన్నత విద్య చదువుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళా విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు ప్రకటించారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఇస్తున్నామని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దామన్నారు.

సమాజంలో చదువుకు ఎంతో ప్రాధాన్యత : తలసాని

సమాజంలో చదువుకు ఎంతో ప్రాధాన్యత ఉందనిపశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. చదువు... చదువు అంటూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేయొద్దని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కోరారు. క్రీడలు, సాంస్కృతిక అంశాలకు కూడా ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. రాబోయే మూడేండ్లలో విద్యారంగంలో సమూల మార్పులొస్తాయని చెప్పారు. ఆ తర్వాత ఉత్తమ విద్యాసంస్థ, ఏ ర్యాంకు వచ్చినా తెలంగాణకే దక్కుతుందని వివరించారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ మన ఊరు మనబడి పాఠశాలల్లో వసతుల కల్పనకే పరిమితమని చెప్పారు. జూనియర్, డిగ్రీ, పీజీ, సాంకేతిక కాలేజీలతోపాటు విశ్వవిద్యాలయాలనూ అభివృద్ధి చేయాలని కోరారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందిందని అన్నారు. దేశంలోనే సీఎం కేసీఆర్ నెంబర్‌వన్‌గా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలోని 133 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 93కు న్యాక్ గ్రేడ్ ఉందని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. విద్యార్థుల నమోదు నిష్పత్తి జాతీయ స్థాయిలో 27.3 శాతం ఉంటే, తెలంగాణలో 39.1 శాతం ఉందన్నారు. మహిళలకు సంబంధించి జాతీయ స్థాయిలో 27.9 శాతం ఉంటే, తెలంగాణలో 40.3 శాతం ఉందని వివరించారు. ఎస్సీలు జాతీయ స్థాయిలో 23.9 శాతం ఉంటే, తెలంగాణలో 39.3 శాతం ఉందని చెప్పారు. విద్యార్థులకు ఉపాధి, నాణ్యమైన విద్య అందించడం కోసం చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సెక్టార్ స్కిల్ కౌన్సిల్ కోర్సులు, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ కోర్సులను ప్రారంభించామని అన్నారు. మన ఊరు మనబడి ప్రారంభించినా, విద్యార్థులకు రాగిజావ అందించినా ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన చెప్పారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లను ప్రశంసాపత్రం ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం తీరు..?

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం.. మానవ హక్కులపై భారత ప్రభుత్వం పెంచుతున్న దాడులకు వ్యతిరేకంగా బహిరంగంగా, అర్థవంతంగా వెనక్కి నెట్టాలని కోరింది. మానవ హక్కుల పట్ల కట్టుబాట్లను గౌరవించాలని భారత ప్రభుత్వానికి బహిరంగంగా పిలుపునివ్వాలనీ, రాజకీయ విమర్శకులను ఏక పక్షంగా నిర్బంధించడానికి చట్టాలను ఉపయోగిస్తున్న మోడీ, ఆయన క్యాబినెట్‌ను హెచ్చరించాలని చెప్పింది. మోడీకి, ఆయన ఫాసిస్టు పాలనలో మానవ హక్కులు, ముఖ్యంగా మైనారిటీల హక్కులు ప్రమాదంలోకి పడిపోవటానికి వ్యతిరేకంగా బుధవారం అమెరికాలో ఒక ర్యాలీ జరగనున్నది. ఈ ర్యాలీ స్పాన్సర్లలో హెచ్‌ఆర్‌హెచ్ కూడా ఉన్నది.

మోడీ పాలనలో నిరంకుశ దేశంగా భారత్

భారత-అమెరికన్ హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, దళితులు, పౌర హక్కులు, మతాంతర సంస్థల కూటమి అయిన కొయలిషన్ ఫర్ రీక్లెయిమింగ్ ఇండియన్ డెమొక్రసీ.. మోడీని ఆహ్వానించాలనే బిడెన్ నిర్ణయానికి, భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా వాషింగ్టన్ డీసీలో రెండు విలేకరుల సమావేశాలను నిర్వహించనున్నది. మోడీ పాలనలో భారత్.. ప్రపంచంలో అత్యంత వేగమైన నిరంకుశ దేశాలలో ఒకటని ఈ కూటమి ఆరోపించింది. గత మూడేండ్లుగా భారత్‌ను మోడీ ప్రభుత్వం 'పాక్షిక స్వేచ్ఛా' దేశంగా తయారు చేసిందని 'ఫ్రీడమ్ హౌజ్' వివరించింది. మోడీ సర్కారు కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన తర్వాత అక్కడ మానవ, పౌర, రాజకీయ హక్కుల ఉల్లంఘన జరిగిందనీ, కాశ్మీర్ స్వేచ్ఛా ప్రాంతం కాదని ఆరోపించింది. పత్రికా స్వేచ్ఛ ర్యాంకింగ్-2023లో భారత్ స్థానం 161కి పడిపోయిందనీ, అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల హత్యల జవాబుదారీతనాన్ని పరిశీలించే సూచీలో గత 15 ఏండ్లుగా భారత్ ఉన్నదనీ, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా భారత 11వ స్థానంలో ఉన్నదని హెచ్‌ఆర్‌హెచ్ వివరించింది. ప్రపంచవ్యాప్తంగా రచయితలను జైలుకు పంపిన టాప్-10 దేశాలలో భారత్ ఒకటని 2022 పెన్ అమెరికాస్ ఫ్రీడమ్ టు రైట్ ఇండెక్స్‌ను ఉటంకించింది. 2017 నుంచి ప్రతి ఏడాదీ సామూహిక దురాగతానికి గురయ్యే ప్రమాదంలో ఉన్న టాప్-15 దేశాలలో భారత్ ఒకటిగా ఉన్నదనీ, ఇది మోడీ హయాంలో భారత రాజకీయాల విషపూరితతను ప్రతిబింబిస్తుందన్న యూఎస్ హోలోకాస్ట్ మెమోరియల్ మ్యూజియం వెల్లడించిన అంశాన్ని హెచ్‌ఆర్‌హెచ్ గుర్తు చేసింది. కౌన్సిల్ ఆన్ అమెరికన్-ఇస్లామిక్ రిలేషన్స్, ఫెడరే షన్ ఆఫ్ ఇండియన్ అమెరికన్ క్రిస్టియన్ ఆర్గనైజే షన్స్, ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్, ఇంటర్నే షనల్ కమిషన్ ఫర్ దళిత్ రైట్స్‌తో పాటు పలు సంస్థలు ఈ లేఖపై సంతకాలు చేసిన వాటిలో ఉన్నాయి.

భారత ప్రజాస్వామ్యంపై మూడు దాడులు

సంబంధించి భారతీయులను దోషులుగా గుర్తించ వచ్చని భారత సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది" అని లేఖలో పేర్కొన్నది. బిడెన్ ప్రభుత్వంలో వీటి గురిం చి ఎవరూ మాట్లాడలేదు అని వివరించింది. ఇస్లా మోఫోబిక్ హింస భారత్‌ను పట్టుకున్న తర్వాత స మ్మిట్ ఫర్ డెమొక్రసీలో మాట్లాడాలని మీరు (బిడెన్) మోడీని ఆహ్వానించారు అని ఆందోళన వ్యక్తం చేసింది.

రచయిత సల్మాన్ రష్దీకి ప్రతిష్టాత్మక జర్మన్ పురస్కారం

బెర్లిన్: ప్రముఖ రచయిత సల్మాన్ రష్దీ ప్రతిష్టాత్మక జర్మన్ పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్యంలో చేసిన విశేష కృషికి, నిరంతరం ప్రమాదాలు ఎదురవుతున్నా చెక్కుచెదరని ఆయన సంకల్పం, సానుకూల వైఖరికి గాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 22న ఫ్రాంక్ ఫర్ట్‌లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఆయన రచనల్లో కథనాత్మక దృష్టితో పాటు నిరంతర సాహిత్య ఆవిష్కరణ, హాస్యం, మరియు జ్ఞానాన్ని మిళితం చేస్తారని జ్యూరీ తెలిపింది. హింసాత్మకతో కూడిన పాలనాశక్తులు మొత్తం సమాజాన్ని నాశనం చేసే విధానాన్ని వివరించడంతో పాటు వ్యక్తుల ప్రతిఘటనను నాశనం చేయలేరని కూడా వివరిస్తారని పేర్కొంది. గతేడాది ఆగస్టులో న్యూయార్క్‌లో నిర్వహించిన ఓ సాహిత్య వేడుకలో ఆయన దాడికి గురైన సంగతి తెలిసిందే. ఆయన నిరంతరం శారీరక, మానసిక సమస్యలతో పోరాటం చేస్తున్నప్పటికీ .. ఇప్పటికీ రచనలను కొనసాగిస్తున్నారని జ్యూరీ ప్రశంసించింది.

గ్రేట్ ప్లేస్ టు వర్క్‌లో సింక్రోనీకి ఐదో స్థానం

హైదరాబాద్ : పని చేసేందుకు అత్యుత్తమ కంపెనీలో ఒక్కటిగా తమ సంస్థ నిలిచిందని ప్రీమియర్ కన్స్యూమర్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ వెల్లడించింది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా జాబితాలో తమ సంస్థ ఐదో స్థానం దక్కించుకుందని పేర్కొంది. తమ ఉద్యోగులకు సమ్మిళిత, మద్దతుతో కూడిన, స్ఫూర్తిదాయక వాతావరణం అభివృద్ధి చేయడంలో సింక్రోనీ రాజీలేని నిబద్ధతకు ఇది ప్రతీకగా నిలుస్తుందని తెలిపింది.

డప్పు చప్పుళ్లు... బైక్ ర్యాలీలు...

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద గల 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద హెూంమంత్రి మహమూద్ అలీ, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, డీజీపీ అంజనీ కుమార్, ఆర్ అండ్ బీ కార్యదర్శి శ్రీనివాసరాజులతో కలిసి తలసాని ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 10వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నగరంలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో బైక్‌లపై ర్యాలీగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలని సూచించారు. అనంతరం వేలాదిమంది కళాకారుల నృత్యాలు, డప్పు చప్పుళ్ళు, వివిధ వేషధారణలతో ర్యాలీగా వేలాదిమంది ప్రజలతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఎదురుగా నిర్మించిన అమరవీరుల స్మారక కేంద్రం వద్దకు చేరుకోవాలని కోరారు. అనంతరం సీఎం కేసీఆర్.... స్మారక కేంద్రాన్ని ప్రారంభించి అక్కడే ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారని తెలిపారు. తదనంతరం గడిచిన తొమ్మిదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే విధంగా 750 డ్రోన్ లతో భారీ షో ఉంటుందని చెప్పారు. ప్రజలు డ్రోన్ షోను వీక్షించే విధంగా ట్యాంక్ బండ్‌పై అదే రోజు సాయంత్రం రాకపోకలు నిలిపేస్తామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అమయ్ కుమార్, సమాచార శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, పలువురు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

బెంగాలీలకు రాష్ట్రావిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో స్థిరపడ్డ ఎనిమిది లక్షల మంది బెంగాలీలకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ పశ్చిమబెంగాల్ రాష్ట్రావిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వించారు. ఈ కార్యక్రమంలో ఆయా బెంగాలీ అసోసియేషన్ల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాలను కళాకారులు ఆలపించారు. గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో బెంగాలీలు భాగమయ్యారని గుర్తు చేశారు. నిజాం కాలేజీ మొదటి ప్రిన్సిపాల్ అఘోర నాథ్ ఛటోపాధ్యాయ, ఆయన పిల్లలు హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ, సరోజినీ నాయుడు తమ గోల్డెన్ త్రిషోల్డ్ ఇంటిని 1974లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వివిధ రంగాల్లో సేవలందించిన బెంగాలీ ప్రముఖులను గుర్తుచేసుకున్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు

బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. యోగా, ధ్యానం, ప్రాణాయామాలు కోవిడ్-19 వల్ల ఏర్పడిన మానసిక, శారీరక ప్రభావాలను అధిగమించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.

వర్సిటీ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ చైర్మెన్‌గా శ్రీధర్‌కుమార్ లోధ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ నూతన కమిటీ ఎన్నికైంది. ఈ జేఏసీ నూతన చైర్మెన్‌గా కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం జూమ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రాజేష్ కన్నా, చైర్‌పర్సన్‌గా పల్లా రేష్మారెడ్డి, వర్కింగ్ చైర్మెన్‌గా డాక్టర్ రామేశ్వరరావు, కో చైర్మెన్‌గా డాక్టర్ ఎస్ రవికుమార్‌తోపాటు మరో 47 మందిని ఎన్నుకున్నారు. విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ దశలవారీగా కార్యాచరణను రూపొందించారు. బుధవారం ఉన్నత విద్యామండలి అధికారులను కలుస్తారు. ఈనెల 22న వినూత్న నిరసన, 23న పరిపాలన భవనం ముందు ధర్నా, 24న అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు ఇస్తారు. 26న కాలేజీల ముందు ధర్నా, 27న వినూత్న నిరసన, 28న విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, సీఎస్ శాంతికుమారిని కలిసి వినతిపత్రం సమర్పిస్తారు. 29న అధికారులకు వినతిపత్రాల సమర్పణ, 30న విశ్వవిద్యాలయాల్లో ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ముగిసిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- జులై మొదటివారంలో ఫలితాలు విడుదల

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈనెల 12 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వర కు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించారు.



కేసుల దర్యాప్తుల్లో న్యాయపరమైన చిక్కులపై దృష్టి పెట్టండి

డీఎస్పీలు, అదనపు ఎస్పీలకు న్యాయ నిపుణుల సూచనలు

- డీజీపీ కార్యాలయం నుంచి అధికారులకు ఆన్‌లైన్ వర్క్‌షాప్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

క్లిష్టమైన కేసుల దర్యాప్తుల్లో న్యాయపరంగా చిక్కులు ఎదురుకాకుండా తగిన శ్రద్ధ వహించాలని పోలీసు అధికారులకు న్యాయ నిపుణులు సూచించారు. డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు మంగళవారం డీజీపీ కార్యాలయం నుంచి ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వర్క్‌షాప్‌లో పోలీసు లీగల్‌సెల్ విభాగానికి చెందిన న్యాయ నిపుణులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్, సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్, డీజీపీ, ఉన్నతాధికారులకు న్యాయ సలహాదారుడైన ప్రముఖ న్యాయవాది రాములుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయ నిపుణులు మాట్లాడుతూ.. కేసు నమోదు చేయటంలో వహిస్తున్న శ్రద్ధ తదుపరి దర్యాప్తుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లోపిస్తున్నదనీ, కొందరు దర్యాప్తు అధికారుల్లో ఉన్న నిర్లక్ష్యం కూడా దీనికి కారణమవుతున్నదని వారు అన్నారు. నేరాలు చేసిన వారికి కోర్టులలో శిక్షలు పడితేనే నిందితులలో భయాన్ని పాదుగొలపగలమనీ, అదే సమయంలో బాధితులకు న్యాయం కూడా జరుగుతుందని డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. కేసులు కోర్టులలో వీగిపోకుండా ఉండాలంటే దర్యాప్తు ప్రారంభం నుంచి ఆ కేసుకు సంబంధించిన న్యాయ నిపుణులతో తగిన సలహాలు, సూచనలు తీసుకొని ముందుకు సాగితేనే చక్కటి ఫలితాలు లభిస్తాయని ఆయన అన్నారు. నేరాలకు పాల్పడ్డ నిందితులు ఆ కేసు నుంచి తప్పించుకోవటానికి చట్టపరమైన లొసుగులను ఎప్పుడూ అన్వేషిస్తూనే ఉంటారనీ, వారికి ఆ అవకాశాన్ని ఇవ్వకుండా శాస్త్ర, సాంకేతిక పరంగా తగిన ఆధారాలను సేకరించాల్సినవసరం ఉన్నదనీ, అప్పుడే నేరస్థుల జిత్తులు పారకుండా ఉంటాయని పోలీసు లీగల్ సెల్ విభాగానికి చెందిన అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కొన్ని క్లిష్టమైన కేసులకు సంబంధించి వివిధ ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు, అదనపు ఎస్పీలు అడిగిన పలు ప్రశ్నలకు న్యాయ నిపుణులు సమాధానాలిచ్చారు.

కాశ్మీర్‌లో ఎస్ఐఏ సోదాలు

- సోషల్ మీడియా దుర్వినియోగం పేరుతో...

శ్రీనగర్: సోషల్ మీడియా దుర్వినియోగానికి సంబంధించిన కేసులో జమ్ముకాశ్మీర్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎస్ఐఏ) మంగళవారం సోదాలు జరిపింది. లోయలోని నాలుగు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. పలు మొబైల్ ఫోన్స్, సిమ్ కార్డులతో పాటు ఇతర డిజిటల్ వస్తువులను సీజ్ చేసినట్టు వివరించారు. వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వేర్పాటువాద, భారత వ్యతిరేక భావాలను ప్రచారం చేయడంలో ప్రమేయం ఉన్న వ్యక్తులు, బృందాలను గుర్తించే లక్ష్యంతో ఈ సోదాలు చేపట్టినట్టు తెలిపారు.

అటకెక్కిన ఎంబీసీ కార్పొరేషన్..

ఆరంభంలో హంగామా... ఆ తర్వాత నిస్తేజం
ఆ ఏడాదికి వెయ్యి కోట్లు అని ప్రకటించినా..

మంజూరు చేసింది రూ.350 కోట్లే.

- రెండేండ్లుగా ఖాళీగా చైర్మెన్ పోస్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అత్యంత వెనకబడిన కులాల కోసం ఒక కార్పొరేషన్.. దానికి ఒక చైర్మెన్.. వేల కోట్ల నిధుల కేటాయింపు.. ఇదంతా విని కుల వృత్తులకు మంచి రోజులొచ్చాయని అంతా అనుకున్నారు. కానీ వాస్తం మరోలా ఉంది. 'రాష్ట్రంలో అత్యంత వెనకబడిన తరగతుల (ఎంబీసీ) కార్పొరేషన్ ఏర్పాటు చేసి సుమారు ఐదేండ్లు దాటుతున్నా.. లబ్దిదారులకు ఆశించిన స్థాయిలో ఒరిగిందేమీ లేదు. ఎంబీసీ చైర్మెన్‌కు మాత్రం మూడేండ్లు వేతనం చెల్లించారు. మిగిలిన నిధులు ఇతర ప్రభుత్వ పథకాలకు దారి మళ్లించారు. కార్పొరేషన్ చైర్మెన్ పదవీకాలం ముగియడంతో రెండేండ్లుగా ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు ఎంబీసీల అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు రెండోసారి అధికారంలోకి వచ్చినా అమలుకు నోచుకోవడం లేదని వెనకబడ్డ కుల, వృత్తి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఎంబీసీ నివేదిక ఎటుపాయే..?

స్వయంగా సీఎం కేసీఆర్ 2018లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటన చేస్తూ.. బీసీ ఎమ్మెల్యేలతో సమావేశమై ఎంబీసీల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి? ఏ పథకాలు వారి అభివృద్ధికి లబ్ది చేకూరుస్తాయి? ఇలా అనేక అంశాలపై చర్చించి ప్రతిపాదనలు చేయాలని సూచించారు. తర్వాత అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్న టీఆర్ఎస్‌కు చెందిన బీసీ ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్యే కె. లక్ష్మణ్, ఆర్ కృష్ణయ్య తదితరులు రెండు రోజులపాటు సమావేశమయ్యారు. అనేక అంశాలపై చర్చించి పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత అప్పటి మంత్రి ఈటల రాజేందర్ అధ్యక్షతన మంత్రులు జోగు రామన్న, తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమావేశమయ్యారు. ప్రతిపాదనలపై చర్చించి వాటికి తుదిరూపు ఇచ్చి ఎంబీసీ నివేదిక రూపొందించారు. ఆ నివేదికను సీఎం కేసీఆర్‌కు అందజేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ నివేదిక గురించి ఊసే లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఎంబీసీ కార్పొరేషన్ ఒకటుందనే విషయాన్ని కూడా పట్టించుకోవటం లేదని వెనుకబడిన కుల సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఆ కార్పొరేషన్ కార్యాలయాలు మట్టికొట్టుకు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన ప్రకటనకు, ప్రతిపక్షాల ఎమ్మెల్యేలతో జరిగిన ప్రత్యేక సమావేశాలకు అర్థం లేకుండా పోయిందంటూ విమర్శలు చేస్తున్నారు.



కార్పొరేషన్ ఏర్పాటు సరే..

ఎంబీసీ కార్పొరేషన్‌ను ప్రభుత్వం 2017లో ఏర్పాటు చేసింది. కార్పొరేషన్ చైర్మెన్‌గా తాడూరి శ్రీనివాస్‌ను నియమించింది. కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు అధికార యంత్రాంగం, విధి విధానాలు ఇలా అన్ని కార్యకలాపాలు మొదలయ్యాయి. కార్పొరేషన్‌కు ప్రతి ఏడాది రూ. రెండు వేల కోట్లు కేటాయిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు 2017-18లోనే ఎంబీసీలకు పథకాలు అమలు చేస్తారని అనుకున్నప్పటికీ అవేమీ జరగలేదు.

మొదటి మూడేండ్లలో రూ.2,400 కోట్లు

ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు అనంతరం మొదటి మూడు సంవత్సరాల్లో ప్రభుత్వం సుమారు రూ.2,400 కోట్లు కేటాయించింది. మంజూరు చేసింది మాత్రం కేవలం రూ. 350 కోట్లు మాత్రమే. అందులోనూ కార్పొరేషన్ ఖాతాలో జమ అయింది వంద కోట్ల లోపు మాత్రమే. లబ్ధిదారులకు చేరింది కేవలం రూ. 10 కోట్లు లోపే. ఒక 2020-21 బడ్జెట్‌లో బీసీలు, ఎంబీసీలకు కలిపి.. రూ. 500 కోట్లు, 2021-22 బడ్జెట్లో వెయ్యి కోట్లు కేటాయించినా...వాటి ఖర్చు విషయంలోనూ పాత విధానాన్నే కొనసాగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వేలాది మంది కార్పొరేషన్ ద్వారా రుణాలకోసం దరఖాస్తులు చేసుకున్నా..వాటికి మోక్షం రావటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడు కొత్తగా కుల వృత్తులకు రూ.లక్ష సాయమంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం అమలు పేరుతో కార్పొరేషన్‌ను అటకెక్కిస్తారేమోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐలూ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా విద్యాసాగర్



నవతెలంగాణ - భువనగిరి

భువనగిరిలో ఈ నెల 17, 18న జరిగిన ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర మహాసభలో 47 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కె.పార్థసారథి, కోశాధికారిగా వేణుగోపాల్‌రావు ఎన్నికయ్యారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా విద్యాసాగర్ నియమి తులయ్యారు.

కన్నుల పండుగగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి తలసాని శ్రీనివాస్ దంపతులు
- హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



నవతెలంగాణ-బేగంపేట్

హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఎల్లమ్మ కల్యాణం మంగళవారం కన్నుల పండుగగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, స్వర్ణ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. మంత్రి దంపతులకు ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి వస్త్రాలు సమర్పించిన అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో సందర్శకులు అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చారు. దాంతో ఆలయ ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. మంత్రి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి బాల్‌రెడ్డి, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కార్యక్రమానికి బస్సు పంపలేదని.. స్కూల్ ముందు గుంతలు తవ్విండ్రు





నవతెలంగాణ-బోడుప్పల్

మంత్రి మల్లారెడ్డి పాల్గొన్న ఓ కార్యక్రమానికి స్కూల్ బస్సు పంపలేదనే కక్షతో స్కూల్ ముందు గుంతలు తవ్వించారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్‌లో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. సోమవారం మేడిపల్లిలో హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. అయితే, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గ్లోబల్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి బస్సుతోపాటు విద్యార్థులను ఆ కార్యక్రమానికి పంపాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదేశించారు. అయితే పాఠశాల యాజమాన్యం విద్యార్థులను మాత్రమే పంపింది. దాంతో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే మంగళవారం పాఠశాల ప్రధాన ద్వారం వద్ద జేసీబీతో గుంతలు తవ్వించారు. దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఘటన స్థలానికి వెళ్లి జరిగిన విషయం తెలుసుకుని గుంతలు తీసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం లేదని.. దీనిపై విచారణ జరుపుతామన్నారు.

గిరిజన సమస్యలను పరిష్కరించాలి

- ఎస్టీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శికి వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మ నాయక్, ఆర్ శ్రీరాం నాయక్, నాయకులు వి రామ్‌కుమార్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అంజయ్య నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి క్రిష్టినా చోంగ్తూను కలిసి వినతి పత్రం సమర్పించారు. పోడుభూముల హక్కుపత్రాలను ఎలా పంపిణీ చేస్తున్నారో స్పష్టత ఇవ్వాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రభుత్వం జూన్ 24 నుంచి 30 వరకు పత్రాలను పంపిణీ చేస్తున్నట్టు ప్రకటించినా ఇంతవరకు జిల్లా స్థాయిలో ఎక్కడ,ఎవరిద్వారా పంపిణీ చేస్తున్నారు? అనే విషయం తెలియడం లేదన్నారు. లబ్ధిదారుల లిస్టులను గోప్యంగా ఉంచడం వల్ల ఆందోళన నెలకొన్నదని గుర్తుచేశారు. అసెంబ్లీలో సీఎం ప్రకటించిన విధంగా 11.50 లక్షల ఎకరాల పై హక్కులు కల్పించే విధంగా నోడల్ అధికారిగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. గత రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ రుణాలను తక్షణం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకోసం యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురుకులాలు, కాలేజీ హాస్టళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న గిరిజన విద్యార్థులందరికీ సీట్లు ఇవ్వాలని కోరారు. గురుకులాలు, హాస్టళ్లు సరిపడా లేనందున నూతన భవనాలను నిర్మించాలని, ఉస్మానియా యూనివర్సిటీ,హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు అనుబంధంగా హాస్టల్ భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. గిరిజన బెస్ట్ అవైలబుల్ పథకంలో 6వేల సీట్లు మాత్రమే ఉన్నాయనీ, దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా 15 వేలకు పైగా ఉన్న నేపథ్యంలో మరో 2,000 సీట్లను తక్షణం పెంచాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని జిల్లాల్లో అవినీతికి పాల్పడుతున్న డీటీడీఓ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ కమ్యూనిస్టు లక్ష్మీదాస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కార్మికోద్యమ నాయకుడు, మాజీ ఎంపీ కామ్రేడ్ పి లక్ష్మీదాస్ ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఐ(ఎం) మాజీ నగర కార్యదర్శి జి. రఘుపాల్ అన్నారు. కార్మిక ఉద్యమనిర్మాణంలో ఆయన ప్రశంసనీయమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. మంగళవారం ఎస్‌వీకేలో లక్ష్మీదాస్ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) మాజీ నగర కార్యదర్శి పిఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీకే మేనేజింగ్ కార్యదర్శి ఎస్ వినయకుమార్, కమిటీ సభ్యులు జి బుచ్చిరెడ్డి, ఎస్‌వీకే సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగం కార్మికులతోపాటు ఎన్ఎంఆర్ , వర్క్‌చార్జ్‌డ్ కార్మికుల కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ఎస్‌వీకేలో ఆయన పేరుతో క్లినిక్, లాబొరేటరీ నడుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అట్టడుగు ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలని సిబ్బందికి సూచించారు.

ప్రాథమిక ఆస్పత్రిలో మెడిసిన్ దహనం

- కాలం చెల్లిందాక గదిలో పెట్టి వృథా చేశారు



నవతెలంగాణ-చివ్వెంల

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులను కాల్చేశారు. సమయానికి రోగులకు ఇవ్వకుండా మందులను మూలనపెట్టి.. కాలం చెల్లాక గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రి వెనకాల తగులబెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పేద ప్రజలు ప్రయివేట్ ఆస్పత్రులకు పోయి రూ.లక్షలు ఖర్చు పెట్టుకొనే స్థోమత లేక ప్రభుత్వ దవాఖానకు వెళ్తే సరైన చికిత్స, సరిపడా మందులు లేవని చెప్పి తిరిగి పంపిస్తున్నారు. చివరకు మందులను తగలబెట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెడిసిన్ కాలం చెల్లే వరకు రూములో స్టోర్ చేసి, కాల్చి వేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్థానిక డాక్టర్‌ను విలేకరులు వివరణ కోరగా.. ఏమి రాసుకుంటారో రాసుకోండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నా.. జిల్లా వైద్యాధికారి అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యాధికారుల పర్యవేక్షణ లోపించిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా మంత్రి దృష్టి సారించి.. మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ చేపడతాం : డీఎంహెచ్ఓ కోటాచలం

రోగులకు అందివ్వాల్సిన మందులను తగలబెట్టకూడదు. దీనిపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

కేసీఆర్ కృషితోనే రామప్ప గుడికి యునెస్కో గుర్తింపు

- మంత్రి శ్రీనివాసగౌడ్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ కృషితోనే రామప్ప గుడికి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు లభించిందని రాష్ట్ర ఎక్సైజ్, పురావస్తు శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలోనారాయణపేట జిల్లా ముడుమాల్ గ్రామంలో ఉన్న ప్రముఖ పురావస్తు కట్టడాన్ని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు కోసం అవసరమైన డాక్యుమెంటేషన్, పరిరక్షణకు, సాంకేతికమైన సేవలు అందించేందుకు తెలంగాణ హెరిటేజ్ శాఖ, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్‌ల మధ్య జరిగిన పరస్పర ఒప్పంద పత్రాలను మంత్రి అందజేశారు. తెలంగాణ హెరిటేజ్ శాఖ, దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్ చైర్మెన్ వేదకుమార్, తెలంగాణ హెరిటేజ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్, హెరిటేజ్ అకాడమీ ట్రస్టు ప్రతినిధులు కట్ట ప్రభాకర్, ప్రొఫెసర్ కేపీరావు తదితరుల పాల్గొన్నారు.

పోలవరం పోరుకేక | మహా పాదయాత్ర ప్రారంభం

- జెండా ఊపి ప్రారంభించిన ఏఐకేఎస్ జనరల్ సెక్రెటరీ విజ్జూ కృష్ణన్
- మండుటెండలో, జోరు వానలో సాగిన పాదయాత్ర



ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా):

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో మంగళవారం పోలవరం పోరు కేక మహా పాదయాత్రను ఆల్ ఇండియా కేంద్ర కిసాన్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. నిర్వాసితులు పూలమాల వేసి పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు.

గిరిజన డోలు కొమ్ము రేల నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గిరిజన సంప్రదాయ రేలా నృత్యాన్ని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్, తెలంగాణ రాష్ట్ర సీపీఐ(ఎం) నాయకులు పోతినేని సుదర్శన్, సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు కళాకారులతో కలిసి నృత్యం చేశారు. నెల్లిపాక ప్రధాన కూడలి వద్ద భారీ సంఖ్యలో సీపీఐ(ఎం)కార్యకర్తలు అభిమానులు నిర్వాసితులు పాల్గొని పాదయాత్రను విజయవంతంగా ప్రారంభించారు. పాదయాత్ర కాపవరం, బుట్టాయిగూడెం, సీతాపురం మీదుగా తోటపల్లి చేరుకుంది. తోటపల్లిలో భోజనం చేసిన అనంతరం గన్నవరం గౌరీదేవిపేట, నందిగామ మీదుగా మురుమూరు చేరుకుంది. మురుమూరులో రాత్రి బస చేశారు.

నెల్లిపాకలో ఏర్పాటుచేసిన సభకు కార్యకర్తలు, నిర్వాసితులు ట్రాక్టర్లలోను, ఆటోల్లోనూ, మోటార్ బైకులపై వందలాదిగా తరలివచ్చారు. ఎర్రని ఎండను సైతం లెక్కచేయకుండా, జోరున వర్షంలో తడుచుకుంటూ ఎర్రజెండాలతో పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయ కొమ్ము డోలు ధరించిన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, విజ్జూ కృష్ణన్, తెలంగాణ సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు సంబంధించి పుస్తకావిష్కరణ, ప్రత్యేక పాటల సీడీని ఆవిష్కరించారు. సభ ముగింపులో పాదయాత్ర సారధి వి.శ్రీనివాసరావు వాలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

భగీరథ ప్రయత్నం

- మంచినీరు కోసం బావి పూడిక తీసిన గ్రామస్తులు
- జైనూర్ మండలం పట్నపూర్ వాసుల ఐక్యత

నవతెలంగాణ- జైనూర్

ఎవరి కోసం ఎదురు చూడకుండా తమ ప్రాంతంలో ఉన్న మంచినీటి సమస్యను సొంతంగా పరిష్కరించుకునేందుకు ఆ ఊరు గ్రామస్తులు నడుం బిగించారు. భగీరథ ప్రయత్నమే చేశారు. ఊరిలో ఉన్న పెద్దబావిలో పూడిక తీశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నపూర్ గ్రామంలో మంచి నీటి సమస్యతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఒకవైపు ఎండలు, మరోవైపు మంచినీరు వచ్చే ప్రత్యామ్నాయ మార్గాలు లేవని గ్రామస్తులు అంటున్నారు. మూగజీవాలకు నీరు కరువు ఏర్పడింది. అందరికీ బావి నీరే దిక్కు..దీంతో సిద్దేశ్వర్ యూత్, పట్నపూర్ యువత ఒక్కటై గ్రామానికి కిలో మీటర్ దూరంలో ఉన్న మంచి నీటి భావిలో నీరు అడుగున చేరడంతో పూడిక తీశారు. మంచి నీరు వచ్చే భావి పూడిక తీసి ఆదర్శంగా నిలిచారు. గ్రామ సర్పంచ్ ఖండరే బాలాజీ గ్రామ పటేల్ హన్మంతరావు లింగు దంబి పటేల్ పవన్ పట్నపూర్ సిద్దేశ్వర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



నిలిచిన పాడి ప్రోత్సాహకం

పాడి రైతులకు రూ.12 కోట్ల బకాయిలు

- నిధులు రాగానే ఖాతాల్లో జమ చేస్తాం: జిల్లా అధికారి

నవ తెలంగాణ - అచ్చంపేట

ప్రభుత్వ విజయ డెయిరీ పాల రైతులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం ఆగిపోయింది. నాగర్ కర్నూల్ జిల్లాలో 2020 మే నుంచి 4 రూపాయల ప్రోత్సాహం నిధులను ప్రభుత్వం విడుదల చేయడం లేదు. విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు లీటర్ ధరపై అదనంగా ప్రభుత్వం 4 రూపాయలు ఇస్తామని ప్రకటించింది. ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించి రైతులు మోసపోకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న విజయ డెయిరీలోనే పాలు అమ్ముకునేలా ప్రోత్సాహకం అమలు చేసింది. కానీ ఆ నిధులు ఆగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాగర్ కర్నూల్ జిల్లాలో విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతుల సంఖ్య పెరిగింది. పాల సేకరణ కూడా పెరుగుతున్నది. జిల్లా వ్యాప్తంగా పాడి రైతులకు 12 కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉంది. ఆవు పాలు లీటరు ధర 42 నుంచి 49 రూపాయలు చెల్లిస్తున్నారు. గేదె పాలు లీటరుకు 40 రూపాయల నుంచి 80 రూపాయల వరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. పాలలో ఉన్న ఫ్యాట్ ప్రకారంగా ధర ఖరారు చేస్తారు. అచ్చంపేట నాగర్ కర్నూల్, వెల్దండ, కుప్పగండ్ల, మాదారం, ఊరకొండ, గూడూరు, కల్వకుర్తిల్లో పాలశీతలీకరణ కేంద్రాలు రైతుల నుంచి పాలు సేకరిస్తున్నాయి. రోజుకు 62 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. మొత్తం 7200 మంది రైతులు ప్రభుత్వ విజయ డెయిరీకి పాలు పోస్తున్నారు. విజయ డెయిరీకి పాలు పోయాలని రైతులను ప్రోత్స హించడానికి ప్రభుత్వం లీటర్ ధరపై అదనంగా నాలుగు రూపాయల ప్రోత్సా హం చెల్లిస్తూ వస్తోంది. కానీ మూడేండ్ల నుంచి ప్రోత్సాహక నిధులు నిలిచిపో వడంతో రైతులు నిరుత్సాహంతో ఉన్నారు. మరోపక్క ప్రయివేటు డెయిరీ నిర్వాహకులు పాడి రైతులకు ముందుగానే అడ్వాన్స్ రూపంలో నగదు చెల్లించి పాలు పోయించు కుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాల ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



పట్టణంలోని పాల సేకరణ కేంద్రం

రూ.12 కోట్ల బకాయిలు ఉన్నాయి

విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు లీటర్ ధరపై అదనంగా ప్రోత్సాహం కింద 4 రూపాయలు కలిపి చెల్లిస్తున్నాం. అయితే, మూడేండ్లుగా ప్రోత్సాహక నిధులు నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 7200 మంది రైతులకు సంబంధించి రూ.12 కోట్లు బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే రైతుల ఖాతాలో జమ చేస్తాం.

సత్యనారాయణ, విజయ డెయిరీ జిల్లా అధికారి

ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలి



ప్రభుత్వ విజయ డెయిరీకి పాలు పోస్తున్న. లీటరు పాల ధరపై అదనంగా నాలుగు రూపాయలు ప్రోత్సహకం కింద ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ డబ్బులు ప్రభుత్వం నిధులను వెంటనే విడుదల చేయాలి.

- రైతు సాయిబాబు, రాయిచేడి గ్రామం


సంపాదకీయం

వానమ్మా... రావమ్మా...

నైరుతి రుతుపవనాల ఆలస్యంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వానాకాలం సాగు అదును దాటుతున్నది. మూడు వారాలవుతున్నా వరుణుడు కరుణించక, వర్షాల కోసం రైతులు ఆకాశానికేసి చూసే దుస్థితి. వర్షపాతం మైనస్‌కు పడిపోగా, ఉష్ణోగ్రత 44డిగ్రీలకు చేరింది. 16జిల్లాల్లో వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో పంటల సాగు కాస్త డైలమాలో పడింది. ప్రత్యామ్నాయం వైపు ఆలోచన తప్పకపోవచ్చు. సాధారణంగా రుతుపవనాలు జూన్ 10న కేరళ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించి వానలు పడాలి. కానీ, ఈ ఏడాది అవి బలహీనడటంతో తొలకరి జాడే లేదు.

> తాజాగా సోమవారం సీఎం కేసీఆర్ సైతం వర్షాలు, వ్యవసాయం, సాగునీటి అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తూ చెరువుల్లో నీటిని నింపాలని ఆదేశించారు. అది మంచిదే. కానీ, అదనపు చర్యలు కచ్చితంగా తీసుకోవాల్సిందే. మొదటిసారి విత్తనాలు నష్టపోయిన రైతులకు వాటిని ఉచితంగా అందించడం, విత్తనాలు బ్లాక్‌మార్కెట్ కాకుండా జాగ్రత్త పడటం, చివరి ఆయకట్టుదాకా నీరు చేరడానికి ఆయా ప్రాజెక్టుల లైనింగ్ కాలువలను సరిచేయడం, నాణ్యతలేని విత్తనాలు అమ్మే వ్యాపారుల లైసెన్స్‌లను రద్దుచేయడం, ఒకవేళ వర్షాభావ పరిస్థితులొస్తే ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను మళ్లించడం ప్రధానం.

సాధారణంగా బోర్లు, బావుల్లో నీరుంటే నిజామాబాద్, కామారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో ముందస్తుగానే సాగు చేస్తారు. కాగా, తొలకరి పలకరించకపోవడంతో అక్కడా సాగుకు మొగ్గుచూపడంలేదు. ఎల్‌నినో ప్రభావంతో మేఘాలు ఏర్పడటంలో కదలికల్లేవు. వానాకాలంలో సుమారు కోటి 30లక్షల మేర సాగుచేస్తారు. ఇప్పటికే 20లక్షల ఎకరాల్లో విత్తనాలేసినా, తొలకరి లేక సగం కూడా మొలకెత్తలేదు. సుమారు 70శాతం మంది రైతుల నాగళ్లకు పనేలేదు. పత్తి సాగుకు ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో విత్తనాలు చల్లారు. నిజామాబాద్, మహబూబాబాద్, నిర్మల్, వరంగల్, ములుగు జిల్లాల్లో వర్షాభావంతో ఎండిపోతుండటం ఆందోళనకరం. రోహిణి కార్తెలో మే 25 నుంచి సాగుకు శ్రీకారం చుడతారు. జూన్ 10 నుంచి 25 వరకు మృగశిర నడుస్తుంది. ఈ కాలంలో పంటలేస్తే రోగాలు అంటవు. ఆరుద్రలో పురుగు విపరీతంగా ఆశించి పంటలు పోతాయి. అయితే రెక్కల పురుగులు, ఆరుద్ర పురుగులు, బల్లిపాత్ర తదితర క్రిమికీటకాలతో పంటలకు మేలే. పంటలపై ఫెరిత్రాయిడ్ ఫెస్టిసైడ్స్ కొడితే మాత్రం లాభం చేసే క్రిములూ చనిపోతాయి. అందుకే విత్తిన 90రోజులదాకా, ఆ మందులు చల్లొద్దనే సర్కారు నిబంధనలే ఉన్నాయి. కాగా కార్పొరేట్ కంపెనీలు, మందుల దుకాణాల యాజమాన్యాలు మాత్రం తమ లాభాల కోసం ఫెస్టిసైడ్ వాడకాన్ని విపరీతంగా ప్రోత్సహిస్తున్నాయి. రైతులను మోసం చేస్తున్నాయి. ఇదిలావుంటే, ముందస్తు సర్కారు వ్యవసాయ ప్రణాళికతో వీటిని ఎదుర్కోవచ్చు.



అంటార్కిటికా సముద్రంలోని వేడిగాలులతో అక్కడున్న తేమ ఆవిరై, మబ్బుల్లోనే నీరు కరుగుతున్నది. అదే 'ఎల్‌నినో'. దాని ఫలితమే రుతుపవనాల ఆలస్యం. ఎండల వేడితగ్గాకనే వర్షాలు కురుస్తాయని అంటున్నది వాతావరణ శాఖ. అప్పటిదాకా విత్తనాలు వేయొద్దంటూ సర్కారు చావు కబురు చల్లగా చెబుతోంది. ఈ ఏడాది ఉగాది పంచాంగం ప్రసంగాల్లో వర్షాలు భారీగా కురుస్తాయని ప్రచారం చేశారు. దీన్ని నమ్మి రైతులు మృగశిరలో పత్తి, మొక్కజొన్న, వేరుశెనగను లక్షల ఎకరాల్లో సాగుచేశారు. అయితే వానల్లేక వేసిన విత్తనాలకు పురుగులు ఆశించి, 50శాతం మేర ఆదిలోనే దెబ్బతిన్నాయి. కూలీ, విత్తనాలు, సాగు అవసరాలకుగాను రైతులు ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి పెట్టారు. అలాగే మార్కెట్లో 450గ్రాముల విత్తనాల ప్యాకెట్లను రూ.930కి గాను, రూ.1500కి పెంచి విక్రయిస్తుండటం విడ్డూరం. గత ఏడాది దిగుబడి బాగా వచ్చిందనే పేరుతో బ్రాండెడ్ కంపెనీ అయిన రాశీ 659లాంటి విత్తనాల కోసం స్థానిక రైతులతోపాటు కర్నాటక వారూ ఎగబడుతున్నారు. అవేకాకుండా మొక్కజొన్న, నూనెగింజల విత్తనాలు మార్కెట్లో అందుబాటులో లేవు. వీటిపై వ్యవసాయశాఖకు నియంత్రణే లేదు. నీమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో సాగుతగ్గే అవకాశం ఉంది. అలాగే కరువూ ఏర్పడే పరిస్థితులూ రావచ్చు. ప్రస్తుతం అన్నిరకాలు కలిపి 20లక్షల క్వింటాళ్ల విత్తనాలు కావాలి. కానీ, సర్కారు దగ్గర 22లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని ప్రకటించింది. ఒకవేళ అదే నిజమైతే, ఇప్పుడు విత్తనాల ధరలు ఎందుకు పెరుగుతున్నట్టు? అంతేగాక నాణ్యతలేని విత్తనాల వ్యాపారం జోరుగా సాగుతుండటం దేనికి సంకేతం? ప్రభుత్వం చెప్పిన గణాంకాలే ఆందోళన కలిగిస్తున్నాయి. గత రెండేండ్లుగా వందల మంది అక్రమార్కులు పట్టుబడటం, ఆ కేసులకు సంబంధించి నిందితులకు శిక్షలు పడకుండా తప్పించుకోవడం సర్కారు చిత్తశుద్ధిని తెలిపేదే. తాజాగా సోమవారం సీఎం కేసీఆర్ సైతం వర్షాలు, వ్యవసాయం, సాగునీటి అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తూ చెరువుల్లో నీటిని నింపాలని ఆదేశించారు. అది మంచిదే. కానీ, అదనపు చర్యలు కచ్చితంగా తీసుకోవాల్సిందే. మొదటిసారి విత్తనాలు నష్టపోయిన రైతులకు వాటిని ఉచితంగా అందించడం, విత్తనాలు బ్లాక్‌మార్కెట్ కాకుండా జాగ్రత్త పడటం, చివరి ఆయకట్టుదాకా నీరు చేరడానికి ఆయా ప్రాజెక్టుల లైనింగ్ కాలువలను సరిచేయడం, నాణ్యతలేని విత్తనాలు అమ్మే వ్యాపారుల లైసెన్స్‌లను రద్దుచేయడం, ఒకవేళ వర్షాభావ పరిస్థితులొస్తే ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను మళ్లించడం ప్రధానం. అలా చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడమేగాక, నిజంగా వ్యవసాయం పండుగే అవుతుంది.

విదేశాల్లో చైనా పోలీస్ స్టేషన్ల కట్టుకథలు, పిట్టకథలు!



ఎం. కోటేశ్వరరావు

ఒకటి మాత్రం వాస్తవం. ప్రస్తుతం ప్రపంచంలో కరోనా తీవ్రత తగ్గిన తరువాత వివిధ దేశాల ఆర్థిక రంగాలు ఎలా కోలుకుంటాయి, ఉక్రెయిన్ సంక్షోభం ఎలా ముగుస్తుంది. చైనా ఆర్థిక వ్యవస్థ ఏమవుతుంది అన్నవి ఎక్కువగా చర్చలో ఉన్న అంశాలు. కొద్ది రోజులుగా చైనా ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల గురించి సోషల్ మీడియా, సంప్రదాయ మీడియాలో కూడా కొందరు తెగ స్పందిస్తున్నారు. విదేశాల్లో చైనా పోలీస్ స్టేషన్లంటూ ప్రచారం సాగుతున్నది. ప్రపంచ ఆర్థిక రంగంతో చైనా ముడిపడి ఉన్నంతగా ప్రపంచంలో ప్రస్తుతం మరొక దేశం లేదని గ్రహించాలి. 2018 తరువాత తొలిసారిగా చైనా పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చైనా మంత్రి క్విన్ గాంగ్‌తో రహస్య చర్చలు జరిపినట్లు జపాన్ వార్తా సంస్థ నిక్కెయి పేర్కొన్నది. దాపరికం ఏమీ లేదు, చైనాతో అమీతుమీ తేల్చుకొనేందుకు సిద్ధం అంటూ చొక్కా చేతులు మడుస్తున్న అమెరికా మూసిన తలుపుల వెనుక ఏమి చర్చించి ఉంటుంది. రెండు దేశాల సంబంధాల గురించి సుభాషితాలు చెప్పటం కాదు, ఆచరణలో చూపండి అని చైనా అధినేత షీ జిన్‌పింగ్ చెప్పినట్లు వెల్లడైంది. మరోసందర్భంలో దాని గురించి చూద్దాం.

చైనా ఆర్థిరంగం మందగించిందంటూ అనేక కథనాలు వెలువడుతున్న తరుణంలో అమెరికా విదేశాంగ మంత్రి బీజింగ్ వచ్చాడు. అందరూ చెబుతున్నట్లు నిజంగా ఆర్థికంగా కుంగిపోతుందా? గడచిన నాలుగు దశాబ్దాలుగా అనేక మంది ఇలాంటి కథలు వినిపిస్తూనే ఉన్నారు. మరింకేమీ పని లేనట్లు కొందరు వాటిని మన జనానికి సరఫరా గొలుసు ద్వారా పంపిణీ చేస్తున్నారు. కాళిదాసు కవిత్వానికి తమ పైత్యం జోడిస్తున్నారు. మే నెలలో ఆర్థిక పరిస్థితి గురించి ప్రతి ప్రభుత్వం వివరాలను వెల్లడిస్తున్నది. మన సర్కార్ మాదిరే చైనా కూడా అదే చేసింది. ఏప్రిల్ మాసంతో పోలిస్తే ఆర్థికరంగం పురోగతి మందగించిందని పేర్కొన్నది. దాన్ని చూపి ఇంకేముంది ఫినిష్ అన్నట్లుగా సంబరపడి పోతున్నారు. వేగం తగ్గటం వేరు, ప్రతికూల వృద్ధి నమోదు వేరు. చైనా తనను తాను సమర్థించుకోగలదు,లోపాలు ఉంటే సరిచేసుకోగలదు. దాన్ని ఎవరూ భుజాన వేసుకొని మోయాల్సిన అవసరం లేదు. వామపక్ష శక్తులే కాదు, ఇతరులకూ అక్కడి పరిణామాల వాస్తవాలను తెలుసు కోవాలన్న ఆసక్తి ఉన్నవారి కోసం కొన్ని మాటలు చెప్పుకోక తప్పదు. అంతర్జాతీయ వాతావరణం ఇప్పటికీ సంక్లిష్టంగాను, తీవ్రంగా ఉందని, ప్రపంచ ఆర్థిక పరిస్థితి స్తబ్దుగా ఉందని, తమ ఆర్థికరంగం సరిగానే కోలుకుంటున్నప్పటికీ, మార్కెట్ గిరాకీ ఇంకా తక్కువగా ఉందని చైనా ప్రతినిధి విలేకర్లతో చెప్పారు. ఏ రంగంలో ఎంత పురోగతి ఉంది, దేనిలో ఎంత తిరోగమనం ఉందో కూడా అంకెలను వెల్లడించారు. మందగమనాన్ని అరికట్టి వేగాన్ని పెంచేందుకు ఉద్దీపన పాకేజీ గురించి ప్రభుత్వం ఆలోచిస్తున్నది. దానిలో భాగంగానే 2.75శాతం ఉన్న వడ్డీ రేటును 2.65కు తగ్గించింది.


ప్రైస్‌వాటర్ కూపర్ హౌస్ అనే అంతర్జాతీయ సంస్థ జరిపిన సర్వే గురించి టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక ఒక వార్తను ప్రచురించింది. దాని ప్రకారం 74శాతం మంది జీవన వ్యయ పెరుగుదల, తమ వ్యక్తిగత ఆర్థిక స్థితి గురించి ఆందోళన వెల్లడించగా, 63శాతం మంది సేవలు, అత్యవసరంగాని వస్తువుల గురించి ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నట్లు చెప్పారట. మరి మన కేంద్ర ప్రభుత్వం పాకేజీలేమైనా ప్రకటిస్తుందా? ఆరున్నరశాతంగా ఉన్న వడ్డీ రేటును తగ్గిస్తుందా? ఎందుకంటే చైనా కంటే మన పరిస్థితి మెరుగ్గా వుందని చెబుతున్నారు కదా! చైనాలో వేతనాలు పెరుగుతున్నందున తక్కువ ధరలకు అక్కడ సరుకులను ఉత్పత్తి చేసేందుకు వీలులేని కారణంగా కంపెనీలు మనవైపు చూస్తున్నాయని ఎప్పటి నుంచో చెబుతున్నారు. ఎర్రతివాచీలు పరచి ఏమేమి రాయితీలు ఇచ్చేది చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను తెగనమ్మి కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. బండి గుర్రానికి గడ్డి చూపించి పరుగెత్తిస్తున్నట్లు తాము సూచించిన సంస్కరణలను అమలు జరిపితే అప్పుల పరిమితి పెంచుతామని చెబుతోంది తప్ప జనజీవన వ్యయ పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వమూ ముందుకు రావటం లేదు, రాష్ట్రాలనూ కోరిన దాఖలాలు లేవేమి?

చైనా నుంచి తరలి పోతున్నట్లు కొన్ని కంపెనీలు ప్రకటించిన మాట నిజం. అవి మన దేశానికి వస్తాయని చెప్పిన వారి అంచనాలు తప్పిందీ అంతే వాస్తవం. 2022 డిసెంబరు నాటికి తొమ్మిది నెలల కాలంలో మన దేశానికి వచ్చిన ఎఫ్‌డిఐలు 36.7 బి.డాలర్లు, అదే అంతకు ముందు ఏడాది వచ్చిన మొత్తం 43.2 బి.డాలర్లని మార్చి 20న బిజినెస్ స్టాండర్డ్ పత్రిక వార్త పేర్కొన్నది. చైనాలో కూడా ఎఫ్‌డిఐ పెరుగుదల తగ్గినప్పటికీ 2022లో కొత్తగా 18,532 విదేశీ పెట్టుబడి సంస్థలు నమోదైనట్లు, అంతకు ముందేడాదితో పోలిస్తే 38.3శాతం ఎక్కువని చైనా పేర్కొన్నది. ప్రపంచమంతటా కరోనా లాక్‌డౌన్లు ఎత్తివేసినా చైనాలో 2022 డిసెంబరు వరకు దాదాపు దేశమంతటా సున్నా కోవిడ్ కేసులు అనే విధానంలో భాగంగా లాక్‌డౌన్ కొనసాగింది, తరువాత ఎత్తివేశారు. ఈ కారణంగా ఈ ఏడాది ఏప్రిల్ నాటికి తిరిగి అనేక రంగాల్లో వినిమయం పెరిగి మే నెలలో తగ్గిందని చెబుతున్నారు. దాన్ని నమ్మటమా లేదా అనేది ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిందే. అంతర్గత మార్కెట్‌తో పాటు అనేక ధనిక దేశాల్లో తలెత్తిన మాంద్యం కూడా తోడైంది. మన దేశంలో ఈ ఏడాది మార్చి నెలతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటుతో పోలిస్తే వర్తమాన సంవత్సరం రేటు తక్కువగా ఉంటుందని చెబుతున్నారు. అదే చైనాకూ వర్తించుతుంది.

చైనాలో 16-24 సంవత్సరాల వయస్సు గల వారిలో మే నెలలో 20.8శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నట్లు చైనా ప్రభుత్వం ప్రకటించిన అధికారిక సర్వే వెల్లడించింది. మన దేశంలో ఎంత ఉందో ప్రభుత్వం ప్రకటించిన దాఖలాల్లేవు. ఇక్కడి పరిస్థితి మామూలేగా, అద్భుతాలు సృష్టిస్తున్నదని చెబుతున్న చైనాలో అలా ఉండటం ఏమిటని కొందరు అమాయకత్వాన్ని నటిస్తారు. చైనా పురోగతి అద్భుతమనటంలో ఎలాంటి సందేహం లేదు. నూటనలభై కోట్ల మంది అవసరాలను తీర్చగల స్థాయికి ఇంకా పెరగలేదు గనుకనే కొన్ని సమస్యలు. వాటిని తీర్చేందుకు అక్కడి ప్రభుత్వం చూస్తున్నదా లేదా లేక మన ప్రధాని చెప్పినట్లు పకోడీ, బజ్జీల బండి పెట్టుకొని ఉపాధి చూసుకోండని గాలికి వదలివేసిందా అన్నదే ప్రశ్న. మన దేశంలో ఏటా 65లక్షల మంది డిగ్రీలు తీసుకొని కాలేజీల నుంచి వెలుపలికి వస్తుంటే చైనాలో దానికి రెట్టింపుగా రికార్డు స్థాయిలో 115.8లక్షల మంది ఈ ఏడాది వచ్చారు.

> నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమొక్రసీ(ఎన్ఇడి) అనే పేరుతో పనిచేసే అమెరికా సంస్థ ప్రపంచంలో తప్పుడు ప్రచారం, కట్టుకథలు అల్లే వారికి, కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారకులకు పెద్ద మొత్తంలో నిధులు అందజేస్తుంది. దీనికి సిఐఎ మార్గదర్శకత్వం ఉంది. ఆ సంస్థ నుంచి డాహ్లిన్ నిధులు పొందినట్లు 2017లో హాంకాంగ్ ఫ్రీ ప్రెస్ అనే కమ్యూనిస్టు వ్యతిరేక పత్రికతో చెప్పాడు. అమెరికా ఎన్ఇడి మాదిరి ఐరోపా ఇఇడి సంస్థ డాహ్లిన్‌కు పెద్ద మొత్తంలో నిధులు అందజేసింది. ఈ సంస్థలు అనేక దేశాల్లో అక్కడి పాలకుల మీద జనాలను రెచ్చగొట్టి వాటికి రంగుల విప్లవాలని పేరు పెట్టి ప్రచారం చేసిన చరిత్ర ఉంది. ఇప్పటికీ అదే జరుగుతోంది.


మే నెలలో మొత్తం 3.3కోట్ల మందికి గాను 2.6కోట్ల మంది ఏదో ఒక ఉపాధిలో చేరారని, 60లక్షల మంది వేచి ఉన్నారని కూడా చైనా సర్వే పేర్కొన్నది. మన దేశంలోని సిఎంఐఇ సంస్థ పేర్కొన్న సమాచారం ప్రకారం పాతికేండ్ల లోపు యువత మన జనాభాలో 40శాతం ఉన్నారు. వారిలో 2022 డిసెంబరు నాటికి 45.8శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. చైనాలో 20శాతంపైన ఉంటే అక్కడి వారి గురించి కడవల కొద్దీ కన్నీరు కారుస్తున్నవారు మన దేశంలో దానికి రెట్టింపుకు మించి ఉన్నవారి గురించి మాట్లాడరేం? చైనాలో మే నెలలో నిరుద్యోగులు మే నెలలో 4.1శాతం, అదే మన దేశంలో ఏప్రిల్ నెలలో 8.11శాతం ఉంది.



చైనా గడచిన నాలుగు దశాబ్దాలలో అనేక విజయాలతో పాటు కొన్ని సమస్యలను కూడా ఎదుర్కొన్నది. వాటిని అధిగమించి ముందుకు పోతున్నది. ఇప్పుడు కూడా అంతే. అక్కడి నాయకత్వం మరింత పరిణితి చెందింది. కిటికీ తెరిచినపుడు మంచి గాలితో పాటు క్రిమి కీటకాలు కూడా లోనికి వస్తాయి, వాటిని ఎలా అరికట్టాలో మాకు తెలుసు అని సంస్కరణలకు ఆద్యుడైన డెంగ్ సియావో పింగ్ చైనా మార్కెట్‌ను తెరిచేటపుడు చెప్పాడు. ఇప్పుడూ ఎదురైన సవాళ్లను అదిగమించగలదని గత చరిత్రను బట్టి చెప్పవచ్చు. మన దేశంతో సహా విదేశాలలో 110చైనా పోలీస్ స్టేషన్లు అంటూ మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. తన వ్యతిరేకులను పట్టుకొనేందుకు అనధికారికంగా వాటిని తెరిచిందనే ప్రచారం ఇప్పటికీ సాగుతోంది. దున్న ఈనిందంటే దూడను గాటన కట్టేయమన్నట్లుగా ఈ కట్టుకథలను పిట్టకథలను నమ్ముతున్నవారు లేకపోలేదు.

తమ రాజధాని సియోల్, దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న చైనా రహస్య పోలీస్ స్టేషన్ల గురించి విచారణ జరుపుతున్నట్లు దక్షిణ కొరియా అధికారులు తాజాగా చెప్పారు. ఒక చైనా రెస్టారెంట్ కేంద్రంగా పని చేస్తున్నట్లు గుర్తించారట. స్పెయిన్ కేంద్రంగా పని చేస్తున్న సేఫ్‌గార్డ్ డిఫెండర్స్ అనే ఒక స్వచ్ఛంద సంస్థ చేస్తున్న ప్రచారం ప్రకారం 53దేశాల్లో చైనా పోలీస్ స్టేషన్లు ఉన్నాయట. కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు వివిధ దేశాల్లో ఉన్న తమ జాతీయులను స్వదేశానికి రప్పించేందుకు కొన్ని సంస్థలు పని చేశాయి తప్ప పోలీస్ స్టేషన్లు లేవని మే 15న చైనా విదేశాంగశాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. చైనా జాతీయులు నిర్వహించే రెస్టారెంట్లు, వాణిజ్య సంస్థల ముసుగులో పోలీస్ స్టేషన్లు నడుపుతున్నారని గత కొద్ది నెలలుగా ప్రచారం చేస్తున్నారు. న్యూయార్క్ నగరంలో అలాంటి ఒక పోలీస్ స్టేషన్ను పట్టుకున్నామని, 1998 నుంచి పని చేస్తున్న ఒక ధార్మిక సంస్థకు చెందిన ఇద్దర్ని గుర్తించినట్లు అమెరికా పోలీసులు ప్రకటించారు. నగరంలోని చైనీయులకు అవసరమైన సేవలు అందిస్తామంటూ ఆ సంస్థ బహిరంగంగానే మీడియాలో చిరునామాతో సహా ప్రకటనలు జారీ చేసినప్పటికీ అమెరికా పోలీసులు అది రహస్యంగా పని చేస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేశారు. బ్రిటన్‌లో కూడా ఇలాంటివే ఉన్నట్లు సేఫ్‌గార్డ్ డిఫెండర్స్ చెప్పటంతో మూడు అనుమానిత ప్రాంతాల్లో సోదా చేసిన పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు, చట్ట ఉల్లంఘనలు కనిపించలేదని బ్రిటన్ భద్రతా మంత్రి టామ్ ప్రకటించాడు.

చైనా పోలీస్ స్టేషన్ల ప్రచారం సేఫ్‌గార్డ్ డిఫెండర్స్ సంస్థ నుంచే జరుగుతోందన్నది స్పష్టం. దీని కథను చూస్తే అది అమెరికా సిఐఎ ఏర్పాటు చేసినది అని స్పష్టం అవుతున్నది. మానవహక్కుల కార్యకర్త పేరుతో స్వీడిష్ జాతీయుడైన పీటర్ డాహిలిన్ చైనాలో 2009లో కుర్ర లాయర్లు, గ్రామీణులకు సాయం చేసే పేరుతో చైనా యాక్షన్ అనే ఒక సంస్థను ఏర్పాటు చేశాడు. చేస్తున్న సాయం సంగతి పక్కన పెడితే ప్రభుత్వ వ్యతిరేకతను రెచ్చగొట్టటం అసలు లక్ష్యంగా వెల్లడి కావటంతో 2016 చైనా అధికారులు డాహ్లిన్‌తో సహా పని చేస్తున్న వారందరినీ పట్టుకొని జైల్లో పెట్టారు. కొందరు కనిపించకుండా పోయారు. డాహ్లిన్ కేవలం 23రోజులు మాత్రమే జైల్లో ఉన్నాడు. తాను చట్టవిరుద్ధంగా పని చేశానని అంగీకరించటంతో విడుదల చేసి పది సంవత్సరాల పాటు తిరిగి చైనాలో అడుగు పెట్టకుండా నిషేధం విధించారు. అప్పటి నుంచి చైనా గురించి ప్రపంచానికి కట్టుకథలు చెప్పటం ప్రారంభించాడు. నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమొక్రసీ(ఎన్ఇడి) అనే పేరుతో పనిచేసే అమెరికా సంస్థ ప్రపంచంలో తప్పుడు ప్రచారం, కట్టుకథలు అల్లే వారికి, కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారకులకు పెద్ద మొత్తంలో నిధులు అందజేస్తుంది. దీనికి సిఐఎ మార్గదర్శకత్వం ఉంది. ఆ సంస్థ నుంచి డాహ్లిన్ నిధులు పొందినట్లు 2017లో హాంకాంగ్ ఫ్రీ ప్రెస్ అనే కమ్యూనిస్టు వ్యతిరేక పత్రికతో చెప్పాడు. అమెరికా ఎన్ఇడి మాదిరి ఐరోపా ఇఇడి సంస్థ డాహ్లిన్‌కు పెద్ద మొత్తంలో నిధులు అందజేసింది. ఈ సంస్థలు అనేక దేశాల్లో అక్కడి పాలకుల మీద జనాలను రెచ్చగొట్టి వాటికి రంగుల విప్లవాలని పేరు పెట్టి ప్రచారం చేసిన చరిత్ర ఉంది. ఇప్పటికీ అదే జరుగుతోంది. చైనా గురించి ఎన్నిక కథలు చెప్పినా దాని పురోగతి ఆగటం లేదు, ఆగదు!



'మిర్రర్ ఇమేజ్'

- వావ్! ఈ డ్రస్‌లో మీరు సూపర్. అదిరిపోతున్నార్ సార్...

- ఆ విషయం నాకు తెలుస్తుందిలే సెక్రటరీ. నీవు మరీ అంతగా ఇదైపోనక్కర్లా... డ్రస్సింగ్ టేబుల్ దగ్గరున్న నిలువుటద్దంలో చూసుకుంటున్నాగా... డ్రస్‌లోపల నా ఛాతీ యాభైఆరు ఇంచ్‌లు పొడుగువుతున్నాయా... లేదా... అది... అది తేల్చుకోవాలి.

- ఎందుకు పొడగవ్వసార్. మీరిప్పుడు విశ్వగురూ... విశ్వనేత... జగజ్జేతగా అగ్రరాజ్యం అమెరికా వెళ్ళబోతున్నారు. యోగాడే నాడు ఆ దేశం నుండే ప్రపంచానికి పాఠాలు చెప్పబోతున్నారు సార్!

- విచిత్రం ఏంటంటే సెక్రటరీ... ఒకనాడు నేను గుజరాత్ నేతగా ఉన్నప్పుడు వీసా ఇవ్వడానికే నిరాకరించిన అమెరికా, మరిప్పుడు రెడ్‌కార్పెట్ పరిచి గ్రాండ్ వెల్‌కమ్ చెప్పడం చూస్తుంటే... ఛాతీ నిజంగానే ఉప్పొంగుతుందయ్యా! అక్కడ మనం ఇమానం దిగిన దగ్గర నుండీ... ఏదీ, తిరుగు ప్రయాణం అయ్యేంత వరకు అన్నీ రాచమర్యాదలే అనుకో.

- రాచమర్యాదలు అని చిన్నగా అంటారేంటి సార్. రాజభోగం. కాకపోతే మీడియా పత్రికల వాళ్ళకే కన్నుకుడుతుంది. ఏదిబడితే అది రాస్తున్నారు సార్.

- ఏమని? ఓసారి చదువు...

- ప్రస్తుతం అమెరికాలో 50లక్షల మంది భారతీయులు ఉన్నారని, వారిలో చాలామంది అక్కడ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ... వారి ఓటు బ్యాంకును ప్రభావితం చేస్తున్నారని, గనుకనే గత ఎన్నికల్లో భారత సంతతికి చెందిన కమలా హ్యారిస్ ఉపాధ్యక్ష పదవికి ఎన్నికయ్యారని రాసారు. గత ఎన్నికల్లో 74శాతం మంది ఇండియన్ అమెరికన్లు ఇప్పటి అధ్యక్షుడు జోబైడెన్ గెలుపునకు ఆ విధంగా మద్దతు ఇచ్చారని పేర్కొంటూనే... ఈసారి ఎన్నికల్లో అభ్యర్థిత్వం కోసం నిక్కీహేలీ, వివేక్ రామస్వామి వంటివారు పోటీపడుతున్నారని తెలిపారు. తత్ కారణంగానే తమరికి ఘనమైన అతిథ్యం ఇవ్వడం ద్వారా అమెరికన్ డెమోక్రాట్లు భారత్‌కు మరింత సన్నిహితం అన్న సంకేతాలు పంపడానికే ఇంత హడావుడి చేస్తున్నారని విమర్శిస్తున్నారు.



కె. శాంతారావు
9959745723

- ఇందులో విమర్శేముంది సెక్రటరీ? అదంతా నిజమేగా...

- నిజమా..? ఇందులో మీ గొప్పఏమీలేదనీ, ఇదంతా అమెరికావారి స్వప్రయోజనం కోసమే వారు చేస్తున్నారని ఇన్‌డైరెక్టుగా రాసారు సార్. ఒక విధంగా మిమ్మల్ని వాడుకుంటున్నారు స్సార్...

- ఆ... రాసేవాడు రాసుకోనీ, వాగేవాడు వాగుకోనీ... ఎవరేమనుకుంటే మనకెందుగ్గానీ, మనకు దక్కాల్సిన మర్యాదలు, భోగభాగ్యాలు మనకు దక్కుతున్నాయిగా... అయినా నీవంతగా మరీ ఇదైపోనక్కర్లా సెక్రటరీ. గతంలో ఏదీ 2014లో దేశాధినేతగా అమెరికా వెళ్ళానా... అప్పుడు న్యూయార్క్‌లోని మాడిన్ స్క్వేర్‌లో ఇరవై వేలమంది ఏదీ మన భారతీయులు జమయ్యారు. తెలుసా. మరల 2019లో అదేంటీ హౌడీ...డీ ప్రోగ్రాంకి ఏభైవేల మంది జమయ్యారు. ఈసారి టైమ్‌స్క్వేర్ నుండి నయాగరా జలపాతం వరకు కనీసం లక్షమంది జమవుతారు కచ్చితంగా... మరి నా ఛాతి పెరగకుండా ఎలా ఉంటుంది?

- అందుకే ఇంట్లో ఈగల మోత - బయట పల్లకీమోత అని మన మీడియా ఘోషిస్తున్నది.

- అబ్బా సెక్రటరీ... శుభం పలకరా మంకా అంటే పెళ్ళికూతురు ముండ ఎక్కడుందీ అన్నట్టు ఆ అపశకునపు మాటలేమిటి?

- మణిపూర్‌లో మారణహోమం చెలరేగి వందమందికి పైగా ప్రాణాలు పోయాయి. నెలరోజులైనా మంటలు ఆరడం లేదు. పచ్చటి అడవులు నెత్తురోడుతున్నాయి. ప్రజల హాహాకారాలు మిన్నంటుతున్నాయి. అయినా దేశాధినేత కానరావడం లేదు. పెదవి విప్పడం లేదు? ఏమయ్యాడు? అంటూ పోస్టర్‌లు వేసి గగ్గోలు పెడుతున్నారు సార్...

- ఏనుగు దారెంట పోతుంటే ఎన్నో కుక్కలు మొరుగుతాయి. వాటిని లెక్కచేస్తామా ఏమిటి? తాపీగా ఈ చెవితో విని ఈ చెవితో వదిలెయ్యాలి. ఈ రాజకీయ రహస్యం తెలియకపోతే ఎలా సెక్రటరీ...

- రహస్యం కాదు సార్. అంతా బహిరంగమే. ఈ పత్రిక చూడండి... ఏమని రాసిందో. 22వ తేదీన తమరు అమెరికా పర్యటనలో ఉన్నప్పుడే, మీరాకకు నిరసన తెలియజేస్తూ అమెరికా అధ్యక్ష భవనం సమీపంలోనే హక్కుల సంఘాలవాళ్ళు పెద్దఎత్తున ప్రదర్శన చేస్తారట. అంతే కాదు సారూ... వాషింగ్టన్‌లో, గుజరాత్ నరమేథం-2002పై ప్రత్యేకంగా రూపొందించిన బి.బి.సి. డాక్యుమెంటరీ చిత్రాలను ప్రదర్శిస్తారట. ఆ ప్రదర్శనలు తిలకించేందుకు అక్కడి ప్రజా ప్రతినిధులను, మేధావులను, పాత్రికేయులను ఆహ్వానిస్తాయట.

- ఊ... సెక్రటరీ... దీని తస్సాదియ్యా! ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని వేరే చెప్పాలా... ఈ కుట్రలో స్వదేశీయులేగాక విదేశీయులు కూడా ఉంటారు. నీవంతగా ఆశ్చర్యపడక్కర్లేదు. మీడియావాళ్ళే ఆ కుట్రదారుల్ని ఉద్యమకారులు, ఆందోళనకారులు, హక్కుల కార్యకర్తలు అని నానాపేర్లు పెడతారు. (అద్దంలో చూసుకుంటూ) ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే... ఇప్పుడేసుకున్నా డ్రస్ కన్నా గొప్ప డ్రస్‌లు మరో డజను సెలక్ట్ చేసి పెట్టు. అమెరికాలో వేసుకోవాలి. ఛాతీకూడా పెరుగుద్దీ, గుర్తుంచుకో. వస్తా.

- చిత్తంసార్. (బుర్ర గోక్కుంటూ పత్రికలో వ్యాఖ్యను చదువుకున్నాడు)

'అద్దంలో కనపడే ప్రతిబింబాన్ని చూసి కుక్క... తనే అనుకుంటుందా లేక వేరేకుక్క అని మొరుగుతూ భ్రాంతి పడుతుందా...?!

మన కోర్టులలో మనువుముద్ర!

ఆర్. రాజేశమ్

ఈ దేశపు న్యాయస్థానాలను నడిపించే చోదక శక్తి తానే అని చాటింపు వేస్తున్నట్టుగా రాజస్థాన్ హైకోర్టు ఆవరణలో మనువు విగ్రహం నేటికీ ఉన్నది. సమాజంలోని మెజారిటీ వర్గాలను, స్త్రీలను బానిసలుగా భావించిన మనువుకు ఆధునిక వ్యవస్థలో స్థానం లేదని... ఆ విగ్రహాన్ని తొలగించాలంటూ బహుజన వర్గాలవారు, ప్రజాస్వామికవాదులు, మహిళా సంఘాలూ ఉద్యమాలు చేసినా పాలకులు పట్టించుకోవడం లేదు. మనువు విగ్రహం బయట తిష్ట వేసుకోవడంతో పాటు... మను భావజాలం న్యాయస్థానాలలోనూ నిండుకొని ఉన్నదని నేటికి ఎన్నోమార్లు నిరూపితమైంది. తాజాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్య న్యాయస్థానమైన అలహాబాద్ హైకోర్టు సైతం మనుస్మృతిని నిలబెట్టే దిశలో ఒక ఉత్తర్వును విడుదల చేసింది. పెళ్లి పేరుతో మోసగించి, లైంగికదాడి చేసిన ఒక వ్యక్తిపై బాధిత మహిళ ఫిర్యాదు చేయగా... పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. సదరు కేసు హైకోర్టుకు చేరగా... అమ్మాయి 'మాంగళిక్' (మంగళ (కుజ) దోషం ఉన్నది) కాబట్టి... పెళ్లి చేసుకోవడం కుదరదంటూ ఆ నిందితుడు ఉల్టా దబాయించాడు. ఆ నిందితుడి వాదనలను పరిగణనలోకి తీసుకున్న అలహాబాద్ హైకోర్టు... నిందితుడు, బాధితురాలి జాతకాలను అలహాబాద్ జ్యోతిష్య విద్యాలయం ప్రొఫెసర్‌కు పంపించాలని జ్యోతిష్య ప్రొఫెసర్ తేల్చిన విషయాల ఆధారంగా నిర్ణయం వెలువరిస్తామని ఉత్తర్వులు జారీచేసింది. మే 23న ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాధితురాలిని లైంగికంగా లోబరుచుకున్నప్పుడు అడ్డురాని కుజదోషము పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడు మాత్రం ఎలా అడ్డు వచ్చిందనే కనీస ప్రశ్న గౌరవ న్యాయమూర్తులకు తోచలేదు!

అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వుల వార్త పేపర్లలో ప్రముఖంగా రావడంతో సామాన్య ప్రజలతో పాటు న్యాయ నిపుణులూ విస్తుపోయారు. జాతకాల ఆధారంగా న్యాయస్థానాలు నిర్ణయం తీసుకోవడమేమిటని సందేహం వెలిబుచ్చారు. చివరికి సుమోటోగా రంగప్రవేశం చేసిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ సదరు హైకోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తూ... జాతకాలతో సంబంధం లేకుండా హైకోర్టు నిర్ణయం తీసుకోవాలంటూ జూన్ 3న ఆదేశాలిచ్చింది. గమ్మత్తైన విషయం ఏమిటంటే... సుప్రీంకోర్టు ముందు హాజరైన బాధితురాలి లాయర్ సైతం జ్యోతిష్య ప్రొఫెసరు తేల్చిన దానికి తామూ కట్టబడి ఉంటామని, సదరు ఉత్తర్వుల పట్ల తమకు అభ్యంతరమేదీ లేదనీ తెలిపారు. అమ్మాయి ఒకవేళ 'మాంగళిక్'గా తేలిన పక్షంలో వివాహం జరిగే అవకాశమే లేదని ఆయన సైతం వాదించేవాడు. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులో ఎలాంటి అసమంజసత్వం లేదని, ఇరువైపుల వారూ అందుకు సమ్మతించారని సదరు లాయర్ సుప్రీంకోర్టుకు తెలిపారు. జ్యోతిష్యం కూడా సైన్స్‌లో ఒక భాగమే. నేడు యూనివర్సిటీలు సైతం జ్యోతిష్యంలో డిగ్రీలు ప్రధానం చేస్తున్నవి అనే విలువైన అంశాన్ని సైతం ఆ లాయరు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సుప్రీంకోర్టు వారు కూడా "ఆ అంశంలోకి మేము వెళ్లడం లేదు, జ్యోతిష్యమూ సైన్సేనని మేమూ ఒప్పుకుంటాం. అయితే, సదరు ఉత్తర్వులు మాత్రం అసంబద్ధమైనవి" అంటూ తీర్పునిచ్చారు.

మన న్యాయస్థానాల నుండి వెలువడే తీర్పులలో మనువుముద్ర ఎన్నోమార్లు నిరూపితమైంది. 40ఏండ్ల క్రితం సంచలనం సృష్టించిన భన్వారీదేవి సామూహిక లైంగికదాడి కేసు తీర్పులో సైతం గౌరవ న్యాయమూర్తులు మనువు మార్గానే నడిచారు. దళితురాలైన భన్వారీదేవి రాజస్థాన్ ప్రభుత్వం నిర్వహిస్తున్న మహిళా అభివృద్ధి కార్యక్రమంలో సాథిన్‌గా పనిచేసేది. ఆమె విధులు నిర్వహిస్తున్న భటేరీ గ్రామంలో ఒక తొమ్మిది నెలల పసికందుకు పెళ్లి చేయాలని ఊరిపెద్దలు ప్రయత్నించినపుడు... ఆ దారుణానికి మౌనసాక్షిగా నిలబడలేని భన్వారీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ పెళ్ళిని అడ్డుకున్నది. తమ దురహంకారంపై దెబ్బ పడటంతో గ్రామ పెద్దలు సహించలేకపోయారు. అందులోనూ ఒక దళితురాలు తమని ఎదిరించడాన్ని పెద్దకులపు గుజ్జర్లు జీర్ణించుకోలేకపోయారు. మన దేశంలో నిమ్నవర్గాల స్త్రీలపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఉన్నది ఒకటే తోవ. దాని ప్రకారమే వారు 22 సెప్టెంబర్ 1992న ఆమెపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. 1995 నవంబర్ 15 జైపూర్ జిల్లా సెషన్స్ జడ్జి తీర్పునిస్తూ... భన్వారీదేవిపై మానభంగమే జరగలేదని తేల్చేశారు. గౌరవనీయ న్యాయమూర్తి అందుకు గమ్మత్తైన కారణాలు చూపారు. తమ కుల పవిత్రతకు ప్రాధాన్యతనిచ్చే పెద్దకులపు వ్యక్తులు దళితురాలిపై లైంగికదాడి చేయలేరని ఆయన తేల్చేశాడు. వైద్యపరీక్షలో నిందితుల వీర్య అవశేషాలు బాధితురాలి శరీరంపై లభించినా న్యాయమూర్తి ఆ సాక్ష్యానికి విలువ లేదన్నాడు. ఒక వ్యక్తి తన మేనల్లుడి సమక్షంలో సామూహిక లైంగికదాడిలో పాల్గొనలేడు. గ్రామ పెద్ద మానభంగం చేయలేడు. వేరువేరు కులాలకు చెందినవారు సామూహిక మానభంగంలో కలిసి పాల్గొనలేరు అనే కారణాలను సైతం న్యాయమూర్తి జోడించాడు. రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యే కన్నయ్యలాల్ మీనా, రాష్ట్ర రాజధాని జైపూర్‌లో నిందితుల విడుదలను స్వాగతిస్తూ పెద్ద ర్యాలీ నిర్వహించాడు. బీజేపీ మహిళా విభాగం సైతం భన్వారీదేవినే నిందిస్తూ ప్రచారం చేపట్టింది. మహిళా సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడంతో తప్పనిసరి పరిస్థితులలో రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు అప్పీలు చేసింది. సదరు అప్పీలు నేటికీ రాజస్థాన్ హైకోర్టు విచారణలో ఉన్నది. బాధితురాలు భన్వారీదేవికి న్యాయం ఇంకా అందని ద్రాక్షగానే మిగిలి ఉన్నది.



మన న్యాయాధిపతుల్లో కొందరికి మనుస్మృతి పట్ల విపరీతమైన గౌరవం ఉందన్న సంగతి బహిర్గతమే. నేడు ఏపీ గవర్నర్‌గా వ్యవహరిస్తున్న అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు మనువు, కౌటిల్యుడి బోధనలను నేటి భారత న్యాయ వ్యవస్థ అనుసరించాలని, పాశ్చాత్య దేశాల నుండి స్వీకరించిన న్యాయవ్యవస్థ మనకు పనికిరాదని ఉద్బోధించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ప్రతిభా సింగ్ గత సంవత్సరం ఆగస్టులో ఢిల్లీలో జరిగిన ఫిక్కీ సమావేశంలో ప్రసంగిస్తూ... మనుస్మృతితో సహా భారతీయ స్మృతులన్నీ మహిళలకు గొప్ప గౌరవాన్ని ఆపాదించాయంటూ పొగిడేశారు. 'స్త్రీలు ఎదుర్కొంటున్న అవాంతరాలు' అనే అంశంపై ప్రసంగించిన ఆమె భారతదేశంలోని స్త్రీలు మిగతా దేశాల స్త్రీల కంటే అదృష్టవంతులని, మనువు స్త్రీలకు ఉన్నత స్థానాన్ని ఇచ్చాడని పేర్కొన్నారు. 'స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని ఘోషించిన మనువు పట్ల ఆమె మనోగతమది. భారత రాజ్యాంగం ప్రవచించిన సమానత్వ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న గ్రంథాలను గౌరవ న్యాయమూర్తి పొగడటం పట్ల మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తపరిచాయి. మొన్నటి సుప్రీంకోర్టు నిర్ణయం తర్వాత నెలకొన్న పరిస్థితి ఏమిటంటే... 'కుజ దోష ప్రమాదం' తాత్కాలికంగా వెనక్కు నెట్టి వేయబడినా 'జ్యోతిష్య శాస్త్ర ప్రమాదం' మాత్రం ఇంకా పొంచి ఉన్నది. ప్రజల్లో హేతుబద్ధ ఆలోచనా ధోరణిని పెంపొందించే దిశలో ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని నిర్దేశిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ పై నీలినీడలు ఆవరించి ఉన్నాయి. సామాజిక ప్రగతికి ఆటంకంగా నిలిచిన మనువాదం అంతరించాలని.. రాజ్యాంగం దృఢతరం కావాలని ఆకాంక్షించే వారందరికీ ఆందోళన కలిగించే అంశాలివి.

సెల్: 9440443183

> నేడు ఏపీ గవర్నర్‌గా వ్యవహరిస్తున్న అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు మనువు, కౌటిల్యుడి బోధనలను నేటి భారత న్యాయ వ్యవస్థ అనుసరించాలని, పాశ్చాత్య దేశాల నుండి స్వీకరించిన న్యాయవ్యవస్థ మనకు పనికిరాదని ఉద్బోధించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ప్రతిభా సింగ్ గత సంవత్సరం ఆగస్టులో ఢిల్లీలో జరిగిన ఫిక్కీ సమావేశంలో ప్రసంగిస్తూ... మనుస్మృతితో సహా భారతీయ స్మృతులన్నీ మహిళలకు గొప్ప గౌరవాన్ని ఆపాదించాయంటూ పొగిడేశారు. 'స్త్రీలు ఎదుర్కొంటున్న అవాంతరాలు' అనే అంశంపై ప్రసంగించిన ఆమె భారతదేశంలోని స్త్రీలు మిగతా దేశాల స్త్రీల కంటే అదృష్టవంతులని, మనువు స్త్రీలకు ఉన్నత స్థానాన్ని ఇచ్చాడని పేర్కొన్నారు.



అవగాహనతోనే ఆచరణ..

ఫిట్‌గా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తారు. అందుకోసం డైటింగ్ పేరుతో చేయకూడనివి చేస్తుంటారు. ఇవి ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే అవుతుంది. సన్నగా అవ్వాలన్న ఆరాటంలో చేసే పొరపాట్లు తీవ్ర అనారోగ్య సమస్యలకు కారణం కావచ్చు. ఫిట్‌గా ఉండాలంటే డైటింగ్ పట్ల సరైన అవగాహన ఏర్పరుచుకుని అవలంభించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎలా డైట్ ఫాలో అవ్వాలంటే...

- డైటింగ్ చేయాలనుకుంటే ముందుగా డాక్టర్‌ని తప్పక సంప్రదించాలి. ఎంత బరువున్నారు? ఎంత తగ్గాలి? ఏయే వ్యాయామాలు చేయాలి? ఏమేం తినాలి?... ఇలా ప్రతి ఒక్కటీ డాక్టర్‌ని అడిగి సలహా తీసుకోవాలి. ఎందుకంటే కొందరి శరీరం కొన్ని రకాల వ్యాయామాలను తట్టుకోలేకపోవచ్చు. కొన్ని రకాల ఆహారం కొందరికి మేలు చేయకపోవచ్చు. అందుకే ఎవరి శరీర తత్వాన్ని బట్టి వారు డైట్ ఫాలో అవ్వాల్సి ఉంటుంది. అందుకే డాక్టర్ సలహా తప్పనిసరి.
- త్వరగా బరువు తగ్గిపోవాలన్న ఆతృతతో ఒకేసారి ఎక్కువ డైటింగ్ చేసేస్తుంటారు. అలా చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఏదైనా మెల్లగా మొదలు పెట్టి పెంచుకుంటూ పోవాలి. ఒక్కసారిగా ఆహారపు అలవాట్లు మార్చేస్తే నీరసం వచ్చేస్తుంది. డైటింగ్ అంటే మరీ కడుపు మాడ్చేసుకోనవసరం లేదు. బలవర్ధకమైన ఆహారాన్ని కొద్ది కొద్దిగా ఎక్కువసార్లు తీసుకోవడమే డైటింగ్. ఘనాహారాన్ని మెల్లమెల్లగా తగ్గించుకుంటూ ద్రవాహారాన్ని మెల్లమెల్లగా పెంచుకుంటూ పోవాలి. అలాగే కొన్ని రకాల ఫ్యాట్స్ ఆరోగ్యానికి మంచిది. వాటిని చెడు చేసే ఫ్యాట్స్ అనుకుని పొరబడి తినకుండా ఉండకండి. ఏది తినాలో ఏది తినకూడదో ముందు తెలుసుకోవాలి.
- కొన్నిసార్లు ఎంత డైటింగ్ చేసినా బరువు తగ్గరు. అలాంటప్పుడు డైట్ ప్లాన్ చేంజ్ చేసుకోవాలే తప్ప వాటినే తింటూ ఉండిపోకూడదు. ఎప్పటికప్పుడు బరువు పరిశీలించుకుంటూ ఉంటే ప్లాన్ చేంజ్ చేయాలా లేదా అన్నది తెలుస్తుంది. కొందరైతే ఆహారం తగ్గించేసి ప్రొటీన్ షేక్స్, విటమిన్ ట్యాబ్లెట్లూ వేసేసుకుంటూ ఉంటారు. ఆ పొరపాటు ఎప్పుడూ చేయవద్దు. ఆహారాన్ని ఏదీ రీప్లేస్ చేయలేదన్న విషయాన్ని మర్చిపోకండి.
- చాలామంది చేసే తప్పేంటంటే... డైటింగ్ పేరుతో అన్నీ కంట్రోల్ చేసేస్తారు. ఆ తర్వాత దేనికో టెంప్ట్ అయ్యి తినేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో ఎక్కువ చెడు జరిగే అవకాశాలున్నాయి. తినకూడదు అనుకున్న వాటి జోలికి అస్సలు వెళ్లకూడదు. ఫ్రెండ్స్ బలవంత పెట్టారనో, ఇంట్లో పార్టీ ఉందనో కాంప్రమైజ్ అయిపోవద్దు. లేదంటే డైట్ కంట్రోల్ చేసి ఉపయోగం ఉండదు. దీని వల్ల ఎంత మెల్లగా బరువు తగ్గుతారో అంత వేగంగా పెరుగుతారు.
- ఇక అన్నిటికంటే ముఖ్యమైనది విశ్రాంతి, నిద్ర. డైటింగ్ చేసేవాళ్లకు కచ్చితంగా విశ్రాంతి ఉండాలి. నీరసంగా ఉందని ఒళ్లు మొరాయిస్తున్నా వ్యాయామం చేసేయడం, తిండి తినకుండా పని చేసేయడం వంటివి చేయకండి. అంతేకాదు... కంటికి సరిపడా నిద్రపోవాలి. లేదంటే ఆరోగ్యం దెబ్బ తింటుంది. నిజంగా ఫిట్‌గా ఉండాలంటే ఈ తప్పులేవీ చేయకూడదు. డైటింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. లేదంటే ఏదో అనుకుంటే ఇంకేదో అవుతుంది. తర్వాత బాధపడాల్సి వస్తుంది.

పాట మనలో చైతన్యం నింపుద్ది

పాటకు రాయిసైతం కరిపోవల్సిందే. గంటల కొద్ది ఉపన్యాసం చేయాలేని పని ఓ చిన్న పాట చేస్తుంది. మనలో కొత్త ఉత్తేజాన్ని నింపుతుంది. పాటకు అంతటి ప్రభావం వుంది. అటువంటి పాటతో సమాజంలో మార్పు తీసుకురావాలని నిర్ణయించుకుంది. మహనీయుల జీవితాలను పాటలుగా అల్లి ప్రజల్లో చైతన్యం నింపుతుంది. తెలంగాణ ఉద్యమంలో మాటా, పాటతో తన వంతు పాత్ర పోషించింది. ప్రజాగాయినిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆమే గంగాజమున. ఈ రోజు ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా ఆమె పరిచయం ఆమె మాటల్లోనే...



నిజామాబాద్ జిల్లా, సుంకెట గ్రామంలో పుట్టాను. అమ్మ గంగు, నాన్న రాజారాం. నాకు ఇద్దరు తమ్ముళ్లు. చిన్నతనంలోనే నాన్న మమ్మల్ని వదిలి వెళ్ళిపోయాడు. అమ్మ బీడీలు చుడుతూ మమ్మల్ని బతికించింది. అమ్మకు సాయంగా నేను కూడా బీడీలు చుట్టేదాన్ని. చాలా కష్టాలు పడ్డాము. మా గ్రామంలోనే ఏడో తరగతి వరకు చదువుకున్నా. ఎనిమిదో తరగతి నుండి డిగ్రీ వరకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉండి చదువుకున్నాను.

నా ఫొటో పేపర్లో చూసి...

చిన్నప్పటి నుంచి పాటలంటే చాలా ఇష్టం. నా గొంతు బాగుందని అమ్మ చాలా ప్రోత్సహించేది. ఎంత చదువు చదివినా ఏదో ఒక కళలో రాణిస్తే మంచి గుర్తింపు వస్తుందని అంటుండేది. చదువుకునేటపుడు ప్రతి కల్చరల్ ప్రోగ్రామ్‌లో పాల్గొనే దాన్ని. డిగ్రీలో ఉన్నప్పుడు ఘంటశాల ఉత్సవాల సందర్భంగ నిజామాబాద్ జిల్లా పరిధిలో పాటల పోటీలు జరుగుతున్నాయని పేపర్లో చూశాను. నా పేరు కూడా నమోదు చేసుకున్నా. అందులో పాల్గొన్నందుకు బహుమతి వచ్చింది. ఆ ఫొటో పేపర్లో వచ్చింది. అది చూసి మా అమ్మ చాలా సంతోషించింది.

ఫీజు కట్టలేక మానేశాను

గాయనిగా మంచి పేరు వస్తుందని, సంగీతం నేర్చుకుంటే ఇంకా బాగా పాడగలనని అమ్మ నన్ను సంగీతం క్లాసులో చేర్పించింది. ప్రముఖ గాయకులు రాజేంద్రప్రసాద్ వద్ద జంట స్వరాల వరకు నేర్చుకున్నాను. ఆయన దగ్గర శిష్యురాలిగా చేరడం నాకు దక్కిన మంచి అవకాశం. చాలా ప్రోత్సహించేవారు. 'నాలుగు నెలలు వచ్చి నేర్చుకో చాలు, నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అన్నారు. కానీ నెలకు ఐదు వందలు ఫీజు కట్టాలి. అమ్మకు చాలా కష్టమయ్యింది. దాంతో నెల రోజులు మాత్రమే నేర్చుకుని మానేశాను. 2010లో పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో చేరాను. అక్కడ కూడా ఎన్నో బహుమతులు వచ్చాయి. డీన్ ధర్మరాజు సార్ చాలా ప్రోత్సహించారు. అక్కడే మంజులక్క పరిచయం. తనతో పాటు ప్రతి ప్రోగ్రామ్‌కు తీసుకుపోయేది. పెద్ద పెద్ద గాయకులు పరిచయమయ్యారు. విమలక్క, గోరటి వెంకన్నతో కలిసి చాలా కార్యక్రమాల్లో పాల్గొన్నా. దేశపతి శ్రీనివాస్, రసమయి అక్కడే పరిచయమయ్యారు.



అమ్మ చనిపోయింది...

2012లో అమ్మ గుండెపోటుతో చనిపోయింది. అప్పుడే నా పీజీ అయిపోయింది. తమ్ముళ్ళు చిన్న వాళ్ళు. ఎలా బతకాలో తెలియలేదు. దాంతో కొంత కాలం ఓ స్కూల్లో ఇంగ్లీష్ టీచర్‌గా పార్ట్ టైం చేశాను. నించున్న దగ్గరే నిలబడి చూస్తుంటే మనమేం చేయలేం. నడుస్తూపోతే అన్నీ మనకు అనుకూలంగా మారతాయి. అడ్డంకులు కూడా తొలగిపోతాయి. అది అప్పుడే నేర్చుకున్నాను. తమ్ముళ్లు ఉద్యోగం కోసం దుబాయ్ వెళ్ళారు. నేను ఇక్కడ ఒంటరిగా ఉండేదాన్ని. 'తల్లి లేదు, తమ్ముళ్లు ఎక్కడో ఉంటున్నారు. ఇలా పాటలంటూ తిరుగుతుంది' అంటూ నా గురించి కొంత మంది చెడుగా మాట్లాడుకున్నారు. నా తమ్ముళ్ళు మాత్రం నాకు సపోర్ట్ చేశారు. 'నీకు ఇష్టమైన రంగంలో నువ్వు ఉండు, వేరే వాళ్ళ మాటలు పట్టించుకోకు' అంటూ అవసరమైనప్పుడు డబ్బులు కూడా పంపించేవారు.

మంచి అవకాశాలు...

యూనివర్సిటీకి వచ్చిన తర్వాత నా జీవితం చాలా వరకు మారిపోయింది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాను. అప్పట్లో ఉద్యమాలకు అడ్డ ఉస్మానియా యూనివర్సిటీ. 2012లో ఇప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన సొంత గ్రామం పోచారంలో తెలంగాణ తల్లి విగ్రహం అవిష్కరించారు. అక్కడికి నన్ను ఆహ్వానించారు. అక్కడ దేశపతి శ్రీనివాస్ 'జమున బాగున్నావా, నీ గొంతు చాలా బాగుంది, అందుకే నిన్ను ఇక్కడికి పిలిపించాను' అన్నారు. చాలా సంతోషంగా అనిపించింది. ఇక అప్పటి నుండి ఎక్కడ ఉద్యమం జరుగుతున్నా వెళ్ళి పాటలు పాడేవాళ్ళం. అలాగే గోగు శ్యామలక్కను చూసి స్ఫూర్తి పొందాను. 'మీలాంటి యువతులు బయటకు రావాలి, సమాజ మార్పు కోసం అమ్మాయిలు బయటకు వచ్చి మాట్లాడాలి' అనేవారు.

నాయకురాలిగా ఎదిగాను

2013లో స్వేరో నెట్ వర్క్‌లో చేరాను. అక్కడే నాకు భాస్కర్‌తో పరిచయం. అప్పటికే భాస్కర్ పేరున్న డఫ్లిస్ట్. ప్రవీణ్ కుమార్ మా ఇద్దరికీ పెండ్లి చేశారు. ఇప్పుడు నేను స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర కార్యదర్శిని. దీని ఆధ్వర్యంలో చాలా సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. కరోనా సమయంలో కూడా ఎన్నో చేశాం. ఓ నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకుంది ఈ సంస్థ ద్వారానే. ప్రస్తుతం డబుల్ పీజీ పూర్తి చేసి పీహెచ్‌డీ కూడా చేస్తున్నాను.

మహనీయుల జీవితాలపై...

బుక్కు చదివితే జ్ఞానం వస్తుంది. అందుకే సమాజం కోసం త్యాగాలు చేసిన మహనీయుల జీవిత చరిత్రలు బాగా చదువుతాను. అవి చదివి స్ఫూర్తిపొంది వాళ్ళపై అనేక పాటలు రాశాను. సావిత్రీబాయి, అంబేద్కర్, జ్యోతిరావుపై ఎన్నో పాటలు రాశాను. అలాగే ప్రేమ పాటలు కూడా రాశాను. యూట్యూబ్ షార్ట్ ఫిలింమ్స్ కోసం ఎన్నో పాటలు రాశాను, పాడాను. జీసెస్ పాటలు, జానపదాలు కూడా రాశాను. ఇలా సుమారు 200 పాటల వరకు రాశాను. మాకు యూట్యూబ్ ఛానల్ కూడా ఉంది. నేనూ, భాస్కర్ కలిసి పాటలు రికార్డ్ చేసి అందులో పెడుతుంటాము.

అమ్మ ఏడ్చేసింది

పాటకు రాయయినా కరిగిపోతుంది. పాటలకు అంతటి గొప్పతనం ఉంది. ఎంత గొప్ప ఉపన్యాసం ఇచ్చినా ఒక చిన్న పాట ఎంతో మంది హృదయాలను తాకుతుంది. అందుకే నాకు ఇలాంటి మంచి భవిష్యత్ ఇచ్చిన మా అమ్మకు ధన్యవాదాలు. ఈ సందర్భంగా నేను ఓ చిన్న జ్ఞాపకాన్ని మీతో పంచుకోవాలి. చిన్నప్పుడు ఆడపిల్లపై ఒక పాట విన్నాను. దాన్ని నేర్చుకుని మా అమ్మకు వినిపిస్తే ఏడ్చేసింది. ఎందుకు ఏడ్చిందో అప్పట్లో అర్థం కాలేదు. తర్వాత ఒక రోజు అమ్మతో పాటు బీడీలు చుట్టడానికి కార్ఖానాకు వెళ్ళా. అక్కడ వందల మంది మహిళలు బీడీలు చుడుతూ ఉంటారు. 'జమునా నువ్వు బాగా పాడతావంట కదా, ఒక పాటపాడరాదు' అంటే అడ పిల్ల పాటనే అక్కడ కూడా పాడాను. అందరూ ఏడుస్తున్నారు. అప్పుడు అని పించింది. ఒక పాటకు ఇంతటి ప్రభావం వుందా అని. పాట ఎంతో మందిని కదిలిస్తుంది. అలాంటి పాటతో సమాజాన్ని ఎందుకు మార్చలేం అనే నిర్ణయానికి వచ్చాను. అప్పటి నుండి పాడుతూనే ఉన్నాను.

ఇంటర్వ్యూ : సలీమ
ఫొటోలు : వెంకటేష్ పిప్పళ్ల

విద్యతోనే వికాసం-అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ ఇచ్చేలా చూస్తామన్నారు. తొమ్మిదేండ్ల కిందట విద్యా, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాలు ఎలా ఉండేవో.. ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. తండాలను జీపీలుగా చేశామన్నారు. అనేక సమస్యలకు పరిష్కారం చూపామని వివరించారు. పలకతో వచ్చి పట్టాతో వెళ్లాలనే లక్ష్యంతో గంభీరావుపేటలో కేజీ టూ పీజీ క్యాంపస్ ఏర్పాటు చేశామన్నారు. మూడు దశల్లో 510ప్రభుత్వ పాఠశాలల్లో 12మౌలిక సదుపాయలు, వసతులు సమకురుతాయన్నారు. 60పాఠశాలల్లో 22వేల మంది విద్యార్థులకు కంప్యూటర్ చాంప్స్ పేరుతో బేసిక్ కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 26వేల ప్రభుత్వ పాఠశాలలకు టి-ఫైబర్‌తో అనుసంధానం చేయనున్నామన్నారు. సిరిసిల్ల ఇప్పటికే అనేక అంశాల్లో దేశంలోనే ముందుందన్నారు. దేశంలో విద్య విషయంలో బెస్ట్ స్కూల్ ఎక్కడ ఉన్నాయంటే సిరిసిల్ల అనే పేరు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలో పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ రాఘోత్తంరెడ్డి, టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్మెన్ అరుణ, గ్రంథాలయ చైర్మెన్ ఆకునూరి శంకరయ్య, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో ఇండ్లు గుడిసెల జాడేది?

(మొదటి పేజీ తరువాయి)

పలికారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎర్ర చెరువు శిఖం భూమిలో పేదలు వేసుకున్న గుడిసెల వద్ద బహిరంగ సభ నిర్వహించారు.

పసర గుడిసెవాసుల ప్రాంతంలో నాయకులు పొదిళ్ల చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించిన సభకు వెంకట్ హాజరై మాట్లాడారు. కోట్ల రూపాయలు వెచ్చించి 20 రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను రోజుకో పేరుతో నిర్వహిస్తోందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇండ్ల కోసం గుడిసె వాసులు చేస్తున్న పోరాటాలు, వారి కష్టాలు ప్రభుత్వానికి కనబడలేదా అని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వమూ ఇండ్లు లేని వారందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పిందని, అయినా ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన పాపానపోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలను నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ఇండ్ల కోసం ఢిల్లీ స్థాయిలో ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య మాట్లాడుతూ.. ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోని 61 ప్రాంతాల్లో గుడిసె వాసులు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో ఇండ్ల ఉత్సవాల ప్రస్తావన లేకపోవడం పేదవారి గృహాలపై ప్రభుత్వానికి ఉన్న సవతి ప్రేమను తెలియజేస్తుందన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా బెదిరింపులకు పాల్పడినా తట్టుకొని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. లక్షలాది విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా పేద ప్రజానీకానికి ఉపయోగపడే విధంగా ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

భూపాలపల్లిలోని ఎర్ర చెరువు శిఖం భూమిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన జరిగిన సభలో ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్. వీరయ్య మాట్లాడారు. నివసించే వారికి కూడు, గూడు, ఉపాధి కల్పించాలని రాజ్యాంగంలో ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చి ఏర్పడిన కాలనీ ఒక్కటి కూడా లేదని, మొత్తం ఎర్రజెండా వేసుకున్న గుడిసెలేనని స్పష్టంచేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా బెదిరింపులకు పాల్పడినా పేదలకు స్థలాలు పంపిణీ చేసేవరకు ప్రజా సంఘాలు అండగా ఉంటాయని స్పష్టం చేశారు.

యాత్రలో.. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి పైల్ల ఆశయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి జగదీష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి రెడ్డి సాంబశివ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి. సంజీవ, గొర్ల కాపరుల సంఘం మండల నాయకులు కడారి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు అంబాల పోషాలు, ఐద్వా నాయకులు కవిత, గుడిసెవాసుల పోరాట కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఏం చేశారు..?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ సర్కార్ తొమ్మిదేండ్ల పాలనలో మహిళలను తీవ్రంగా మోసగించిందనీ, కేంద్ర ప్రభుత్వం వారికి ఒరగబెట్టిందేమీ లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ఉపాధ్యక్షులు సుధాసుందర్‌రామన్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఉపాధ్యక్షులు టి జ్యోతి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మితో కలిసి ఆమె మాట్లాడారు. తొమ్మిదేండ్ల కాలంలో ప్రజలకు ఎంతో చేశానని ప్రధానమంత్రి చెబుతున్నారు కదా..! మహిళల అభివృద్ధికి ఏం చేశారో నిర్దిష్టంగా చెప్పాలని ప్రశ్నించారు. ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక సమస్యలు ఈ కాలంలో పెద్ద ఎత్తున ముందుకొచ్చాయని వివరించారు. మోడీ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలన్నీ పేదలకు అందనంత ఎత్తుకు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.400 ఉన్న గ్యాస్ ధర రూ.1200కు పెరిగింది నిజం కాదా? అని ప్రశ్నించారు.సబ్సిడీలు ఎత్తివేసి మహిళలను మోసం చేశారని విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలోని మోడీ సర్కార్‌లో మహిళల ఉపాధి తగ్గిందన్నారు. అసంఘటిత రంగంలోనే ఏదో ఒక పని చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో భద్రత లేదనీ, కార్మిక చట్టాల రద్దువల్ల శ్రామిక మహిళల పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పారు. లైంగిక వేధింపులకు నిరసనగా ఆరు నెల్లుగా ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధుల ఆక్రందనను ఈ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు.

చివరకు సుప్రీంకోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారనీ, అందులోనూ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫోక్సో కింద అభియోగాలు లేకుండా చేశారని తెలిపారు. దీనికి సంబంధించి బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ హింసకు బీజేపీ విభజన రాజకీయాలే కారణమని చెప్పారు. దీంతో వేలాది మంది మహిళలు తమ ఇండ్లను వదిలి పునరావాసా కేంద్రాల్లో తలదాచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బేటీ బచావో..బేటీ పడావో నినాదం కాగితాలకే పరిమితమైందని సుధాసుందర్‌రామన్ ఈ సందర్భంగా చెప్పారు. కెప్టెన్ లక్ష్మిసెహగల్, మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తితో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జులై 7నుంచి 9వరకు హైదరాబాద్ నగరంలో ఐద్వా జాతీయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామనీ, ఈ సమావేశాల్లో మోడీ ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాల గురించి చర్చిస్తామని చెప్పారు. ఆగస్టులో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రకటించారు.

రాష్ట్రంలో పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలి-మల్లు లక్ష్మి

రాష్ట్రంలో లక్షలాది మంది పేదలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మల్లు లక్ష్మి తెలిపారు. అర్హులైన అందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తామంటూ సీఎం కేసీఆర్ 2014లో ప్రకటించారని గుర్తు చేశారు. కానీ..ఆచరణలో ఆ హామీ అమలు కాలేదని చెప్పారు. రెండో సారి అధికారంలోకి వచ్చినప్పుడు ఇండ్ల జాగా ఉన్న వారికి రూ.మూడు లక్షల ఆర్థికం సాయం చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. దాన్నీ అమలు చేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం 22జిల్లాల్లో 64 కేంద్రాల్లో భూపోరాటాలు కొనసాగుతున్నాయని చెప్పారు. పేదలు గుడిసెలు వేసుకుంటే..ప్రభుత్వ యంత్రాగం అత్యంత దుర్మార్గంగా వాటిని తొలగిస్తోందని చెప్పారు. ఈ పోరాటంలో పాల్గొంటున్న వారిలో 80శాతం మంది మహిళలే ఉన్నారని వివరించారు. ఎంతో మందిపై అక్రమంగా తప్పుడు కేసులు పెట్టారని చెప్పారు. పేదలకు ప్రభుత్వం వెంటనే ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలనీ, తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 28నుంచి వచ్చే రెండో తారీఖువరకు భూపోరాట కేంద్రాల్లో దీక్షలు, మూడో తారీఖున కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహంచాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, వినోద తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ గూండాల దాడికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీంనగర్‌లో ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై ఏబీవీపీ గూండాల దాడిని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటు విద్యాసంస్థ అనుమతి లేకుండా యూనిఫారామ్, పుస్తకాలు అమ్ముతుంటే ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై ఆ యాజమాన్యానికి మద్దతుగా ఏబీవీపీ నిలిచిందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై ఏబీవీపీ గూండాలు దాడి చేశారని విమర్శించారు. కర్రలతో, బైక్ "కీ"లతో దాడి చేసి ఎస్ఎఫ్ఐ నాయకతాన్ని గాయపర్చారని తెలిపారు. ఫీజులపై, విద్యార్థి సమస్యలపై పోరాడుతూ ప్రశ్నిస్తున్న ఎస్ఎఫ్ఐపై భౌతికంగా దాడి చేయడం పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. చాతనైతే సమస్యలపై పోరాడాలి కానీ భౌతిక దాడులకు దిగడం సరైంది కాదని తెలిపారు. ఏబీవీపీ దాడిని, మేధావులు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థిలోకం ఖండించాలని కోరారు.

గింజ గోస...

(మొదటి పేజీ తరువాయి)

విక్రయిస్తున్నట్టు సమాచారం. ఇదేమంటే 'లాట్ రాలేదు.. వచ్చిన లాట్ ఫెయిలైంది.. మళ్లీ వస్తాయో రావో తెలియదు.. ఆ కంపెనీల విత్తనాలు ఇప్పటికే కోటాకు మించి వచ్చాయి.. ఇక రాకపోవచ్చు.." అంటూ భయాందోళనలకు గురిచేస్తూ దుకాణదారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారుల నుంచి కూడా స్పష్టమైన సమాధానం రావడం లేదంటున్నారు.

మిర్చిలో 2222 బ్లాక్..

తేజా సన్నరకం మిర్చిలో సెమినిస్ ఎస్‌వీహెచ్‌ఏ 2222 విత్తనాలకు బాగా డిమాండ్ ఉంది. పది గ్రాములు ఉండే ఒక్కో ప్యాకెట్ ధర రూ.790. సాధారణ రకాలు ఎకరానికి 20-30 క్వింటాళ్ల దిగుబడినిస్తే ఇది మాత్రం 30-40 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. పైగా దీనికి తెగుళ్లను తట్టుకొనే శక్తి అధికంగా ఉండటంతో రైతులు దీనిపై ఆసక్తి చూపుతున్నారు. దీన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం విత్తనాలను తీసుకెళ్లి రైతులు నర్సరీలో ఇస్తున్నారు. అలాగే నర్సరీ నిర్వాహకులు కూడా ఈ రకం విత్తనాలను అధికంగా పెంచుతున్నారు. ఈ రకం విత్తనాలు అడిగిన రైతులకు పది ప్యాకెట్లలో ఆరు ఇవి ఇచ్చి.. మరో నాలుగు ప్యాకెట్లు వేరే రకం విత్తనాలను అంటగడుతున్నారు. 2222 కంటే కూడా బాగా దిగుబడి వస్తాయని నమ్మబలుకుతున్నారు. అయినప్పటికీ ఇదే రకం కావాలంటే ప్యాకెట్‌కు రూ.500 వరకు అదనంగా తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ఇక సిన్‌జెంటా 2043 విత్తనాల ప్యాకెట్ 990 ఉంటే దీనిపైనా రూ.300 వరకు అదనంగా తీసుకుంటున్నట్టు ఆరోపిస్తున్నారు.

కొందరి హెచ్చరికలు.. మరికొందరి కుమ్మక్కు

కలెక్టర్లు సహా వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నా బ్లాక్ దందా మాత్రం ఆగట్లేదని తెలుస్తోంది. చంద్రుగొండ మండలంలో యూఎస్ 7067 పత్తి విత్తనాలను ఇటీవల పెద్దఎత్తున బ్లాక్‌లో విక్రయిస్తుండటంతో రైతులు సమీపంలోని ఖమ్మం జిల్లా ఏన్కూరు వెళ్లి కొంటున్నారు. ఈ రకం విత్తనాలకు ఖమ్మం జిల్లా కేంద్రంతోపాటు కూసుమంచి, వైరా, తల్లాడ, టేకులపల్లి, ఇల్లెందు, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, గుండాల, ఆళ్లపల్లి, పొరుగున ఉన్న మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మరిపెడ, డోర్నకల్, గార్ల, తొర్రూర్, వరంగల్ తదితర ప్రాంతాల్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని తెలుస్తోంది.

పత్తిలో యూఎస్ 7067, మిర్చిలో 2222 రకం విత్తనాలు ఎక్కువగా బ్లాక్ అవుతున్నట్టు సమాచారం. కొందరు వ్యవసాయ అధికారులు బ్లాక్ మార్కెట్‌పై హెచ్చరిస్తుండగా.. మరికొందరు మాత్రం వ్యాపారులతో కుమ్మక్కవుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం.. లాల్‌చంద్, ఏడీఏ, భద్రాద్రి కొత్తగూడెం

చంద్రుగొండ, భద్రాచలం ప్రాంతాల్లో బ్లాక్‌లో విత్తనాలు అమ్ముతున్నట్టు మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేస్తున్నాం. విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించినా.. అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటాం. అడిగిన విత్తనాలు కాకుండా వ్యాపారులు వేరే రకం అంటగట్టే ప్రయత్నం చేస్తే మా దృష్టికి తీసుకురావాలి.

లౌకికవాదులు ఒక్కటవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల క్యాంపెయన్‌లు చేస్తున్నాయని తెలిపారు. 2024లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అది రాజ్యాంగానికి మరణ శాసనంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలని ఒక వేదికపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే ఈనెల 23న బీహార్‌లో ప్రతిపక్ష రాజకీయ పార్టీల సమావేశం జరుగనుందని తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) హాజరవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి కేసీఆర్ కూడా హాజరుకావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. హాజరు కావడం హాజరు కాకపోవడం వారి ఇష్టమని, కానీ బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఉంటే హాజరుపై ఆలోచించాలని కోరారు. తమకు కూడా కేరళలో కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థిగా ఉందని, అయినప్పటికీ బీజేపీని ఓడించాలన్న లక్ష్యంతో, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ముందుకెళ్తున్నామని చెప్పారు.

త్వరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో మోడీ ప్రభుత్వం ప్రమాదకరమైన చట్టాలను తీసుకురాబోతుందని చెప్పారు. ఢిల్లీలో తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక ఆర్డినెన్స్‌ను అన్ని పార్టీలు ఖండించాయని, ఫెడరల్ వ్యవస్థను బలపరచాలన్న లక్ష్యం ఉన్న వారందరూ ఆ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించాలని కోరారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను బలవంతంగా దేశంపై రుద్దేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. దీనివల్ల ప్రజల మధ్య విభజన సృష్టించి మత విద్వేషాలతో రాజకీయాలు చేయాలని చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ప్రజాస్వామ్యవాదులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్నిటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం అమ్ముకున్న రైతులకు వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి జాగా ఉన్నవారికి ఐదు లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే పంపిణీ చేయాలని, పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని అన్నారు. పేదలు గుడిసెలు వేసుకుంటే పీకేయడం, కేసులు పెట్టడం సరింది కాదని ఆ చర్యలను మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తీగల సాగర్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర పార్టీకి రూ.16,200 సహాయం

త్రిపుర రాష్టంలో జరుగుతన్న హింసాకాండతో కమ్యునిస్టు పార్టీ కార్యకర్తలు అన్యాయనికి గురౌతున్నారని రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సంఘీభావం తెలుపుతూ.. ఆదుకోవాలని కోరగా ముఖ్య కార్యకర్తలు స్పందించారు. ఎవరికి తోచిన వారు తమ వంతు సహాయంగా అందజేశారు. మొత్తంగా 16,200 రూపాయలు అందించారు. ఆ విరాళాలను త్రిపుర కమిటీకి అందజేస్తామని చెప్పారు.

బీఆర్ఎస్ దశాబ్ది దగా

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులపై చర్చించింది. అనంతరం మహేష్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్... ప్రభుత్వ నిధులు వెచ్చిస్తూ పార్టీ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నదని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలన్నీ దశాబ్ది దగా కార్యక్రమలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ దిష్టిబొమ్మను రావణ సురుడిలాగా తయారు చేయాలి. పది తలలు ఏర్పాటు చేసి వాటికి ప్రభుత్వ వైఫల్యాలను రాయాలి. భారీ ప్రదర్శన నిర్వహించాలి. ఆ తర్వాత దహనం చేయాలి. అనంతరం ఆర్‌డీవోకుగానీ, ఎమ్మార్వోకు గానీ వినతిపత్రం సమర్పించాలి' అని సూచించారు. ఆయా పథకాల బాధిత ప్రజలు ఆ నిరసన ప్రదర్శనల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గాల్లోని నాయకులంతా ఈ కార్యక్రమం జయప్రదానికి కషి చేయాలని సూచించారు.

ప్రభుత్వ వైఫల్యాలివే...

- కేజీ నుంచి పీజీ ఉచిత నిర్బంధ విద్య
- ఫీజ్ రీయింబర్స్ మెంట్
- ఇంటికో ఉద్యోగం
- నిరుద్యోగ భృతి
- పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు
- దళిత కుటుంబాలకు మూడెకరాల భూమి
- పోడు భూములకు పట్టాలు
- రైతు రుణ మాఫీ
- 12 శాతం ముస్లిం రిజర్వేషన్లు
- 12 శాతం గిరిజన రిజర్వేషన్లు

విద్యార్థులను తీర్చిదిద్దే సత్తా ఉపాధ్యాయులదే

- ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యా దినోత్సవం



గంభీరావుపేట: మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ - గంభీరావుపేట:
మనిషి అనే మట్టి ముద్దను విద్య అనే కుసుమాని అద్ది ప్రపంచంతో పోటీ పడేలా పౌరులుగా ఏర్పరచే సత్తా ఉపాధ్యాయులకే ఉందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని గోరంటాల గ్రామంలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవానికి ఆయనతోపాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్ పల్లి వినోద్ కుమార్ లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. గోరంటాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసిన 100 మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యకు దగ్గరవుతున్నారని నేపథ్యంలో సమస్య పరిష్కారం కోసం తగు కారణాలను తెలుసుకోగా అదనపు తరగతి గదులు, 4టీచర్ల భర్తీని పెంచాలని వివరించారు. సానుకూలంగా స్పందిస్తూ టీచర్లను కేటాయించి తక్కువ వ్యవధిలోనే అదనపు తరగతి గదులను నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రాష్టానికే గంభీరావుపేట కేజీ టూ పీజీ ఆదర్శంగా నిలిచిందని, పలు ప్రాంతాల నుండి అడ్మిషన్ల కోసం సిఫారసులు అందుతున్నాయని తెలిపారు. గంభీరావుపేటలో విద్యార్థుల సౌకర్యార్థం కోసం విద్యార్థుల కోసం బీసీ, ఎస్సీ హాస్టల్ ల ఏర్పాటు చేయడానికి ముందుటామన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు, ఎమ్మెల్సీ రఘోతమ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంత్, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ ఎంపీపీ వంగ కరుణ, గ్రామ సర్పంచి పాల్గొన్నారు.



యువత భవిష్యత్తుకు ప్రభుత్వం కృషి

మంత్రి గంగుల కమలాకర్



నవతెలంగాణ - కరీంనగర్ : యువతకు మంచి భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమం పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా గ్రంథాలయంలో విద్యా దినోత్సవం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయంలో రూ.75లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవన తాత్కాలిక షెడ్‌ను ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మకమైన ప్రగతి సాధించామన్నారు. కరీంనగర్ జిల్లా గ్రంథాలయాన్ని తెలంగాణలోనే గొప్ప గ్రంథాలయంగా తీర్చిదిద్దుతామని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని నేటి తరం ఉద్యోగాలు సాధించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ..కరీంనగర్ జిల్లా గ్రంథాలయంలోని రీడింగ్ రూమ్ లలో రాష్ట్రంలోనే తొలిసారి ఏసీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వారధి సొసైటీ ద్వారా కరీంనగర్ జిల్లా గ్రంథాలయానికి రూ.29లక్షల 75వేల 829 విలువ గల 4056పుస్తకాలు, 12ఏయిర్ కండిషనర్లు, విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కోసం రూ.1లక్ష అందించినట్టు వివరించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ గ్రంథాలయంలో కల్పిస్తున్న సౌకర్యాలు, వసతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి హరిశంకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ రెడ్డవేణి మధు, నారదాసు లక్ష్మణరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, కార్పొరేటర్లు బండారి వేణు, వాల రమణారావు, గందే మాధవి, తోట రాములు, ఎడ్ల అశోక్, బోనాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని కాట్నపెల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ విద్యా దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి ఉచితంగా ఏకరూప దుస్తులను ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కే హరి చరణ్‌లు పంపిణీ చేశారు. సాంబయ్య పల్లె ప్రాథమిక పాఠశాలలో జెండా ఆవిష్కరించి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సందేశాన్ని వినిపించారు. విద్యార్థులకు దుస్తులు పాఠ్యపుస్తకాలను అందజేశారు. రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఉత్సవాలు వేడుకలలో ఎంపీపీ చిలుక రవీందర్, ఎంపీడీవో స్వరూప పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కొత్తపెల్లి రామకృష్ణ, చిలుక లింగయ్య, ఉప సర్పంచ్ చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు జయరాజ్, రిష్వేంద్రమని, కే రవి, కార్యదర్శి మైతాబ్, సిఆర్పి రమేష్ పాల్గొన్నారు.

ఎన్‌గల్‌లో పాఠశాల ప్రారంభం

నవతెలంగాణ - చందుర్తి : మండలంలోని ఎన్‌గల్ గ్రామంలో మంగళవారం మన ఊరు–మన బడిని స్థానిక సర్పంచ్ సత్తయ్య ప్రారంభించారు. విద్యా ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాధనో పాధ్యాయులు లకావత్ లాఖ్య ఉన్నారు.

ప్రవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు : జెడ్పీటీసీ

నవతెలంగాణ - గన్నేరువరం : సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చొరవతో మన ఊరు–మన బడి కార్యక్రమానికి నిధులు చేకూర్చి అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది కార్యక్రమాలలో భాగంగా మండల పాఠశాలలో విద్యా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గన్నేరువరం, జంగపల్లి ఉన్నత పాఠశాలతోపాటు పారువెల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు నత్యాలు, ఆటా, పాటలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీలో పాల్గొని మొక్కలు నాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. జంగపల్లి పాఠశాలలో డైనింగ్ హాల్, డిజిటల్ స్క్రీన్ క్లాసులు, రాగి జావా, ప్రహరీ గోడ, ఉచిత నోట్ బుక్స్ లను జెడ్పీటీసీ ప్రారంభించారు. అనంతరం డిజిటల్ క్లాసుల విధానాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు పుల్లెల లక్ష్మి, అటికం శారద, తీగల మోహన్ రెడ్డి, ఎంపిటిసి అటికం రాజేశం గౌడ్, ఉప సర్పంచ్లు బూర వెంకటేశ్వర్, అక్క రాజు ఆశాలు,గీకురు లత, తహసిల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో స్వాతి, ఎంపీ ఓ నరసింహారెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంతో పాటు మోహిని కుంట, మద్దికుంట, ముస్తాబాద్, కొండాపూర్ ,నామాపూర్, పోతుగల్, ఆవు నూరు గూడెం, పలు గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యా దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నరసయ్య ఎంపీడీవో రమాదేవి పాల్గొన్నారు.

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : చదువుకునే విద్యార్థుల భవిష్యత్తు ముఖ్య లక్ష్యంగా పెట్టుకొని విద్యారంగానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ పడిగేల మానస అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో బాగంగా విద్యా పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యా పండుగను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులచే గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం రాగిజావని కూడా ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంకారపు అనిత, ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ కందుకూరి రామా గౌడ్ పాల్గొన్నారు.

విద్య కోసం అధిక నిధులు : ఎమ్మెల్యే రసమయి

నవతెలంగాణ - ఇల్లంతకుంట : రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం అధిక నిధులు కేటాయిస్తుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో దశాబ్ది ఉత్సవాలలో భాగంగ విద్యాదినోత్సవం పురష్కరించుకొని మన ఊరు మన బడి కార్యక్రమంలో పాల్గొని తరగదులలోకి వెల్లి పిల్లలకు కొద్దిసేపు పాటాలు భోదించారు. సుమారు 14లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, విద్యార్థి విద్యార్థులకు నోట్ బుక్స్, దుస్తులు పంపిణీ చేసి రాగి జావ అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వేణు, ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మెన్ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య.. జెడ్పీ చైర్‌పర్సన్

నవతెలంగాణ - కోనరావుపేట : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందజేస్తున్నామని జెడ్పి చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి అన్నారు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని కనగర్తి గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో నిర్మించిన పాఠశాల తరగతి గదులు వంటగది లను ప్రారంభించి, విద్యార్థులకు రాగి జావా ను అందించారు. మండల కేంద్రంలో గ్రంధాలయాన్ని ప్రారంభించి, మోడల్ స్కూల్ లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫాములు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన జిల్లాల్లో మొదటి విడతలో భాగంగా 172 ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేశామని, మండలం లో మొదటి విడతలో భాగంగా 16 పాఠశాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. మొదటి విడతలో సుమారుగా 4కోట్ల 70 లక్షలతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. దీని ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షేడ్స్ నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, జిల్లా సర్పంచుల ఫోరం కార్యదర్శి సంతోష్, సర్పంచులు భారతి బాపురెడ్డి, పొకల రేఖ సంతోష్, ఎంపీటీసీలు దేవరకొండ నరసింహ చారి . లక్ష్మి పాక్స్ చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్ రావు, పాక్స్ వైస్ చైర్మన్ భూం రెడ్డి, ఎంపిడిఓ రామ కృష్ణ, ఎంఈఓ రఘపతి, నాయకులు, వార్డ్ మెంబర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య : ఎంపీపీ

నవతెలంగాణ - తిమ్మాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు– మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్య, వసతులు కలిపిస్తుందని,ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్ రెడ్డిపిలుపునిచ్చారు. మండలంలోని నల్లగొండ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన విద్యాదినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పనులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, దుస్తులతో పాటు ఈఏడాది నుంచి రాగి జావ,ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేస్తుందన్నారు.అలాగే డిజిటల్ పాఠాలను బోధించేందుకు ఉన్నత పాఠశాలలో ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డ్స్,రీడింగ్ కార్నర్ లను ఏర్పాటు చేసిందన్నారు.ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు, ఉచిత దుస్తులు పంపిణి చేశారు.అలాగే మండలంలోని అన్ని పభుత్వ పాఠశాలలో విద్యాదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు చేసిన నత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్య అతిథులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దన్నమనేని శోభ నర్సింగరావు, ఎంపిటిసి కవ్వంపల్లి పద్మ,ఎంపిడివో రవీందర్ రెడ్డి, ఎంఇఓ కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి,డిఇ రవి ప్రసాద్, ఏఈ సురేందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుల రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి : పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు



ఇల్లంతకుంట : విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే రసమయి



కొనరావుపేట: ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్



తిమ్మాపూర్: విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపిపి



మానకొండూర్: పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న జీవీ రామకృష్ణారావు

ఉన్నత ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థికి సన్మానం

మండలంలోని పర్లపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన విద్యా దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థి కామల్ల మహేష్ ను సర్పంచ్ మాదాడి భారతి నరసింహారెడ్డి సన్మానించారు. మహేష్ విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ కళాశాలలోనే జరిగిందని ఆయనను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుద్దాల రాజేష్, చంద్రమౌళి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత : జీవీ రామకృష్ణారావు

నవతెలంగాణ - మానకొండూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జీవి రామకృష్ణారావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం విద్యా దినోత్సవ వేడుకను మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణారావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మన ఊరు– మన బడి పథకం ద్వారా పాఠశాలలను అన్ని రకాల మౌలిక వసతులతో ఆధునీకరిస్తున్నమన్నారు. ముందుగా నూతన డిజిటల్ బోర్డులను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శేఖర్ గౌడ్, ప్రదానోపాధ్యాయులు డి. శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొప్పాపూర్‌లో గ్రంథాలయం ప్రారంభం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య మంగళవారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఆకునూరి శంకరయ్య మాట్లాడుతూ బొప్పాపూర్ గ్రామంలో ఉన్న గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, గ్రామస్తుల కోరిక మేరకు అహర్నిశలు శ్రమించి ఉన్నతాధికారులతో మాట్లాడి బొప్పాపూర్ గ్రామంలో కూడా గ్రంథాలయం ఉండాలనే ఉద్దేశంతో వారం రోజుల్లో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులంతా ప్రతి రోజు ఒక గంట కేటాయించి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలని గ్రంథలయానికి కావల్సిన పుస్తకాలను తమవంతుగా సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బింగి చిరంజీవి, జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, ఎంపిపి పిల్లి రేణుక కిషన్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కొండ రమేష్‌గౌడ్, మాజీ ఏఎంసి చైర్మన్ నరసింహారెడ్డి, అందె సుభాష్, అంగన్‌వాడి టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బొప్పాపూర్ పారిశుధ్య కార్మికురాలికి సన్మానం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు పండుగ భారతి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికురాలిగా గ్రామానికి మంచి సేవలను అందించి రాష్ట్ర అవార్డు పొందిన పండగ భారతిని మంగళవారం ప్రజాప్రతినిధులు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బింగి చిరంజీవి, జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, ఎంపిపి పిల్లి రేణుక కిషన్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కొండ రమేష్‌గౌడ్, మాజీ ఏఎంసి చైర్మన్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అరెస్టులతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరును ఆపలేరు



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని అడుగుతున్నందుకు కాంగ్రెస్ నాయకులను ఎన్నిసార్లు అరెస్టు చేసినా ఉద్యమం ఆపలేరని మండల కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మంగళవారం అన్నారు. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నెలకొల్పినట్లయితే కోనరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాలలకు సెంటర్ పాయింట్‌గా ఉంటుందన్నారు. ఒక్క ఎల్లారెడ్డిపేటలోనే 1600మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం తప్పకుండా మంత్రి కేటీఆర్‌ను అడ్డుకుంటామని అన్నారు. అరెస్టైయిన వారిలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గపు కార్యదర్శి మానుక నాగరాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బానోతు రాజునాయక్‌లు ఉన్నారు.

ప్రైమరీ పాఠశాల ప్రారంభం



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని బండలింగంపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల పునఃనిర్మాణం చేసి మంగళవారం సర్పంచ్ కొత్తపల్లి వాణి – నర్సింలు ప్రారంభించారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేశారు. పాఠశాల పునఃనిర్మాణం చేయించినందుకు పాఠశాల విద్యా కమిటీ చైర్మెన్‌తోపాటు సభ్యుల తరపున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు, కాంట్రాక్టర్ శంకర్‌కు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్తపల్లి పద్మ దేవయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు దోపిడీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకు దోపిడీకి యత్నించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మండలంలోని దుమాల గ్రామానికి చెందిన పిల్లి చందు అనే వ్యక్తి ఈ బ్యాంకు దోపిడీకి ప్రయత్నించాడు. పోలీసులు 24గంటలలోపే చందును గుర్తించి పట్టుకోవడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చందును సిరిసిల్ల సిసిఎస్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

మహిళా గ్రంథాలయ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-కరీంనగర్ : కరీంనగర్‌లోని స్థానిక రాంనగర్‌లో గల 37వ డివిజన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మహిళా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయాన్ని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి హరిశంకర్‌తో కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, బండారి వేణు, తోట రాములు, ఎడ్ల అశోక్, భూమా గౌడ్, గుగ్గిళ్ల జయశ్రీ, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

ఎదుర్కోలేకనే భౌతిక దాడి..

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్



నవతెలంగాణ - కరీంనగర్ : నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాటం చేసే ఎస్ఎఫ్ఐని సైద్ధాంతికంగా ఎదుర్కొనలేక భౌతికంగా దాడులకు దిగడం సిగ్గుమాలిన చర్య అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఏఓ స్కూల్‌లో అక్రమంగా పుస్తకాలు, దుస్తులు అమ్ముతున్నారన్న సమాచారంతో స్కూల్‌కు వెళ్లి సమాచారం తెలుసుకుంటుండగా అక్కడే ఉన్నా ఏబీవీపీ నాయకులు మీకేం అవసరమంటూ.. దూర్భాషలాడుతూ బయటకు వచ్చాక పక్కా ప్రణాళికతో కర్రలతో దమపై దాడి చేశారని వివరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్‌ను ఒకడిని చేసి నలుగురు కొట్టారని తెలిపారు. నిరంతరం విద్యారంగా సమస్యలపై పోరాటం చేసే ఎస్ఎఫ్ఐని సైద్ధాంతికంగా ఎదుర్కొనలేక, ఇలా భౌతికంగా దాడులకు దిగడం సిగ్గుమాలిన చర్య అని, ఈ దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అరవింద్, రోహిత్, వినయ్, ఆదిత్య, శివ సాయి, నాయకులు తదితరులున్నారు.

గ్యాస్ స్టవ్ పంపిణీ



నవతెలంగాణ - కరీంనగర్ : స్త్రీలకు సహాయం అందించడంలో ఎప్పుడూ ముందుండే అలయన్స్ క్లబ్స్ డిస్ట్రిక్ట్ 137ఏ కరీంనగర్ మంగళవారం ఒక మహిళకు గ్యాస్ స్టవ్, రెగ్యులేటర్, పైప్, లైటర్‌ను వాసుదేవ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మెన్, హెూమియోకేర్ డాక్టర్ సౌమ్య శ్రీదేవి లు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ సౌమ్య శ్రీదేవి, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, కుమారస్వామి, గాలిపెల్లి నాగేశ్వర్, శ్రీనివాస్ గాంధీ, చరిమల వెంకటేశ్వర్లు, వాసుదేవ హాస్పిటల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోజూ నీళ్లు కూడా సరిగా ఇవ్వడం లేదు..

- కేటీఆర్ సమాధానం చెప్పి ప్రారంభోత్సవాలకు రావాలి
- కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్ : 24గంటలు నల్లా నీళ్లు ఇస్తామని చెప్పి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శిలాఫలకం శంకుస్థాపన చేసి సంవత్సరం దాటినా ఇప్పటికి అతీగతీ లేదని, కనీసం రోజూ కూడా సరిగా నీళ్లు ఇవ్వడం లేదని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం అలుగునూరు బ్రిడ్జిపై పైలాన్, శిలాఫలకం వద్ద కాంగ్రెస్ నగర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి గంగుల కమలాకర్ పదేళ్ల నుంచి 24గంటలు నీళ్లు ఇస్తామని చెబుతూనే ఉన్నాడని, గతేడాది మార్చి నెలలో అట్టహాసంగా మంత్రి కేటీఆర్‌చే శంకుస్థాపన చేపించి పనులు ప్రారంభించకుండా కనీసం రోజూ కూడా సరిగా నీళ్లు ఇవ్వడం లేదన్నారు. బుధవారం కేబుల్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రి కేటీఆర్ కరీంనగర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం వరకు స్పందించకపోతే ఏదో ఒక ప్రాంతంలో మంత్రి కేటీఆర్‌ను అడ్డుకుంటామని అన్నారు.

ఫార్మసీ కళాశాలలో రాష్ట్ర విద్యా దినోత్సవం



నవతెలంగాణ-కరీంనగర్ : రాష్ట్ర దశాబ్ది ఉత్స వాలను పురస్కరించుకొని శాతవాహన విశ్వవిద్యాల యం ఫార్మసీ కళాశాలలో రాష్ట్ర విద్యా దినోత్స వం మంగళవారం నిర్వహిం చారు. ఈ ఉత్సవాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీశైలం జాతీయ జెండాను ఎగురవేసారు. కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థులు రంగవల్లులల తో అలంకరించారు. ఈ సందర్భంగా కళాశాలలో తెలంగాణలో విద్యాభివృద్ధిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ చరిత్ర, సంస్కృతిపై క్విజ్‌ను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాట్య, గాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్, విభాగాధిపతి డాక్టర్ కె.సునీత, అధ్యాపకులు డాక్టర్ బి.భాగ్యలక్ష్మి, జీఎల్ అర్చన, డాక్టర్ సీహెచ్.అనిల్ కుమార్, డాక్టర్ కె.తిరుపతి, డాక్టర్ ఏ.శ్రీనివాస్ నాయక్, పి.క్రాంతి రాజు పాల్గొన్నారు.

పొన్నం ప్రభాకర్ ఔట్ డేటెడ్ లీడర్...

నా జోలికి వస్తే ఊరుకోనూ.. : మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ - కరీంనగర్ : కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొన్నం ఔట్ డేటెడ్ నాయకుడని, ఆయనను ప్రజలు మరచిపోయారని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ గ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కరీంనగర్‌లో కాంగ్రెస్ బలహీనపడేందుకు ఆయనే కారణమని, గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒకటంటే ఒక్క సీటు గెలుచుకోలేదన్నారు. చివరకు పొన్నం ప్రభాకర్ డివిజన్‌లోనే బీజేపీ గెలిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు రెండు ఒకటేనని, పొద్దంతా తెలంగాణపై విషం చిమ్మే ఈ నాయకులు..రాత్రివేళ మాట్లాడుకునే తత్వం వారిదన్నారు. కాంగ్రెస్, బీజేపీ లు ఒకటేననడానికి హుజురాబాద్, మునుగోడు ఎన్నికలు నిదర్శనమన్నారు. ఐదు సంవత్సరాల్లో 4 సంవత్సరాల 9 నెలల పాటు కనిపించకుండా పోయిన ఈ నాయకులు ఇప్పుడు ఎన్నికల వేళ మేమున్నామని, రాజకీయ గుర్తింపు కోసం మళ్లీ వస్తున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ లు రెండో స్థానం కోసం కొట్లాడుకుంటున్నాయన్నారు. బండి సంజయ్ కేసీఆర్‌ను అంటే.. తాము ఆయనను అంటామన్నారు. నేను ఎవరి జోలికి పోనని, నా జోలికి వస్తే మాత్రం వదలనన్నారు. ధాన్యం కొనుగోళ్లపై కూడా అసత్యపు ఆరోపణలు చేసినా నాయకులు నేడు బీసీలకు అందించే లక్షా ఆర్థిక సహాయంపై కూడా అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అర్హులైన బీసీలందరికీ విడతల వారీగా సహాయం చేస్తామని స్పష్టం చేశారు.

పార్ట్ టైం అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-కరీంనగర్ : తెలంగాణలోని అన్ని విశ్వ విద్యాలయాలలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు అందరిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ విశ్వ విద్యాలయాల పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. స్థానిక శాతవాహన విశ్వవిద్యాలయంలో శాతవాహన విశ్వవిద్యాలయ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ విశ్వ విద్యాలయాల పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, కాకతీయ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కిరణ్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు, వాటిని పరిష్కరించుకునేందుకు ఉన్న మార్గాలను సభ్యులతో కలిసి చర్చించారు. వారు మాట్లాడుతూ..తెలంగాణలో వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులందరినీ కూడా రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం పార్ట్ టైం అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను, రెగ్యులరైజ్ చేసే ప్రక్రియలో పార్ట్ టైం అధ్యాపకులను కూడా భాగం చేయాలని శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్టర్ ప్రొఫెసర్ ఎం.వరప్రసాద్‌కి వినతిపత్రం ఇవ్వగా, దానికి వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయ పార్ట్ టైం అధ్యాపకుల ప్రెసిడెంట్ డాక్టర్ బి.పరుశురాములు, జనరల్ సెక్రెటరీ నరసింహ చారి, కార్యవర్గ సభ్యులందరు పాల్గొన్నారు.

తెలంగాణలో విద్యారంగానికి పెద్దపీట

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

తెలంగాణలో విద్యారంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం విద్యాదినోత్సవం పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మండలంలోని కస్తూర్బాగాంధీ



విద్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కోటి 34 లక్షల రూపాయలతో కస్తూర్బా నూతన భవనం నిర్మాణం చేయడం జరిగిందన్నారు. అనంతరం 34 కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనితీరు ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో లక్షల రూపాయలు ఫీజులు చెల్లించే బదులు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ లు నేమూరి లత, లింగంపల్లి గంగాధర్, నాయకులు నేమూరి సత్యనారాయణ, జాజల జగన్ రావు పాల్గొన్నారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు

నవతెలంగాణ జగిత్యాలటౌన్



తనిఖీలు చేస్తున్న అధికారులు

జగిత్యాల జిల్లాలో రావాణా శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేట్టారు. ఫిట్ నెస్ లేని ప్రయివేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. ఎస్‌కేఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలోని గొల్లపల్లి రోడ్డు బైపాస్ చౌరస్తా వద్ద సుమారు 35 స్కూల్ బస్సులను తనిఖీ చేసి నిబంధనలు పాటించని 4 బస్సులను సీజ్ చేశారు. ఈ తనిఖిల్లో ఎంవిఐలు వంశీధర్, వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

చల్‌గల్ గ్రామంలో మినీ లైబ్రరీని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



ప్రారంభిస్తున్న చైర్మెన్

జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో పంచాయతీ భవనంపైన మిని లైబ్రరీని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్మెన్ దావా వసంత సురేష్, జిలా గ్రంథాలయ చైర్మెన్ డాక్టర్ చంద్రశేకర్‌గౌడ్, అదనపు కలేక్టర్ మంద మకరందులు ప్రారంభించారు.చల్‌గల్ ప్రభుత్వ పాఠశాలలో చదివి 9.8 జీపీఏ సాధించిన సోనియాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగ నర్సు రాజన్న, ఉపసర్పంచ్ పద్మ తిరుపతి, పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి,రైతు బందు మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, గ్రామ శాక అధ్యక్షులు పుదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాలరూరల్ మండల చల్‌గల్ గ్రామానికి చెందిన వెలమ రాములు కూతురు హర్షిత (బన్నీ) పదో తరగతి ఫలితాల్లో తక్కువ జీపీఏ సాధించగా తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పరామర్శించారు.

ఈత వనం దగ్ధం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు దగ్ధమైన ఈత, తాటి వనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత మంగళవారం పరిశీలించారు. జడ్పీ నిధుల నుంచి రెండు బోర్ మోటర్లకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ.4 లక్షల ప్రొసీడింగ్స్ కాపిని అందజేశారు.

సినియర్ సిటీజన్ల నేత్ర దానం అంగీకార పత్రాలు అందజేత



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేత్ర దాన సంకల్పం నిర్వహించారు. మంగళవారం హౌజింగ్‌బోర్డు కాలనీలో ప్రపంచ వయోధికులపై వేధింపుల నివారణకు నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాల సందర్భంగా 36 మంది సీనియర్ సిటీజన్లు నేత్ర దానానికి అంగీకరిస్తూ తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరిఅశోక్ కుమార్‌కు అంగీకార పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జీ.ఆర్.దేశాయ్, మున్సిపల్ కౌన్సిలర్లు పంబాల రాం కుమార్,కూసరి అనిల్‌కుమార్, సీనియర్ సిటీజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత్ రెడ్డి,బొల్లం విజయ్, ఎం.డి.యాకూబ్, కోశాధికారి వెలముల ప్రకాష్ రావు, నాయకులు పాల్గొన్నారు.

హబ్సీపూర్, గుల్లపేట గ్రామాల్లో బాడిబాట

నవ తెలంగాణ జగిత్యాల టౌన్ :

జగిత్యాలరూరల్ మండలంలోని హబ్సీపూర్, గుల్లపేట గ్రామంలో అంగన్‌వాడీ బాడిబాట కార్యక్రమం సీడీపీవో ఎం. వీరలక్ష్మి సూపర్‌వైజర్ జానకి పాల్గొని అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన పిల్లలో అక్షరాభాస్యం చేయించారు. ఈ కార్యక్రమంలో గుల్లపేట గ్రామ సర్పంచ్ జక్కుల తిరుపతి, హబ్సీపూర్ సర్పంచ్ మారు రాజేశ్వర్‌రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, ప్రేమలత, జమున, శ్రీలత, సుజాత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు షాపులు దగ్ధం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన నాయి బ్రాహ్మణులు గొల్లపల్లి అంజయ్య వెయ్యిగండ్ల నవీన్‌కి చెందిన సెలూన్ షాపు, పంక్చర్ షాపు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. వాటిని ఎమ్మెల్యే పరిశీలించి ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.

జనసేనలో 50 మంది చేరిక

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన 50 మంది యువత జనసేన పార్టీలో చేరినట్టు ఆ పార్టీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బెక్కం జనార్దన్ తెలిపారు. జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా తెలంగాణలో పవన్ కళ్యాణ్ ఒకే దఫాలో 30 నియోజకవర్గ ఇన్‌చార్జిలను నియమించారన్నారు. రాయికల్ మండలంలో పార్టీ ప్రచారంలో భాగంగా మంగళవారం వెళ్లగా జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులైన యువత, మహిళలు 50 మంది జనసేనలో చేరారని జనార్ధన్ పేర్కొన్నారు. ఇందులో కోరుట్ల సీనియర్ నాయకులు గంగం అజయ్, రాయికల్ మండలంలోని పార్టీ కార్య కర్తలు మల్లికార్జున్, శివ కుమార్ బాబు, సింగాని నరేష్, రాకేష్ పవన్, శ్రీను, తిరుపతి, వెంకటేష్, జగిత్యాల మండల అధ్యక్షులు బొల్లి రాము, వీర మహిళల విభాగం మొగులోజి విజయ, సాతారం పద్మ, పొల్లం స్వప్న పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-కోరుట్ల

మండలంలోని సంగెం గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు గ్రామ రైతుబంధు అధ్యక్షుడు సుధవెని భూమయ్య పుస్తకాలు, పెన్నులు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సయ్య, మాజీ సర్పంచ్ జక్కని గణేష్, వార్డు సభ్యులు ప్రశాంత్, దేవయ్య, రాజు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ సమిన సుల్తానా, గంగ స్వామి, శంకర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్

నవతెలంగాణ-మెట్‌పల్లి

మండలంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ తిరుపతి నాయక్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళ వారం మెట్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్ మాట్లాడుతూ.. మెట్‌పల్లి పట్టణంలో పేదలకు సెంటు భూమి లేక ఇబ్బందులు పడుతున్నారని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఏడు వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలంలోని మెట్ల చిట్టాపూర్ గ్రామంలో 50 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకొని పదేండ్లగా నివాసం ఉంటు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో మౌనిక, సరస్వతి, కవిత, స్వప్న, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదలకు అందించాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలిచ్చి, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ముడుగం రాజలింగం డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్మపురి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పట్ల లక్ష్మి ముప్పట్ల సుమలత, బొల్లారపు రాధ, రత్నం భారతి, నల్ల లక్ష్మి,



కోరుట్ల : వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సుద్దాల రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని జంబిగద్దె ప్రక్కన గల ప్రభుత్వ సర్వే నెం 923లో ఉన్న 52 ఎకరాల స్థలంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని పేదలతో కలిసి 71రోజులుగా ఆందోళన చేస్తున్నామని, వాటికి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుట్ల తహసీల్దార్‌కు ఇండ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు గుమ్మడి రమేష్ వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో జూన్ 18 నుంచి 27 వరకు బస్సు యాత్ర కొనసాగుతుం దన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్న పేదవాడికి సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇల్లు కట్టుకునే వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్, తిరుపతి నాయక్, సిపిఐ(ఎం) మండల కన్వీనర్ పోచన్న, సిపిఐ(ఎం) మండల కమిటి యసోద, సిపిఐ(ఎం) మండల కమిటీ నాయకురాలు జిల్లా మమత, రజియా సుల్తాన్, ఆవాజ్, నాగరాజు, గుడిసె వాసులు పాల్గొన్నారు.

జగిత్యాల : ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకున్న వారందరికీ ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు లెల్లెల బాలకృష్ణ అన్నారు. మంగళ వారం తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో జరిగిత్యాలరూరల్‌అర్బన్ తహ సీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, ఇందూరి సులోచన, నాని, శారద, ఎన్‌జీవో రమేష్, మనిషా, వినోద్ వివిధ ప్రజాసంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ధర్మపురి :వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



మెట్‌పల్లి : వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



జగిత్యాల: నిరసన తెలుపుతున్న నాయకులు

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- పభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపేలా 22న దశాబ్ద దగా ప్రదర్శన
- 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేసినట్లు నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ చేయను

నవతెలంగాణ- జగిత్యాల

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం ప్రజాదనాన్ని దుర్వినియోగం చేసిన తీరును కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు వివరిస్తామని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగా ఈనెల 22న రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా దశాబ్ద ఉత్సవాల దగా పేరుతో నిరసన ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల కాలంలో ఎంతమంది పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించారో సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన చోట కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తుందని డబుల్ బెడ్ రూంలు కట్టినచోట మాత్రమే బీఆర్ఎస్ ప్రచారం చేస్తుందా అని సవాల్ విసిరారు. దళిత బంధు వంటి పథకాలను కేవలం ప్రచారం కోసమే వాడుకుంటున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పాలనలో



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

అన్ని రంగాల్లో రాష్ట్రం నష్టపోయిందని మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. 24 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చినట్టు నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ చేయనని అన్నారు. కేసీఆర్ ప్రతి పథకానికి కాంగ్రెస్ పథకాలే ఆధారమని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధితోనే జగిత్యాలకు గుర్తింపు వచ్చిందన్నారు. నాలుగేళ్లుగా దేశంలో ఒక్కరికీ కూడా ఉపాధి కల్పించని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఎద్దేవా చేశారు.

కొప్పుల కు ఓటర్లే సమాధానం చెప్తారు...

ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి కాలుష్యం వస్తే ముక్కు నేలకు రాస్తానంటూ మంత్రి కొప్పుల ఈశ్వర్ విసిరిన సవాలు పై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించారు. ఇప్పటికే ఈశ్వర్‌కు ముక్కు నేలకు రాసినంత పనైందని వచ్చే ఎన్నికల్లో ఓటర్లే ఈశ్వర్ ముక్కు భూమికి రాయిస్తారని ఎద్దేవా చేశారు. ఇథనాల్ వద్దు.. చక్కెర ముద్దు అని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల నుంచి మంచినీళ్ల సరఫరా కాంగ్రెస్ హయాంలోనే ప్రతి వర్గానికి న్యాయం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లేపల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, వీర బత్తినీ శ్రీనివాస్, ఎండి.మున్నా, తిమ్మాపూర్ సర్పంచ్ రమ్య లక్ష్మణ్, చందా రాధా కిషన్, గర్వందుల నరేష్, మారు గంగా రెడ్డి, ఇబ్రహీం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా మధు, కట్ట శివ కుమార్, వేణు రావు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో ఈ నెల 16న ప్రమాదవశాత్తు దగ్దమైంది. గీతా కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి బావి, పైపు లైన్ల ఏర్పాటు కోసం రూ.5 లక్షల సీడీపీ నిధులు మంజూరు చేసి, కొబ్బరి కాయ కొట్టి, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గీతా కార్మికులు జీవన్‌రెడ్డికి అభిమానంతో కల్లు పోసి తమ ఆప్యాయతను చాటుకు న్నారు. ఈ కార్యక్రమంలో ముక్కెర మారుతి (అధ్యక్షుడు), నేరెళ్ల ఏళ్ళ గౌడ్, గాజర్ల శంకర్, గాజర్ల అంజన్న, గాజర్ల బుచన్న, పెండం అనిల్, గుర్రం, మల్లేశం, కాసరపు మల్లయ్య, మనోజ్, నందన్న, సల్లూరి శివ, తిరుపతి, జలెందెర్ గౌడ్, నీరటి గంగన్న ఒగులపు వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయి విద్యను మరిపిస్తున్న 'గురుకులాలు'

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ రాయికల్

దేశంలోకెల్లా అత్యధిక గురుకుల విద్యాలయాలు కలిగిన రాష్ట్రం తెలంగాణ అని, రాష్ట్రంలో 1000 గురుకుల పాఠశాలలో 6 లక్షల మంది విద్యార్థులు కార్పొరేట్ స్థాయి విద్యను గురుకుల పాఠశాలలో అభ్యసిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణం, మండలంలోని తాట్లవాయి,అల్లిపూర్, భూపతిపూర్ గ్రామాల్లో విద్యాదినోత్సవం నిర్వహించారు.రాయికల్ పట్టణంలోని ప్రభుత్వం బాలుర పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన అభివృద్ధి పనులను ,డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఏక రూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ మోర హన్మండ్లు,ఎంపీపీ లౌవుడియా సంధ్యారాణి సురేందర్,జడ్పీటీసీ అశ్విని,వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్‌లు మ్యాకల అనురాధా,తురగ శ్రీదర్ రెడ్డి,మ్యా కల



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కాంతారావు, వల్ల కొండ మహేష్,సాయి, మహేందర్, కో ఆప్షన్ సభ్యులు సొహెల్, మహేంద్ర బాబు, కమిషనర్ సంతోష్, ఈ భాస్కర్, మండల విద్యాధికారి గంగాధర్, సర్పంచులు జక్కుల చంద్రశేఖర్, అక్కినేని గంగారెడ్డి,రాగి సాగరిక శ్రీనివాస్, యూత్ ప్రధాన కార్యదర్శి బర్కం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బీర్పూర్ మండల తుంగూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల 81 వేలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన యువకుడు అజయ్ పాఠశాల విద్యార్థుల కోసం లక్ష రూపాయలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ పాత పద్మ, కేడీసీసీ జిల్లా సభ్యులు ముప్పాల రామచందర్‌రావు, సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ ఆడెపు మల్లేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ ఆడెపు సునీత, జిల్లా రైతు బందు సమితి సభ్యులు కొలుముల రమణ, మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్, మాజీ మండల అధ్యక్షులు ముక్క వెంకటేష్ యాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ రాజేశం, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శీలం రమేష్, పార్టీ మండల ఉప అధ్యక్షులు గంగాధర్, శ్రీనివాస్‌రావు, సోషల్ మీడియా కన్వీనర్ వినోద్, తిరుపతి, మండల యూత్ ఉపాధ్యక్షుడు సదాల అశోక్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యారంగం ఎంతో అభివృద్ధి

- చొప్పండి ఎమ్మెల్యే సుంకెరవిశంకర్

నవతెలంగాణ- మల్యాల

తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకెరవిశంకర్ అన్నారు. మండలంలోని బలవంతపూర్ గ్రంథాలయం, మానాలలో రూ.10 లక్షలతో గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన, అలాగే రామన్నపేట గ్రామంలో మన ఊరు మన బడిలో తరగతి గదులు, చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్య నందిస్తున్నారన్నారు. ఒక్కో విద్యార్థిపై రూ.1, 25,000 ప్రభుత్వం ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఓవర్సీస్ స్కాలర్షిప్ ద్వారా విదేశాల్లో ఉన్నత చదువులు చదివిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



మంద రవీందర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ- మల్యాల

మండల కేంద్రంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మునుగురి నివాస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి మ్యక రూపేష్, సెక్టార్ ప్రధాన కార్యదర్శి మల్యాల ప్రణయ్ బీఎస్పీ నాయకులు కట్కూరి అరుణ్, పోడేటి శ్రీకాంత్, మారంపల్లి చరణ్,సుమంత్, విగ్నేష్, తరుణ్, రామ్ పాల్గొన్నారు.

నూకపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మల్యాల



ఎన్నికైన సభ్యులు

మండలంలోని నూకపల్లి గ్రామ అభివృద్ధి కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మెన్‌గా మారంపెల్లి వేణు, వైస్ ప్రెసిడెంట్‌గా కోలగాని వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా మ్యాకల సత్తయ్య, కోశాధికారిగా బీనవేని రమేష్, సలహాదారుడిగానారాయణ, ముసుగారి రాజయ్య, జగినిపెల్లి శ్రీనివాస్, పశువేటి రమేష్, మనుపాటి రాజయ్య విజయ్‌లను ఎన్నుకున్నారు. సలహాదారుగా సైదల అంజయ్య ఈత చెట్టు, ముద్దం శ్రీనివాస మిత్ర, తృంగల రమేష్ నులు గోండ సురేష్ ముద్దం రమేష్ వారల సాయికుమార్, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా వీడ్కోలు హంగామా

నవతెలంగాణ-కోరుట్ల



మాట్లాడుతున్న కరస్పాండెంట్ పోతని ప్రవీణ్

కోరుట్ల పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో డీగ్రి పూర్తి చేసుకున్న సీనియర్లకు జూనియర్ విద్యార్థులు వీడ్కోల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదవకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోతని నవీన్, కొత్తరాజు, లక్ష్మిభవాణి పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు చేయాలి

- మర్కజ్ ఇంతేజామీ కమిటీ అధ్యక్షుడు ఖుతుబోద్దిన్ పాషా

నవతెలంగాణ-మెట్ పల్లి



కమిషనర్‌కి వినతిపత్రం ఇస్తున్న మర్కజ్ ఇంతేజామీ కమిటీ సభ్యులు

బక్రీద్ పండుగ సమీపిస్తున్న తరుణంలో మెటపల్లి పరిధిలోని మజీద్‌లు, ఈద్గా, కబ్రాస్తాన్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు మర్కజ్ ఇంతేజామీ కమిటీ సభ్యులు వినతి పత్రం మంగళవారం అందజేశారు. అనంతరం మర్కజ్ ఇంతేజామీ కమిటీ అధ్యక్షుడు ఖుతుబోద్దిన్ పాషా మాట్లాడుతూ... బక్రీద్ పండగా సందర్భంగా మసీదుల్లో నమాజ్, కుర్బానీ మొదలైన కార్యక్రమాలు ఉంటాయాన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మసీదు, కబ్రాస్తాన్ పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఈద్గా అధ్యక్షుడు మొహమ్మద్ షకీల్, మర్కజే ఇంతజామీ కమిటీ మిల్లతే ఇస్లామీయ, ఉపాధ్యక్షులు సమియోద్దీన్, సల్మాన్, సాదక్ హుస్సేన్,ఈద్గా కమిటీ సభ్యులు రహీముద్దీన్, మదర్ ఫెరోస్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పరిశీలన

నవతెలంగాణ-జగిత్యాల



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జగిత్యాల జిల్లా నూకపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను బీజేపీ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి ఇతర నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప, అభివృద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్ల అభ్యర్థుల ఎంపిక జరిగి మూడు నెలలు కావస్తున్నా పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్, అర్బన్ మండలా ఇంచార్జ్ జున్ను రాజేందర్, జగిత్యాల అర్బన్ యువ మోర్చ అధ్యక్షులు బొల్లం అజయ్ కుమార్, రూరల్ మండలం యువ మొర్చాఅధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షుడు నేరెళ్ల మల్లేశం పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ -మెట్‌పల్లి



సన్మానిస్తున్న డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్‌లో గల తెలంగాణ గురుకుల విద్యార్థులు ఇటీవల విడుదలైన నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ర్యాంకు సాధించారు. విద్యార్థులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సంజయ్‌కుమార్ మంగళవారం కళాశాలలో విద్యార్థులను సన్మానించారు. ఇష్టపడి చదువుతే ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చాన్నారు. తెలంగాణ గురుకులాల్లో నాణ్యమైన విద్యాలభిస్తుందా నడానికి ఈ విద్యార్థులు సాధించిన ర్యాంకులే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ రవి, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జగిత్యాల

శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు పట్టణంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల నడుస్తుందని, తోక పేరుతో పాఠశాల నడుపుతున్నా గ్రౌండ్, పార్కింగ్ స్థలం లేకపోయిన డీఈవో పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ పాఠశాల పైన చర్యలు తీసుకోవాలని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విస్తరక్ నల్ల నవీన్, జిల్లా హాస్టల్ కన్వీనర్ శ్రీను, మనోహర్, చరణ్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

మైనార్టి బాలికల కళాశాలలో విద్యాదినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - ధర్మపురి



మెమొంటోలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ మైనారిటీ బాలికల కళాశాలలో ధర్మపురి ప్రిన్సిపాల్ సంజదాబాను ఆధ్వర్యంలో విద్యాదినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. 22-23 విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథిధులుగా ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంఘీ సత్యమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమార్, మైనారిటీ సదర్ అంజద్, కో-ఆప్షన్ మెంబర్ ఆలిం, వార్డు కౌన్సిలర్ ఉమాలక్ష్మి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

నవతెలంగాణ- మల్యాల



విద్యార్థిని సన్మానిస్తున్న సర్పంచ్

దశాబ్ద ఉత్సవాలలో భాగంగా మల్యాల ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం తెలంగాణ విద్యాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ మిట్టపెల్లి సుదర్శన్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. 2022-23 పది పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన వైష్ణవి(9.7)నిఖిలేశ్వర్8.7లను సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి స్రవంతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో డైనింగ్ హాల్, డిజిటల్ తరగతి గదులు ప్రారంభం


డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట : మండలంలోని కొత్తపల్లి గ్రామ హైస్కూల్‌లో కోటి రూపాయలతో నిర్మించిన డైనింగ్ హాల్, డిజిటల్ తరగతి గదులను తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో మంగళవారం విద్య దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్‌రావుతో కలిసి ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, తహసీల్దార్ బండి రాజేశ్వరి, కమిషనర్ బి.శ్రీనివాస్, ఎంఈఓ విడుపు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి, ఉపాధ్యాయుడు పాకాల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇండ్లు, స్థలాలు ఇవ్వాలి

కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


కార్యాలయం వద్ద దరఖాస్తులతో మహిళలు

నవతెలంగాణ - కొత్తపల్లి : కొత్తపల్లి మండల పరిధిలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించి, ఇండ్ల నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలందరికీ తక్షణమే కేటాయించాలని తెలంగాణ ప్రజాసంఘాలు పోరాట వేదిక ఆధ్వర్యంలో కొత్తపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. అనంతరం పెద్ద ఎత్తున ఇండ్ల స్థలాల వ్యక్తిగత దరఖాస్తులు తహసీల్దార్ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి అజయ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా పేదవాడికి సొంత ఇల్లు లేకపోవడం పాలకుల చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవుతుందని అన్నారు. ఉండడానికి ఇల్లు లేక, చేసుకోవడానికి చేతినిండా పనులు దొరక్క అద్దె ఇండ్లలో ఉంటూ అనేక అవమానాలు భరిస్తున్నారని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని అన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అర్హులైన పేద ప్రజలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. పేదలు నివాస ప్రాంతాలలో ప్రచారం నిర్వహించి జులై 1న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికి ప్రభుత్వము నుండి సానుకూల నిర్ణయం రాకపోతే ప్రభుత్వ స్థలాల్లో భూపోరాటం చేస్తామని హెచ్చరించారు. సుంకె దుర్గయ్య, సుంకే శేంకర్, సుంకే రవీందర్, ఎస్.ఎల్లయ్య, పోతూరి గంగరాజవ్వ, మల్యాల రాధిక, దేవి, శేంకరమ్మ భారతి, రమ్యా, ప్రభాకర్, నరేందర్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ శాఖ అధికారి, కరీంనగర్ రూరల్ సిడిపిఓ సబితా కుమారి అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ ఎనిమిదో డివిజన్‌లోని మూడవ అంగన్వాడీలో ప్రతి మంగళవారం నిర్వహించే పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ సల్ల శారదరవీందర్‌తో కలిసి హాజరై మాట్లాడారు. మహిళలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాల గురించి హెల్త్ డైరీ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నాగ శేఖర్, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ సాజీదా, ఏసిడిపిఓ అరవింద, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, బ్లాక్ కోఆర్డినేటర్ రవీందర్, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తుల నిరసన

నవతెలంగాణ - రామడుగు : మండల కేంద్రంలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించేందుకు మంగళవారం వస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంలేదని గ్రామస్తులు నిరసన తెలిపేందుకు సిద్ధం అయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేదా అని ప్రశ్నించారు. వచ్చేది వర్షాకాలం, ప్రమాదాలకు గురికాకముందే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేపట్టాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో బ్రిడ్జి సమస్యను పరిష్కరించకపోతె మండలంలో తిరుగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బొమ్మరవేణి తిరుపతి, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, పంజాల శ్రీనివాస్, అనపురం వెంకటేష్, బత్తిని విజయ్, ఎడవెల్లి రామ్‌లక్ష్మణ్, కర్ణ శీను, బోడ్ల శ్రీధర్, ఉత్తమ్ కార్తీక్, రాజేశ్, శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీలను నిలిపివేయడం పట్ల హర్షం

నవతెలంగాణ - జమ్మికుంట : ఇసుక క్వారీలను జిల్లా కలెక్టర్ నిలిపివేయడం పట్ల జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా న్యాయస్థానాలలో దోబూచులాడుతున్న కరీంనగర్ ఇసుక తవ్వకాల వ్యవహారం ఒక కొలిక్కి వచ్చిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ వీణవంక, జమ్మికుంట మండలాల పరిధిలో మానేరు నదిలో కొనసాగుతున్న ఇసుక క్వారీలను రద్దు చేశారన్నారు. వీణవంక మండలంలోని కొండపాక, మల్లారెడ్డిపల్లి, చల్లూరు క్వారీలను చేరుకొని ఇసుక లారీలను నిలిపి వేశారని తెలిపారు.

'ఉత్సవాల పేరిట ప్రజా ధనం వృథా'


దిష్టిదహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - ఇల్లంతకుంట : తెలంగాణ ఉత్సవాల పేరిట ప్రభుత్వం ప్రజాధనం వృథా చేస్తుందని బీజేపీ దళిత మోర్చా జిల్లా కార్యదర్శి మామిడి హరీష్ అన్నారు. బస్‌స్టాండ్ ఆవరణలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, శ్రావణ్, మల్లేశం, రాజు, సంపత్, కిషన్, ప్రసన్న, గంగాధర్, శేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలలో ప్రోటోకాల్ వివాదం

ఫ్లెక్సీ తొలగించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ - ఇల్లంతకుంట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఫ్లెక్సీలో స్థానిక ప్రజా ప్రతినిధులు యంయల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్ ఫొటోలు పెట్టకపోవడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు యంపిడివో మీర్జాను మంగళవారం నిలదీశారు. విద్యా దినోత్సవం సందర్భంగా పాఠశాల, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రోటోకాల్ పాటించలేదని ఫ్లెక్సీలను చించి వేశారు. కార్యాలయం ముందు నిరసన తెలిపారు. డిపివో కు సమస్య గురించి తెలియాజేస్తే ఇంకోసారి తప్పు జరగకుండా చూస్తామని హామీ ఇవ్వడముతో నాయకులు శాంతించారు. నాయకులు వినయ్, వెంకన్న, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



నవతెలంగాణ - ఇల్లంతకుంట : మండలంలోని వల్లంపట్ల గ్రామ శివారులో ఉన్న తన వ్యవసాయ బావిలో దూకి ఎర్ర లత (24) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లంపట్ల పెంటల నారాయణకు చెందిన కూతురు లతను కరీంనగర్ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన రామక్రిష్ణకు ఇచ్చి 2007లో వివాహం చేశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లత వైద్య చేయించుకోవడానికి పుట్టింటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయములో తమ వ్యవసాయ బావిలోనే సోమవారం అర్ధరాత్రి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. మృతురాలికి ఒక కుమారుడు సాహాస్ ఉన్నాడు. తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మనసున్న ముఖ్యమంత్రి కేసీఆర్..

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు
మంత్రి కేటీఆర్
సిరిసిల్లలో వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ


వాహనాలతో వికలాంగులు


మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ - సిరిసిల్ల

తెలంగాణ ప్రజలు మెచ్చిన నాయకుడు, మనసున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన వికలాంగులకు ఉచిత సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ దూరదృష్టి ఉన్న వ్యక్తి కనుకనే అన్ని వర్గాల పేద నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. భారతదేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులకు ప్రస్తుతం 3016 రూపాయల పింఛన్ ఇస్తున్నామని దాన్ని త్వరలోనే 4016 రూపాయలకు పెంచుతున్నామని అన్నారు. రాష్ట్రంలో వికలాంగుల కోసం తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యోగ అవకాశాలను మూడు శాతం నుండి నాలుగు శాతానికి పెంచినట్టు చెప్పారు. కరోనా కష్టకాలం వచ్చినా కూడా తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ సంక్షేమ పథకాలను ఆపలేదని ప్రజలకు ప్రభుత్వం అండగా నిలబడిందని గుర్తు చేశారు. అందుకే కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రిని, పనిచేసే ప్రభుత్వాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకోవాలి అన్నారు.

వాలీబాల్ అకాడమీ ప్రారంభించిన మంత్రి..

సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్ మినీ స్టేడియంలో వాలీబాల్ అకాడమీని మంత్రి కేటీఆర్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు.

సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్రావు, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ కమిషనర్ శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, రాష్ట్ర టెక్స్ టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్య ప్రసాద్, ఆర్డీఓ టి.శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇండ్లు వెంటనే ఇవ్వాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం అశోక్


తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు, ప్రజలు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించి, ఇండ్ల నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలందరికీ తక్షణమే కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం అశోక్ అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రజాసంఘాలు పోరాట వేదిక ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున ఇండ్ల స్థలాల వ్యక్తిగత దరఖాస్తులు తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకంలో సాయం రూ.5లక్షలకు పెంచి అర్హులైన పేదలందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. జులై 1న కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాములు, గేర రాజకుమారి, బండ సురేష్, జక్కుల రమేష్ యాదవ్, దండిగారి సతీష్, బిజిగిరి శ్రీకాంత్, కన్నం సదానందం పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేస్తాం

జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య


మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్ శంకరయ్య

నవతెలంగాణ - ముస్తాబాద్ : మేజర్ గ్రామపంచాయతీ ముస్తాబాద్ మండల కేంద్రంలో రూ.51లక్షలతో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య తెలిపారు. ఆయన మంగళవారం గ్రామపంచాయతీలో రూ.లక్షా 50వేలతో ఏర్పాటు చేసిన పౌర పట్టణ మందిరం మినీ గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేరళ రాష్ట్రం అభివృద్ధి చెందిందంటే ఆ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసిస్తారన్నారు. మన రాష్ట్రంలో కూడా విద్యా అనేది పెరగాలని ప్రతి ఒక్కరు చదువుకోవాలన్నారు. ముస్తాబాదులో గ్రంథాలయంలో ఏర్పాటు చేయడం కోసం గ్రామపంచాయతీ వారు నాలుగు గుంటల స్థలం ఇచ్చారని అందులో బ్రహ్మాండంగా రూ.51 లక్షలతో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వ అనుమతుల కోసం పంపించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శరత్‌రావు, జడ్పిటిసి నరసయ్య, విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచి సుమతికృష్ణమూర్తి, ఎంపీడీవో రమాదేవి, కార్యదర్శి రాజు, మండల కో ఆప్షన్ షాదుల్ పాప, ఉపసర్పంచ్ రవీందర్ గౌడ్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిష్మతి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో "ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగంలోని ఉద్యోగ అవకాశాలపై సదస్సు"



నవతెలంగాణ - తిమ్మాపూర్ : జ్యోతిష్మతి పూర్వ విద్యార్థి, ప్రస్తుతం సింగపూర్‌లోని అవనాడే ఏషియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రస్తుతం ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై ఆయన చర్చించారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సబ్జెక్టు ఎప్పటికీ బలమైన సబ్జెక్ట్ అని వన్నె తగ్గదని ఈ రంగంలో అనేక కంపెనీలలో ఉద్యోగ అవకాశాలతో పాటుగా ప్రభుత్వ రంగాలలో కూడా ఉద్యోగాలు దొరుకుతున్నాయని ఎలక్ట్రికల్ రంగంలోని వ్యక్తులు నావలే సాఫ్ట్వేర్ రంగంలో కూడా దూసుకుపోవచ్చునని చెప్పారు. కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, డీన్ .వైశాలి మాట్లాడుతూ.. అధునాతనమైన టెక్నాలజీని నేర్చుకుంటూ ఉద్యోగ అవకాశాలు సాధించే దిశగా విద్యార్థులు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి డాక్టర్ గడ్డం శ్రీధర్, డాక్టర్ మణికండన్, సీనియర్ అధ్యాపకులు టి.ప్రవీణ్ కుమార్, ఎస్.గోపాల్‌రెడ్డి, విశ్వ ప్రకాష్ బాబు, సిహెచ్.సజన్‌రావు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరిస్తాం

ఎంపిపి వుట్కూరి వెంకటరమణ రెడ్డి

నవతెలంగాణ - ఇల్లంతకుంట : మండల వీవోఏల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎంపిపి వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు మంగళవారం వీవోఏలతో ఎంపిపి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజుల పాటు సమ్మె చేసి తిరిగి విధుల్లో చేరుతున్నట్లు లేఖను ఎంపిపికి అందజేశారు. ఈ మేరకు వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని ఎపిఎం వాణీశ్రీని ఆదేశించారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

నవతెలంగాణ - ఇల్లంతకుంట : అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు అన్నారు. మంగళవారం మాట్లాడుతూ మంత్రుల పర్యటన కోసం అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించడం విడ్డూరంగా ఉందన్నారు. మండల కన్వీనర్ కూనబోయిన ప్రవీణ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సైనిక్ పాఠశాల విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ - చొప్పదండి : రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గురుకుల సైనిక్ పాఠశాల ఏడుగురు విద్యార్థులు ఎంపిక అయినట్లుగా పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.లచ్చయ్య మంగళవారం తెలిపారు. పదోతరగతికి విద్యార్థి ఎల్.రామ్ చరణ్ రజత పతకం, ఎల్.దీక్షిత్ కాంస్య పతకం, కే.విజయ్ కుమార్ కాంస్య, జి.దుర్గాప్రసాద్ ఫెయిర్ ప్లే అవార్డు, జే.రోషన్, ఆర్.సవరూప్, కే.హెంఅంరాజ్, కోచ్ ఎం.శ్రీకాంత్‌ను సైనిక పాఠశాల డైరెక్టర్ రవికుమార్, ప్రిన్సిపాల్ సిహెచ్ లచ్చయ్య, పిడిపి బాల సుందర్‌రావు, అధ్యాపకులు అభినందించారు. వారిలో రామ్ చరణ్, సవరూప్ రాష్ట్రస్థాయి క్యాంప్‌నకు ఎంపిక చేశారు.

కళాశాల విద్యార్థులకు మెమొంటోలు

నవతెలంగాణ- చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు అందజేసి శాలువాలతో మంగళవారం ప్రిన్సిపాల్ శరత్ బాబు సన్మానించారు. మంగళవారం విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ - ఇల్లంతకుంట : మండలంలోని గుడెపుపల్లె గ్రామానికి చెందిన మల్లేషంకు రూ.29వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎంపీపీ వెంకట రమణారెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్ల మల్లారెడ్డి, ఎంపిటిసి పాశం ముత్యంరెడ్డి, ఎలుక లక్ష్మీస్వామి పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

నవతెలంగాణ - కొనరావుపేట : కొనరావుపేట మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఏటీడీఓ రవిశంకర్ మాట్లాడుతూ అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చదివించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గీతాంజలి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆడంబరాల మీదున్న శ్రద్ధ అన్నదాతలపై లేదు

యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ మునిగేల రాజు


బిక్షాటన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : ఆడంబరాలపైన ఉన్న శ్రద్ద తెలంగాణ ప్రభుత్వానికి అన్నదాతలపై లేదని యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ మునిగల రాజు ఆరోపించారు. రైతుల వద్ద నుండి ప్రభుత్వానికి కొనుగోలు చేసిన వరి ధాన్యం పంటకు ఇంకా డబ్బులు రాలేదని తంగళ్ళపల్లి మండల కేంద్రంలో మంగళవారం అన్నదాతల కోసం బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రైతులపై మాత్రం ఇంత చిన్నచూపెందుకని మండిపడ్డారు. వడ్లు అమ్మిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. 24గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోతే కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో తీవ్ర ఆందోళనలు చేస్తామాని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ళ భరత్, అరెపల్లి బాలు, ఎడ్ల తిరుపతి, చిలుక శ్రీనివాస్, యోగి, సలీం, ఉమాశంకర్, విజయ్, సూర్య, విక్కి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్ఐసి కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట ఎల్ఐసి కార్యాలయంలో బుధవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత కంటి పరీక్షా శిబిరం, ఫ్రీ ఐ క్యాంప్ శరత్ మ్యాక్సీవిజన్ హాస్పిటల్ హనుమకొండ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని జమ్మికుంట బ్రాంచి మేనేజర్ జెఎస్ విక్టర్ హుమానియల్ తెలిపారు. ఏజెంట్‌లు అందరూ మీ పాలసీదారులని, కుటుంబ సభ్యులను తీసుకువచ్చి ఉచిత కంటి పరీక్షలు చేయించాలని సూచించారు.

ప్రపంచాన్ని జయించే శక్తి విద్యకు మాత్రమే

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - రామడుగు : ప్రపంచాన్ని జయించే శక్తి విద్యకు మాత్రమే ఉందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా రామడుగు మండల కేంద్రంలో గ్రంథాలయ సంస్థ నూతన భవనాన్ని, వెలిచాల గ్రామంలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. జ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాల పాత్ర చాలా ఉన్నతమైందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అమలవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాల కోసం మన ఊరు మనబడి ద్వారా అనేక వసతులను కల్పిస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువనాయకుడు, సింగిల్విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు, కొక్కెరకుంట సింగిల్విండో వొంటెల మురళీకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, సర్పంచులు వీర్ల సరోజనప్రభాకర్‌రావు, పంజాల ప్రమీలజగన్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు గంట్ల జితెందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి కాదు..ఇష్టపడి చదవాలి

చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్


అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - గంగాధర : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ సూచించారు. గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు-మనబడి పథకం కింద నిర్మించిన అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ విద్యా వ్యవస్థను ఎంతో ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ప్రస్తుతం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం విద్య కొనసాగుతుందని, ప్రతి విద్యార్థి చదువులో ఉన్నతంగా ఎదగడానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ మడ్లపల్లి గంగాధర్, కురిక్యాల, గంగాధర సింగిల్‌విండో చైర్మన్‌లు వెలిచాల తిర్మల్‌రావు, దూలం బాలగౌడ్, కొండగట్టు అలయ ధర్మకర్త పుల్కం నర్సయ్య, వెంకటాయపల్లి సర్పంచ్ మేఘరాజ్, విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు సామంతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి సిగ్గుచేటు

రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఖండన

నవతెలంగాణ - సిరిసిల్ల : కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఎబివిపి గూండాలు దాడి చేయడం సిగ్గుచేటని, ఆ దాడిని ప్రతి విద్యార్థి సంఘం ఖండించాలని ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ కోరింది. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు విద్యాసంస్థ అనుమతి లేకుండా యూనిఫామ్, బుక్స్ అమ్ముతుంటే ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై ఏబీవీపీ వారు యాజమాన్యానికి మద్దతుగా నిలిచి దాడి చేయడం, కర్రలతో, బైక్ "కీ"లతో దాడి చేసి గాయపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్, ఉపాధ్యక్షులు రాకేష్, మనోజ్, కళ్యాణ్, నాయకులు పాల్గొన్నారు.

ఎంత చదివినా తరగనిది విద్య

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరు శంకరయ్య
- తంగళ్ళపల్లి మండల కేంద్రంలో గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్, ఎంపీపీ, సర్పంచ్

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

ఎంత చదివినా తరగనిది విద్య, ఎవరు దోచుకోని సంపద చదువని అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు గ్రంథాలయంలో మనకు కావలసిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటాయని ఆ పుస్తకాల ద్వారా ఎంతో విలువైన అంశాలు లభిస్తాయన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థిని విద్యార్థులు ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. గ్రంథాలయానికి మరమ్మతుల కోసం రూ.లక్షా 50వేలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగల మానస, సర్పంచ్ అంకారపు అనిత, ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, ఎంపిడిఓ లచ్చాలు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్


పుస్తకాలను అందిస్తున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

నవతెలంగాణ-కరీంనగర్ : యువత విద్యా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత విద్యారంగంలో గణనీయమైన ప్రగతి సాధించిందని, యువత స్వయంకృషితో, నిబద్ధతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని, ఎస్ఆర్ఆర్ కళాశాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..ఎస్ఆర్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థిగా కళాశాలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం తరపున కళాశాల వసతి గృహాలు, ఫర్నీచర్ నూతన గదుల నిర్మాణానికి తగిన ఆర్థిక వనరుల్ని ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ అధ్యక్షత వహిస్తూ జిల్లా డిగ్రీ కళాశాలలో పెరిగిన ప్రవేశాలు, కోర్సులు, ప్రగతిశీల మార్పులను ఉదహరించారు. అంతకుముందు కళాశాలలో జాతీయ జెండా ఆవిష్కరించారు. 200 మంది ఎన్‌సీసీ కెడేట్లు కలెక్టర్‌కి గౌరవ వందనాన్ని, ఘన స్వాగతం పలికారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ వేషధారణ, పాటల పోటీలు, నిత్య పోటీలు, తెలంగాణ వంటల పోటీల విజేతలకు, పూర్వ విద్యార్థుల సంఘం తరపున డాక్టర్ కే.సురేందర్ రెడ్డి ద్వారా బహుమతులు పుస్తకాల్ని అందించారు. ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణను, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.హిమబిందు, డాక్టర్ భిక్షపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా ప్రభుత్వ పాఠశాలలు

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



నవ తెలంగాణ-పెద్దపల్లి: సకల హంగులతో సర్వాంగ సుందరంగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి.. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పిస్తూ ప్రైవేటుకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ, మన ఊరు మనబడి కార్యక్రమం కింద 12 రకాల మౌళిక వసతులు కల్పిస్తున్నామని, వీటికి అదనంగా విద్యార్థులలో పుస్తకాలు చదివే అలవాటు పెంచే దిశగా రీడింగ్ రూమ్ లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, ఎంపీపీ బండారి స్రవంతి, ఎంపీటీసీ నిర్మల, సర్పంచ్ మల్లేశం, ఎంపీడీఓ రాజు, ఎంఈఓ. సురేందర్, ఎంపీఓ సుదర్శన్, పంచాయతీ రాజ్ డీఈ. శంకరయ్య, ఏఈ పి. మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మంథని మండల అధ్యక్షులుగా వీరబోయిన రాజేందర్


రాజేందర్

నవతెలంగాణ-మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన వీరబోయిన రాజేందర్‌ను మంథని మండల అధ్యక్షులుగా నియమించారు. నియామక పత్రాన్ని జాతీయ కార్యవర్గ సభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా రాజేందర్ అందుకున్నారు. తనను మండల అధ్యక్షులుగా నియమించిన జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్‌కు, తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా రాజేందర్ తెలిపారు.

జూన్ 23న జిల్లా కేంద్రాల్లో 'అనాథల అరిగోస' దీక్షలు



మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ జిల్లా ఇంచార్జి మంథని సామ్యేల్

నవతెలంగాణ-మంథని: సామాజిక ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో అనాథ హక్కుల పోరాట వేదిక, ఎమ్మెస్పీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జూన్ 23న జరిగే దీక్షలకు ప్రజలు ప్రజాస్వామిక వాదులు, అనాద ఆశ్రమాల నిర్వాహకులు అండగా నిలవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇంచార్జి మంథని సామ్యేల్ పిలుపునిచ్చారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనాథ పిల్లల కన్నీళ్లు తుడవడానికి, ప్రభుత్వం నుండి రావాల్సిన సదుపాయాలను అందించడం కోసం జరుగుతున్న ఈ ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెస్పీ జిల్లా ఇంచార్జి సామ్యెల్ మాదిగ, అనాథ హక్కుల పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనెటి రాజు, అనాథ హక్కుల పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయిని అనిల్, మంథని మండల కన్వీనర్ మంథని ప్రమోద్, మంథని చందు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు మంథని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో దేవాలయాలను సందర్శించిన శ్రీ శృంగేరి శివగంగా పీఠాధీశ్వరులు

నవతెలంగాణ-మంథని: అనంత విభూషకులు శ్రీ దక్షిణామ్నయ శృంగేరి శివగంగ శారదా పీఠాధిపతులు శ్రీ పురుషోత్తమ భారతి స్వామి మంగళవారం మంథని పట్టణంలోని ప్రముఖ దేవాలయాలు సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి స్వాగతం పలికారు. ఉదయం 5 గంటలకు గోదావరి నదిలో స్నానమాచరించిన అనంతరం శ్రీ గౌతమేశ్వర స్వామికి అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ సురాబాండీశ్వర స్వామి వారిని దర్శించుకుని శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, మంథని పట్టణ ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

సామాజిక సమస్యలను రూపుమాపడంలో అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలి

పొత్కపల్లి ఎస్ఐ రామకృష్ణ

నవతెలంగాణ-ఓదెల: ఓదెల మండలం పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మడక గ్రామంలో ఎస్ఐ రామకృష్ణ మంగళవారం నేర నియంత్రణ పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీ కెమెరాలు, సైబర్ క్రైమ్, షీ టీం, డయల్ 100, నకిలీ విత్తనాలు, గంజాయితో పాటు యువతపై మత్తు పదార్థాల చెడు ప్రభావాన్ని వివరించారు. సామాజిక సమస్యల్ని రూపు మాపడంలో అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదల ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం

మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు

నవ తెలంగాణ- సుల్తానాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేద ప్రజల ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. హథ్ సే హథ్ జోడో యాత్రలో భాగంగా సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలోని కొత్తపేట, అంబేద్కర్ కాలనీ (నారాయణపూర్) గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ-పల్లె పల్లెకు విజ్జన్న అనే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక సతీష్, మినుపాల ప్రకాష్ రావు, మండల రమేష్, అన్నామనేని మాధవ రావు, కొండల్ రావు, సాగర్ రావు, నరేందర్, నగేష్, సురేష్, శంకర్, మొండయ్య, ముకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నవ తెలంగాణ-సుల్తానాబాద్ రూరల్: మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం అనిల్ గౌడ్ శ్యామల, కూతురు కృతిక పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని వేణు గోపాలస్వామి దేవాలయం ఎదురుగా యువ సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా బిక్షాటన చేసే యాచకులకు, అనాధలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేగోళం శంకర్ గౌడ్, గ్రామ అధ్యక్షుడు కోల విజయ్ గౌడ్, చిలుక శ్రీను, మామిడి అజయ్, సాయి, సంతోష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల నూతన భవనం ప్రారంభం


శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దాసరి

నవతెలంగాణ-జూలపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం సందర్భంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామ పంచాయతీ మండల ప్రాథమికోన్నత నూతన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల భూదాత పెంట మల్లయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, రాంగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ మొగురం రమేష్, జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, రఘువీర్ సింగ్, స్పెషల్ ఆఫీసర్ రంగారెడ్డి, ఎంపీడీవో వేణు గోపాలరావు, తహసీల్దార్ అబ్బుబాకర్, ఎంఈఓ కవిత, సర్పంచ్ బంటు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేశోరాంలో రోడ్డు నియమాలపై అవగాహన


రోడ్డు నియమాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: బసంత్ నగర్ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ హైదరాబాద్, ఆర్‌టీఓ పెద్దపల్లి, ట్రాఫిక్ పోలీస్ పెద్దపల్లిల ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఆర్‌టీఓ, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ హైదరాబాద్ డైరెక్టర్ ఘంటా విజయపాల్ రెడ్డి పాల్గొని పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కేశోరాం సిమెంట్ ఉద్యోగులకు రహదారి భద్రత పై అవగాహన కలిగించిన రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్‌ను ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ గోవింద రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ నీలం సంపత్, స్టోర్స్ ఇంచార్జ్ రవికుమార్, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న దాసరి ఉష

నవతెలంగాణ- పెద్దపల్లి టౌన్: ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలోని బైరగోని రాజయ్య కొద్ది రోజుల కింద వృద్ధాప్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబం ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉందని స్థానిక బీఎస్పీ నాయకులు బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి దాసరి ఉషకి తెలియజేయగా వారు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యులు కంపల్లి బాబు, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, ఎలిగేడ్ మండల ఉపాధ్యక్షులు బసంపల్లి నగేష్, బీవీఫ్ అసెంబ్లీ కన్వీనర్ ఇరుగురల్ల సాగర్, బసంపల్లి లచ్చయ్య, చిరంజీవి, శ్రీనివాస్, అనిల్, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలి

జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్


సర్పంచ్ శంకరయ్యతో ఎల్లమ్మ గుడిలో జడ్పీ చైర్మన్

నవతెలంగాణ-రామగిరి: గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ వేడుకున్నారు. రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ జమదగ్ని మహాముని కళ్యాణ మహోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ కులబాంధవులంతా కలిసి ఐక్యతతో కళ్యాణ మహోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గౌడ కులబాంధవులు జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌ను మోకుతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు, గీత కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఆయన ప్రారంభించారు.

బీఆర్ఎస్ పార్టీకి నరేష్ మృతి తీరని లోటు

జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్


బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న జడ్పీ చైర్మన్

నవ తెలంగాణ-రామగిరి: బీఆర్ఎస్ పార్టీకి మాజీ మండల యూత్ అధ్యక్షుడు గారబోయిన నరేష్ మృతి తీరని లోటని పెద్దపల్లి జిల్లా జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో నరేష్ కుటుంబ సభ్యులను కలిసి ఆయన ఓదార్చారు. లద్నాపూర్‌లో ఎంపీటీసీ మేడగోని ఉమాదేవి రాజన్నల మామ మృతి చెందగా ఆయనను పరామర్శించారు. లద్నాపూర్ సర్పంచ్ బడికల విజయ అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో పోలుదాసరి లక్ష్మణ్, కొయ్యడ పర్వయ, కాట రవి గౌడ్ ఇటీవల మరణించగా వారి చిత్రపటాలకు నివాళులు అర్పించి వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మ్యాదరబోయిన శారద కుమార్, రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు, ఉప సర్పంచ్ దుబ్బాక సత్తిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పూదరి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాయలింగు, రామగిరి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంకేసి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతంగా విద్యనభ్యసించాలి


ఏక రూప దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేష్

నవ తెలంగాణ-సుల్తానాబాద్ రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నతంగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గొల్లపల్లి గ్రామ సర్పంచ్ బండారి రమేష్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యా దినోత్సవం సందర్భంగా సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ గట్టు శ్రీనివాస్‌తో కలిసి విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి చదువుకున్న పాఠశాలతో పాటు గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. గ్రామ ఎంపీటీసీ గట్టు శ్రీనివాస్, కార్యదర్శి ప్రమోద్ కుమార్ తో పాటు గ్రామ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

విద్యా, పౌష్టికాహారంపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నవతెలంగాణ-రామగిరి: మంథని జేఎన్టీయూహెచ్ యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రామగిరి మండలం పన్నూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో మంగళవారం విద్యా ప్రాధాన్యత, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం ప్రోగ్రాం అధికారి ఆర్.దుర్గారావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని అంగన్వాడీ పాఠశాలలో పౌష్టికాహారంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో రామగిరి ఎంపీడీవో ఇనుముల రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అవగాహన ర్యాలీని ఎంపీడీవో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చెరుకు శ్రీధర్ రెడ్డి, ఎంపీవో కాటం భాస్కర్, సర్పంచ్ అల్లం పద్మ తిరుపతి, కోఆర్డినేటర్ శ్రీధర్, పీడీ పింగిళి కృష్ణారెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత


వినతిపత్రం అందజేస్తున్న గౌడ కులస్తులు

నవతెలంగాణ-జూలపల్లి: గౌడ కులాన్ని బీసీ కుల వృత్తుల ఆర్థిక సాయం పథకం వర్తించే జాబితాలో చేర్చకపోవడం కేసీఆర్ ప్రభుత్వానికి గౌడ్ కులస్తుల మీద చూపిస్తున్న సవతితల్లి ప్రేమకు నిదర్శనమని యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు అమరగాని ప్రదీప్ కుమార్ గౌడ్, గౌడ సంఘం నేత తీగల అశోక్ గౌడ్ అన్నారు. మంగళవారం జూలపల్లి మండల కేంద్రంలో గౌడ ప్రతినిధులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరచి గౌడలను బీసీలకు కేటాయించే లక్ష రూపాయల పథకంలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుండు నరేష్ గౌడ్, గడ్డమీది మహేష్ గౌడ్, అమరగని నరేష్ గౌడ్, బత్తిని జంపయ్య గౌడ్, మల్యాపురం నర్సయ్య గౌడ్, గుండు సాగర్ గౌడ్, రంగు సతీష్ గౌడ్, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన కలవేన.లక్ష్మికి 15వేల రూపాయల, జి.చిన్నమల్లయ్యకు 16వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, మంగళవారం సర్పంచ్ మేడగోని సతీష్ అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు నీలం పాపయ్య, నాయకులు గాదే స్వామి, చిలివేరి రామస్వామి, చిలివేరి భూమయ్య, ఆలిశెట్టి రాంబాబు, కడవెన శ్రీనివాస్, దుండే రాజయ్య తదితరులున్నారు.

జేఎన్టీయూలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు


సర్టిఫికెట్లతో విద్యార్థులు

నవ తెలంగాణ-రామగిరి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జేఎన్టీయూ హైద్రాబాద్ ఆదేశాల మేరకు మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చెరుకు శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వ్యాసరచన, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, మైనింగ్ మోడల్స్ తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యా దినోత్సవంపై విద్యార్థులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఇఇఇ విభాగ అధిపతి ఆర్.దుర్గారావ్, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, టీచింగ్, నాన్‌టీచింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి



స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమంలో సింగరేణి అధికారులు

నవతెలంగాణ-రామగిరి: మన పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అందరూ స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగం కావాలని ఆర్జీ-3, ఏపీఏ ఇంచార్జి పర్యావరణ అధికారి బి.వి. సత్యనారాయణ అన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఈనెల 16 నుండి 30వ తారీఖు వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పన్నూరు గ్రామ ప్రయాణ ప్రాంగణం (వాల్ ఆఫ్ కైండ్‌నెస్) వద్ద చెత్తను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎంలు ఎం.రవీందర్ రెడ్డి, కె.మారుతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, సివిల్ సూపర్‌వైజర్ యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమత రెడ్డి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్

నవతెలంగాణ- పెద్దపల్లి టౌన్: పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ నుండి వెంకటేశ్వర స్వామి గుడి వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమత రెడ్డి, కమిషనర్ మట్ల శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గం సహకారంతో పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలు, ముఖ్య కూడళ్లలో లైటింగ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ సతీష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

గుడికి మైక్ సెట్ వితరణ


గుడి కమిటీ సభ్యులకు మైక్ సెట్ అందిస్తున్న సదయ్య గౌడ్

నవతెలంగాణ- పెద్దపల్లి టౌన్: పెద్దపల్లి మండలం ముత్తారం-ధర్మాబాద్ గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి గుడికి బీజేపీ నాయకులు ఏగోలపు సదయ్య గౌడ్ మంగళవారం మైక్ సెట్ అందజేశారు. అడగగానే స్పందించి మైక్ సెట్ ఇచ్చినందుకు ఎల్లమ్మ తల్లి గుడి కమిటీ సభ్యులు ఏగోలపు సదయ్య గౌడ్‌ని శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తీగల లక్ష్మీ రాజాం గౌడ్, బాలసాని జంపయ్య గౌడ్, తీగల శ్రీనివాస్ గౌడ్, నల్లగొండ మనోజ్ గౌడ్, సుమన్ గౌడ్, రఘు గౌడ్, నాగపూరి సతీష్ గౌడ్, బాలసాని సుధీర్ గౌడ్, పులి శ్రీనాథ్ గౌడ్ పాల్గొన్నారు.

ట్రినిటీలో ఘనంగా ఎడ్యుకేషన్ డే



విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న ప్రిన్సిపల్, సింగిల్ విండో చైర్మన్ దాసరి చంద్రారెడ్డి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవంలో భాగంగా మంగళవారం ట్రినిటీ పాఠశాలలో ఎడ్యుకేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అప్పన్న పేట సింగిల్ విండో చైర్మెన్ దాసరి చంద్రారెడ్డి హజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆడప బాపురెడ్డి మాట్లాడుతూ, ట్రినిటీ విద్యాసంస్థలు రాష్ట్రస్థాయిలో మెరుగైన విద్యను అందిస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులను గోల్డ్ మెడల్, మెమెంటోలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూదేవి, రమణ, నర్సయ్య, గోపు, రామస్వామి, సమ్మయ్య, శ్రీవీవాస్, రాజేశ్, సతీష్ కుమార్, గీత, మంగ, అనూష, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో యువత పాల్గొనాలి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో నియోజకవర్గంలోని యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయరమణరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్.కె గార్డెన్స్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ, క్విజ్ పోటీలు యువతలో మేదోశక్తిని పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. ఈ కాంపిటీషన్‌లో 16-35 సంవత్సరాల వయసు గల యువతీ యువకులందరూ తప్పకుండా పాల్గొనాలని అన్నారు. పోటీలు జూలై 2న ఉంటాయని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోపగాని సారయ్య గౌడ్, కడార్ల శ్రీనివాస్,మినుపాల ప్రకాష్ రావు,భూతగడ్డ సంపత్, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్,సయ్యద్ మసర్త్, సాయిరి మహేందర్, ఆరే సంతోష్,తూముల సుభాష్, తాండూరి శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. 42వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడప దశరథం, కీర్తి నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన గుడ్ మార్నింగ్ గోదావరి ఖని కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు ఎండి.ముస్తాఫా, గాదం విజయానంద్, రాజిరెడ్డి, చుక్కల శ్రీనివాస్, విజయ్, గణేష్, శ్రీకాంత్, కార్తీక్ తదితరులున్నారు.

సునీల్ రెడ్డికి ఘన సన్మానం


బీజేపీ రాష్ట్ర నాయకులను సన్మానిస్తున్న ముత్తారం ఇంచార్జి క్రాంతి కుమార్

నవతెలంగాణ-మంథని: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఇటీవల ఎన్నికైన చంద్రుపట్ల సునీల్ రెడ్డిని బీజేపీ (మంథని) ముత్తారం ఇంచార్జి పోతరవేని క్రాంతి కుమార్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

గౌడ్‌గా మారిన జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని: సాధారణంగా గౌడ కులస్తులు మాత్రమే తాటి, ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తారు. కానీ ఇక్కడ మాత్రం జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ గౌడ్‌గా మారి తాటి చెట్టు ఎక్కి కల్లు గీశారు. మంథని డివిజన్ పరిధిలోని చందనాపూర్ గ్రామంలో మంగళవారం జరిగిన రేణుకా ఎల్లమ్మ తల్లి జమదగ్ని మహాముని కళ్యాణ మహోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ కులబాంధవులు మోకుతాడుతో ఆయన్ను సన్మానించారు. అనంతరం ఆయన తాటి చెట్టు ఎక్కి కల్లు గీశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయన వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హోంమంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న సర్పంచ్


హోం మినిస్టర్ మహమ్మద్ అలీ నుండి ప్రశంసాపత్రం అందుకుంటున్న సర్పంచ్ నరేష్ రావు

నవతెలంగాణ-మంథని: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం దుబ్బపల్లి గ్రామంలో టి.కె.హెచ్.హెల్ది విజయవంతంగా అమలు చేసినందుకు గాను తెలంగాణ హోంమంత్రి చేతుల మీదుగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన హరితోత్సవ కార్యక్రమంలో ప్రశంసాపత్రం అందుకున్నారు సర్పంచ్ సర్పంచ్ ఎర్రవెల్లి నరేష్ రావు, కార్యదర్శి నవీన్. ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం పట్ల మంథని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

లక్ష రూపాయల ఆర్థిక సహాయం గడువును పెంచాలి

ఓబీసీ నాయకులు



మాట్లాడుతున్న ఓబీసీ నాయకులు

నవతెలంగాణ-మంథని: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక సహాయం ఆన్‌లైన్ గడువును పెంచాలని ఓబీసీ నాయకులు ఐలి.శ్రీనివాస్, బండారి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఆర్థిక సహాయానికి కావలసిన సర్టిఫికెట్లు నిర్ణీత కాలంలో ఇవ్వకపోవడంతో లబ్దిదారులకు దరఖాస్తులు చేసుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. అనంతరం మంథని ఆర్డీవో కార్యాలయంలోని అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో ఒడ్నాల శ్రీనివాస్, కిషన్ జి, అజీమ్ ఖాన్, రామ్ రాజశేఖర్, మంతిని సురేష్, రవితేజ గౌడ్, నాగుల రాజయ్య, ఉదరి శంకర్, రమేష్, మంతని శ్రీనివాస్, అక్కపాక సదయ్య, పొనుగంటి రమేష్ పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన



ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో టాస్క్ సహకారంతో అన్‌స్కూల్ (ఎడుటెక్) మల్టీ నేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కళాశాలలో 2022, 2023 బిటెక్, ఎంబీఏ పాసైన సుమారు 300 వంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్ డిస్కషన్, మౌలిక పరీక్ష,హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రక్రియలో ఎంపికైన 16 మంది విద్యార్థులు వెంటనే తమ కంపెనీలో ఉద్యోగంలో చేరవచ్చు అని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్, ఏవో సురేష్, టాస్క్ రీజనల్ కోఆర్డినేటర్ గంగప్రసాద్, కంపెనీ ప్రతినిధులు మౌర్య, విభాగాధిపతులు డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ నటరాజన్, డాక్టర్ కౌశల్య, స్వాతి, ప్రభాకర్, మేనేజ్మెంట్ రిప్రజెంటేటివ్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగి జావా పంపిణీ

నవతెలంగాణ-గోదావరిఖని: విద్యా దినోత్సవ సందర్భంగా, ఎండాకాలం దృష్ట్యా విద్యార్థులకు ప్రభుత్వం తరపున రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్ సంజయ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్, పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ చేతులమీదుగా విద్యార్థులకు మంగళవారం రాగి జావా పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీ రూమ్‌కు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ అన్నపూర్ణ, టీచర్ జ్యోతి శ్రీ, విద్యా కమిటీ సభ్యులు, మిట్టపల్లి సంధ్య ఈర్లా వెంకట స్వామి, ఆయా కండె రాజేశ్వరి తదితరులున్నారు.



రామ్‌చరణ్, ఉపాసన

నవచిత్రం

ఈ పాప ఎంతో అపురూపం - చిరంజీవి

మెగాస్టార్ ఇంట సంబరాలు మిన్నంటాయి. రామ్‌చరణ్, ఉపాసన దంపతులు తల్లిదండ్రులయ్యారు. జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ఉపాసన ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు అపోలో అస్పత్రి ప్రకటన విడుదల చేసింది. మనవరాలు పుట్టటంపై చిరంజీవి మీడియాతో స్పందిస్తూ, 'మంగళవారం ఉదయం 1 గంట 49 నిమిషాలకు రామ్‌చరణ్, ఉపాసనలకు పాప పుట్టింది. ఇంటిల్లి పాది చాలా సంతోషంగా ఉన్నాం. ఈ పాప ఎంతో అపురూపం. మమ్మల్ని గ్రాండ్ పేరెంట్స్ చేసింది. పాప పుట్టిన ఘడియలు పెద్దలు చాలా మంచివని అంటున్నారు. ఎందుకంటే ఈ మధ్య కాలంలో చరణ్ ఎదుగుదల, తను సాధించిన విజయాలు, అలాగే వరుణ్ తేజ్ ఎంగేజ్‌మెంట్. ఇలా మా ఇంట్లో అన్నీ శుభకార్యాలే జరగటం చూస్తుంటే ఈ బిడ్డ ప్రభావం మాపై ఉంది. నా కుటుంబం ఆంజనేయ స్వామినే నమ్ముకున్నాం. ఆయనకు సంబంధించిన మంగళవారం రోజున ఆడ బిడ్డను ప్రసాదించటం అనేది అపురూపంగా భావిస్తున్నాం' అని ఆనందం వ్యక్తం చేశారు.

లవ్ యు రామ్ రిలీజ్‌కి రెడీ

డైరెక్టర్ కె దశరథ్ నిర్మాతగా వ్యవహరిస్తూ కథ అందించిన చిత్రం 'లవ్ యు రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకుడిగానే కాకుండా నిర్మాత కూడా. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ,'ఈనెల 30న ఈ సినిమాని ప్రపంచ వ్యాప్తంగా మైత్రీ మూవీస్ వారి ద్వారా విడుదల చేస్తున్నాం. ఇదొక మంచి ఎంటర్‌టైనర్. మ్యూజిక్, కథ అన్నీ బావుంటాయి' అని చెప్పారు.'అందరికీ నచ్చేలా సినిమా వచ్చింది. ఇప్పటి వరకూ చూసిన వారందరూ హ్యాపీగా ఫీలయ్యారు. పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి' అని దర్శకుడు, నిర్మాత డివై చౌదరి అన్నారు.



రోహిత్ బెహల్, అపర్ణ జనార్ధనన్

హిట్ ఖాయం

శివ కందుకూరి హీరోగా నూతన దర్శకుడు భరత్ పెదగాని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మను చరిత్ర'. ప్రొద్దుటూరు టాకీస్ బ్యానర్ పై ఎన్ శ్రీనివాస రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో మేఘా ఆకాష్, ప్రియా వడ్లమాని, ప్రగతి శ్రీవాత్సవ్ కథానాయికలు. ఈనెల 23న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హీరో కార్తికేయ మాట్లాడుతూ, 'ట్రైలర్, టీజర్ చాలా హార్డ్ హిట్టింగ్‌గా ఉన్నాయి. 'ఆర్ఎక్స్ 100' విడుదలకు ముందు ఎలాంటి వైబ్స్ ఉండేవో ఇప్పుడు అలానే అనిపిస్తుంది. సినిమా ఖచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుంది' అని అన్నారు. 'ప్రతి యాక్టర్‌కి ఒక బకెట్ లిస్టు ఉంటుంది. ఫైట్స్, డ్యాన్స్ చేయాలి, మాస్ పాటలు ఉండాలని అనుకుంటాం. ఇవన్నీ నాకు 'మను చరిత్ర' కంప్లీట్ చేసింది' అని హీరో శివ కందుకూరి చెప్పారు. దర్శకుడు భరత్ పెదగాని మాట్లాడుతూ,'ఇది చాలా స్వచ్ఛమైన కథ' అని తెలిపారు.



శివ కందుకూరి, మేఘా ఆకాష్

సీనియర్ ఎడిటర్ వెంకటేశ్వరావు కన్నుమూత

ప్రముఖ సీనియర్ ఎడిటర్ పి.వెంకటేశ్వరరావు (72) కన్నుమూశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు చెన్నైలో ఆయన తుది శ్వాస విడిచారు. ఎన్టీఆర్ నటించిన 'యుగంధర్'తో పాటు 'మొండి మొగుడు పెంకి పెళ్ళాం', 'కెప్టెన్ కృష్ణ', 'ఇద్దరు అసాధ్యులు', 'ముద్దాయి' వంటి ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు ఎడిటర్‌గా పని చేశారు.
తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 200కు పైగా సినిమాలకు పని చేసి సౌత్ ఇండియాలో ఎడిటర్‌గా తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. ఎన్నో గొప్ప చిత్రాల ఘన విజయాల్లో కీలక పాత్ర పోషించిన వెంకటేశ్వరరావు మృతి పట్ల తెలుగు ఫిల్మ్ ఎడిటర్స్ అసోసియేషన్ తరఫున అధ్యక్షులు కోటగిరి వెంకటేశ్వర రావు (చంటి), ప్రధాన కార్యదర్శి మార్తాండ్ కె వెంకటేష్ సంతాపాన్ని ప్రకటించారు. వెంకటేశ్వరరావు అంతిమ సంస్కారాలు గురువారం చెన్నైలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



పి.వెంకటేశ్వరరావు

మన జోడీ వరల్డ్ నం.3

- సాత్విక్, చిరాగ్ కెరీర్ అత్యుత్తమ ర్యాంక్
- ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్ విడుదల



న్యూఢిల్లీ : ప్రపంచ బ్యాడ్మింటన్‌లో కొంతకాలంగా దిగజారుతున్న భారత షట్లర్ల ర్యాంకింగ్స్ పరంపరకు ఈ వారంతో బ్రేక్ పడింది!. ఇటు మెన్స్ డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ కెరీర్ అత్యుత్తమ ర్యాంక్ సాధించగా.. అటు మెన్స్ సింగిల్స్‌లో మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్, యువ షట్లర్ లక్ష్యసేన్ సైతం చెప్పుకోదగిన పురోగతి సాధించారు. ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్ పురుషుల డబుల్స్ చాంపియన్స్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్ ద్వయం ఆకర్షణీయమైన ప్రైజ్‌మనీ, విలువైన పాయింట్లతో పాటు వరల్డ్ నం.3 ర్యాంక్‌ను సైతం సొంతం చేసుకున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సాత్విక్, చిరాగ్ జంట మూడు స్థానాలు ఎగబాకి మూడో స్థానం దక్కించుకుంది.

పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ మూడు స్థానాలు మెరుగయ్యాడు. యువ సంచలనం లక్ష్యసేన్ సైతం రెండు స్థానాలు ఎగబాకాడు. కిదాంబి శ్రీకాంత్ వరల్డ్ నం.19, లక్ష్యసేన్ వరల్డ్ నం.18 ర్యాంక్‌లతో తిరిగి టాప్-20లోకి అడుగుపెట్టారు. ఇండోనేషియా ఓపెన్ సెమీఫైనల్లో విక్టర్ అక్సెల్సెన్‌కు టైటిల్ పోరు బెర్త్ చేజార్చుకున్న హెచ్.ఎస్ ప్రణయ్ ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నాడు. మెన్స్ సింగిల్స్‌లో భారత్ నుంచి ఉత్తమ ర్యాంక్ ఆటగాడు ప్రణయే. వర్థమాన షట్లర్ ప్రియాన్షు రజావత్ నాలుగు స్థానాలు మెరుగై 30వ స్థానంలో నిలిచాడు. టాప్-30లోకి ప్రవేశించటంతో రజావత్‌కు ఇదే ప్రథమం. మహిళల సింగిల్స్‌లో టాప్ షట్లర్ పి.వి సింధు వరల్డ్ నం.12గా నిలువగా.. వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ ఓ స్థానం మెరుగై 31వ స్థానంతో సరిపెట్టుకుంది. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి 16వ, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి, రోహన్ కపూర్‌లు 33వ స్థానాల్లో నిలిచారు.

తైపీలో మెరుస్తారా? : ఇక తైపీ ఓపెన్‌లో నేటి నుంచి ప్రధాన టోర్నీ పోటీలు ఆరంభం కానున్నాయి. మెన్స్ సింగిల్స్‌లో మూడో సీడ్ హెచ్.ఎస్ ప్రణయ్ నేడు తొలి మ్యాచ్‌లో క్వాలిఫయర్ చైనీస్ తైపీ ఆటగాడితో తలపడనున్నాడు. టాప్ సీడ్ ఉపసంహరణతో నేరుగా ప్రధాన డ్రాలోకి వచ్చిన పారుపల్లి కశ్యప్ నేడు జర్మనీ క్వాలిఫయర్‌తో ఆడనున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి, రోహన్ కపూర్‌లతో మరో భారత జోడీ నవనీత్, ప్రియ జంట ఢీకొట్టనుంది. మిథున్ మంజునాథ్, ఆకర్షి కశ్యప్, కిరణ్ జార్జ్, శంకర్ ముతుస్వామి, సతీశ్ కుమార్‌లు సైతం నేడు తొలి రౌండ్లో పోటీకి సై అంటున్నారు.



టాలన్స్ 30-30 ఐరన్‌మెన్

- ఫలితం తేలని అగ్ర జట్ల సమరం
- ఆఖరు క్షణంలో టాలన్స్ టై గోల్
- ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ 2023





జైపూర్ : ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్ఎల్) అగ్ర జట్ల నడుమ ముఖాముఖి పోరు 'టై'గా ముగిసింది. ఆఖరు క్షణం వరకు అత్యంత ఉత్కంఠగా సాగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ 30-30తో సమవుజ్జీలుగా నిలిచాయి. ఆట 59వ నిమిషంలో 30-28తో ఐరన్‌మెన్ రెండు గోల్స్ ఆధిక్యంలో నిలిచి గెలుపుపై ధీమాగా కనిపించినా.. ఆఖరు 60 సెకండ్లలో తెలుగు టాలన్స్ అసమాన ప్రదర్శన చేసింది. రాహుల్ నైన్ మెరుపు గోల్‌తో ఆశలు సజీవంగా నిలుపగా.. ఆఖరు క్షణంలో కైలాష్ పటేల్ కండ్లుచెదిరే గోల్‌తో అదరగొట్టాడు. 30-30తో ఐరన్‌మెన్‌తో టాలన్స్ మ్యాచ్ టైగా ముగిసింది. టైగా ముగిసిన మ్యాచ్‌లో తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ చెరో పాయింట్ పంచుకున్నాయి. 9 మ్యాచుల్లో ఏడు విజయాలు, ఓటమి, టైతో 15 పాయింట్లతో ఐరన్‌మెన్... 9 మ్యాచుల్లో ఆరు విజయాలు, రెండు ఓటములు, ఓ టైతో తెలుగు టాలన్స్ పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ ఇప్పటికే సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. తెలుగు టాలన్స్ గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌లో నేడు గార్విట్ గుజరాత్‌తో పోటీపడనుంది.

ఆఖర్లో అద్భుతం :

ఆఖరు వరకు పోరాడే తత్వమే తెలుగు టాలన్స్‌ను ఐరన్‌మెన్‌తో మ్యాచ్‌లో నిలబెట్టింది. నిజానికి మ్యాచ్‌లో ఏ దశలోనూ తెలుగు టాలన్స్ ఆధిక్యంలో నిలువలేదు. ఆట ఆరంభమైన తొలి 3 నిమిషాల్లో 2-1తో ముందంజ వేసిన తెలుగు టాలన్స్.. ఆ తర్వాత ఐరన్‌మెన్ ఒత్తిడికి తలొగ్గింది. గోల్ కీపర్ రాహుల్ ఈ మ్యాచ్‌లో అంచనాలను అందుకోలేదు. దీంతో ప్రథమార్థం 30 నిమిషాల ఆట ముగిసేసరికి తెలుగు టాలన్స్ 11-16తో ఐదు గోల్స్ వెనుకంజలో నిలిచింది. ద్వితీయార్థంలోనూ తెలుగు టాలన్స్ వెనుకంజలోనే కొనసాగినా.. గోల్ వేటలో రెచ్చిపోయింది. అయినా 13-17, 14-18, 16-21, 20-24తో ఐరన్‌మెన్ ముందంజ వేసింది. చివరి మూడు నిమిషాల ఆటలో తెలుగు టాలన్స్ తడాఖా చూపించింది. 27-29, 28-29తో ఆధిక్యం తగ్గించిన తెలుగు టాలన్స్ చివరి నిమిషంలో రెండు మెరుపు గోల్స్ కొట్టి లెక్క సరి చేసింది. విరామం అనంతరం సెకండ్ హాఫ్‌లో తెలుగు టాలన్స్ 19 గోల్స్ నమోదు చేయగా.. ఐరన్‌మెన్ 14 గోల్స్ మాత్రమే సాధించింది. తెలుగు టాలన్స్ స్టార్ ఆటగాడు దేవిందర్ సింగ్ భుల్లార్ ఏడు గోల్స్ కొట్టగా.. కైలాష్ పటేల్ ఐదు గోల్స్ సాధించాడు. మోహిత్ కుమార్, నసీబ్ సింగ్, రాహుల్‌లు మూడేసి గోల్స్‌తో రాణించారు.

కుకీ గిరిజనుల రక్షణపై అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కృతి



న్యూఢిల్లీ : మణిపూర్ జాతుల మధ్య ఘర్షణలు, హింస అనేది పూర్తిగా శాంతి భద్రతల అంశమని సుప్రీం కోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. సైన్యం లేదా కేంద్ర భద్రతా బలగాలను మోహరించాల్సిందిగా కోర్టులను కోరబోరని ఆశిస్తున్నామని పేర్కొంది. కుకీ గిరిజనులకు సైనిక రక్షణ కల్పించాలంటూ మణిపూర్ గిరిజన వేదిక ఢిల్లీ (ఎంటిఎఫ్‌డి) దాఖలు చేసిన పిటిషన్‌ను ఒకటి రెండు రోజుల్లో అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్‌ఎం.ఎం.సుందరేశ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ తిరస్కరించింది. వేసవి శలవులు ముగిసిన తర్వాత జులై 3వ తేదీన విచారిస్తామని తెలిపింది. ఈ దశలో ఏదో ఒక రకంగా కోర్టు జోక్యం చేసుకుంటే రాష్ట్రంలో పరిస్థితి మరింత పెచ్చరిల్లుతుందని బెంచ్ పేర్కొంది. మే 3వ తేదీ నుండి కుకీ, మెయితీ కమ్యూనిటీల మధ్య ఘర్షణలు తలెత్తాయి. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పే విషయంలో ప్రభుత్వాన్ని నమ్మాలని, ప్రభుత్వం ఆ దిశగానే పనిచేస్తోందని బెంచ్ మౌఖిక వ్యాఖ్యలు చేసింది. మణిపూర్, కేంద్ర ప్రభుత్వాల తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, భద్రతా బలగాలు క్షేత్ర స్థాయిలో శాయశక్తులా కృషి చేస్తున్నాయని చెప్పారు.

మోడీ గారూ .. మౌనం వీడండి

న్యూఢిల్లీ : ఇంఫాల్‌లోని మహిళలు నిర్వహిస్తున్న 'ఎమా కైథాల్' లేదా 'మదర్స్ మార్కెట్ ' ప్రతినిధులు రాష్ట్రంలో హింసాత్మక పరిస్థితులపై ప్రధాని మౌనం వీడి.. చర్యలు చేపట్టాలంటూ మోడీకి ఓ సందేశాన్ని పంపారు. వీరంతా హిందూ మరియు పంగల్ ముస్లిం వర్గాలకు చెందిన మెయిటీలు. మణిపూర్‌లో హింసను నిరోధించేందుకు, రాష్ట్ర సమగ్రతను కాపాడేందుకు ప్రధాని చర్యలు చేపట్టాలని ఆ సందేశంలో పేర్కొన్నారు. ఓట్ల కోసం బహిరంగ సభలు నిర్వహించేందుకు ప్రధాని సహా ఇతర కేంద్ర మంత్రులు తమ రాష్ట్రానికి వరుస కట్టారని, ప్రస్తుతం హింసాకాండలో ప్రాణాలు కోల్పోతున్న పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

సోమవారం న్యూఢిల్లీ చేరుకున్న ప్రతినిధుల బృందం జంతర్ మంతర్‌లో ఆందోళన చేపట్టింది. మెయిటీ భాషలో అనువాదకుల ద్వారా వారు మీడియాకు అక్కడి పరిస్థితులను వివరించారు. ఆస్తి, నగలు నష్టాన్ని పునరుద్ధరించుకోవచ్చు, కానీ ప్రాణనష్టం అలా కాదని బినోదిని అనే ప్రతినిధి పేర్కొన్నారు. కొండలు, అడవులు తేడా లేకుండా ఆగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో అక్కడి తల్లులు, యువకులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



ప్రధాని మోడీ ముందు తమ ఫిర్యాదులను తెలిపేందుకు ఇక్కడకు వచ్చామని.. రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులను అడ్డుకునేలా ప్రధాని జోక్యం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న హింసాకాండపై ప్రధాని మోడీ స్పందించలేదని, కనీసం రాష్ట్రాన్ని సందర్శించలేదని అన్నారు. ఒకవేళ జాతి ప్రాతిపదికన రాష్ట్రాన్ని విభజించాలని మోడీ ప్రభుత్వం భావిస్తోందా అని వారు అనుమానం వ్యక్తం చేశారు.

హింస ప్రారంభమైన 20 రోజుల తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించారని, కానీ రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మరో ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షా పర్యటన సమయంలోనూ రాష్ట్రంలో హింస నెలకొందని మరో ప్రతినిధి పేర్కొన్నారు. ఈ హింసాకాండలో అధికశాతం మంది యువకులు ప్రాణాలు కోల్పోతున్నారని, తమ పిల్లలకు బదులుగా తల్లులమైన తాము ఇక్కడ ప్రాణ త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నామని మరో ప్రతినిధి తెలిపారు.

మృతులకు రూ.10 లక్షల పరిహారం అందిస్తామని హోం మంత్రి ప్రకటించారని, తాము డబ్బు కోరుకోవడం లేదని, రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు మెరుగైన చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నా మని మరో ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పాలని, హింసాకాండకు కుకీ తిరుగుబాటుదారులను బాధ్యులను చేయాలని, సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ అగ్రిమెంట్, 2008 నుండి ఉపసంహరించుకోవడం వంటి కీలక డిమాండ్లతో మెమొరాండం సమర్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రికి పలు మెమొరాండంలు సమర్పించామని, కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. మణిపూర్‌లో మే 3న మెయిటీలు, కుకీల మధ్య నెలకొన్న ఘర్షణలు ఉద్రిక్తతకు దారితీసిన సంగతి తెలిసిందే. సుమారు 110 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారు.

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ఘనంగా బోనాలు

న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఘనంగా బోనాలు నిర్వహించారు. ఇండియా గేట్ నుంచి తెలంగాణ భవన్ వరకు లాల్ దర్వాజ్ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహించారు. బోనాల వేడుకల్లో ఢిల్లీలోని తెలుగు వారు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడే విధంగా బోనాల వేడుకలు జరిగాయి. డప్పు చప్పులు, నృత్యాలతో కళాకారులు అలరించారు. తెలంగాణ భవన్ కళాకారులకు రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, అధికారులు స్వాగతం పలికారు.

దేశంలో వేడి తీవ్రతపై కేంద్రంలో చలనం

- రాష్ట్రాలకు కేంద్ర బృందాలు
- యూపీలో 64 మంది మృతి, 450 మంది ఆసుపత్రిలో చేరిక

న్యూఢిల్లీ : దేశంలోని అనేక రాష్ట్రాల్లో వేడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో చలనం వచ్చింది. పలు రాష్ట్రాల్లో ఉన్న వేడి తీవ్రతను గుర్తించి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సీనియర్ అధికారులతో కేంద్ర మంత్రి సమీక్ష జరిపారు. వేడి తీవ్రత ఉన్న రాష్ట్రాల్లో పర్యటించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ, ఐఎండీ విభాగానికి చెందిన ఐదుగురు అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. ఈ బృందం తీవ్రంగా వేడి ప్రభావితమైన రాష్ట్రాలను సందర్శిస్తుందని మన్సుఖ్ మాండవియా తెలిపారు. వేడి గాలులు, వాతావరణ పరిస్థితుల యొక్క ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి చర్యలను సూచించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)ను కూడా ఆదేశించినట్టు కేంద్రమంత్రి పేర్కొన్నారు. వేడి తీవ్రత ప్రభావం సాధారణ ప్రజలపై చూపకుండా ఉండేందుకు తగిన సూచనలు, సలహాలు చెప్పాలని ఐసీఎంఆర్‌ను కేంద్రం కోరింది. ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్, జార్ఖండ్, విదర్భ, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కేంద్ర బృందం పర్యటించనున్నది. రానున్న కొన్ని రోజుల పాటు ఈ రాష్ట్రాల్లో అతి తీవ్రమైన వేడిగాలులు ఉంటాయని వాతవారణ శాఖ అంచనా వేసింది. గత కొన్ని రోజులుగా పలు రాష్ట్రాల్లో వేడి గాలులు, వాతావరణ పరిస్థితి కారణంగా మరణాలు నమోదు కావడంతో కేంద్రం చర్యలు మొదలుపెట్టింది. ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. గడిచిన నాలుగు రోజుల్లో దాదాపు 64 మంది వేడి తీవ్రతతో మృతిచెందారు. మరో 450 మంది ఆస్పత్రిలో చేరారు. బీహార్‌లో 44 మంది మృతిచెందారు.

రేపు అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభం

- నిరంతరం నివాళులు
- 3.29ఎకరాల్లో బ్రహ్మాండమైన నిర్మాణం
- 1700టన్నులు స్టీల్ వాడాం
- జర్మనీ నుంచి స్టేయిన్‌లెస్ స్టీల్
- అన్ని హంగులతో ఏర్పాట్లు
- మీడియాతో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'తెలంగాణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులకు ఆగష్టు 15, జూన్ 2వ తేదిన నివాళు లర్పించడం కాదు. గుడిలో పూజలు చేసినట్టుగానే అమరవీరులకు నిరంతరం నివాళులర్పించాలి. అందుకే హుస్సేన్‌సాగర్ తీరాన 3.29 ఎకరాల్లో బ్రహ్మాండమైన కట్టడాన్ని నిర్మించాం. గురువారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అమరవీరుల చిహ్నాని ప్రారంభిస్తాం' అని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సంబంధింత ఏర్పాట్లను సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, సిటీ పోలీసు కమిషనర్ సీవీ.ఆనంద్, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డిలతో కలిసి మంగళవారం మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అమరవీరులకు ప్రతి రోజూ నివాళులర్పించేవిధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రజలు, కుటుంబ సభ్యులతో కలిసి అమరవీరుల చిహ్నాన్ని సందర్శించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. 3.29ఎకరాల స్థలంలో ఆరు అంతస్తుల్లో దీన్ని నిర్మించామని తెలిపారు. లక్ష చదరపు అడుగుల్లో 400కార్ల కోసం పార్కింగ్ సౌకర్యం, గ్రౌండ్ ఫ్లోర్‌లో 30వేల చదరపు అడుగుల్లో ఎగ్జిబిషన్/ ఆర్ట్ గ్యాలరీని నిర్మించామని చెప్పారు. దీనిలో పుస్తక ప్రదర్శలు, చిత్ర ప్రదర్శనలు, తదితర కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. మొదటి అంతస్తులో అమరవీరులకు సంబంధించిన వివరాలు, ఉద్యమ ప్రస్థానం, ఫొటో గ్యాలరీ, 100సీట్లతో థియేటర్ నిర్మించామని తెలిపారు. ఈ థియేటర్‌లో తెలంగాణ ఉద్యమ ప్రస్థానం, రాజకీయ ప్రక్రియలు, తెలంగాణ సాధించిన ప్రగతికి సంబంధించిన 25నిమిషాల వీడియోను సందర్శకులకు చూపించనున్నామని తెలిపారు. మొదటి అంతస్తులో 800సీట్లతో కన్వెన్షన్‌హాల్ ఉంటుందని, దీనిలో సెమినార్లు, బిజినెస్ మీటింగులు, చర్చాగోష్టులు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అవకాశముంద న్నారు. మూడు, నాలుగు అంతస్తుల్లో సందర్శకుల కోసం రెస్టారెంట్, టెర్రస్ రెస్టారెంట్, గ్రాస్‌రూఫ్ రెస్టారెంట్‌లను నిర్మించామని తెలిపారు. అమరవీరుల చిహ్నం చుట్టూ మూడెకరాల్లో కుటుంబసమేతంగా సందర్శించడానికి లాంజ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు.



అమరవీరుల చిహ్నం నిర్మాణానికి 1700టన్నుల స్ట్రక్చరల్ స్టీల్ ఉపయోగించామనీ, జర్మనీకి చెందిన 100టన్నుల స్టెయిన్‌లెస్ స్టీల్ వినియోగించామని తెలిపారు. కరోనా సమయంలో కంపెనీతో ప్రభుత్వానికి సంబంధాలు తెగిపోయాయని, ఆ సమయంలో స్టెయిలెస్‌స్టీల్ తీసుకురావడం కష్టంగా మారిందని చెప్పారు. అయినా జర్మనీ నుంచి స్టెయిన్‌లెస్ స్టీల్ వచ్చాకే నిర్మాణం చేపట్టాలంటూ సీఎం కేసీఆర్ చెప్పారని, ఖర్చుకు వెనకాడకుండా పనులు చేయాలని సూచించినట్టు తెలిపారు.

ప్రపంచంలో ఇలాంటి కట్టడాలు మూడు ఉన్నాయని, ఒకటి అమెరికాలో చికాగోబీమ్, రెండోది దుబాయి మ్యూజియం, మూడోది తెలంగాణ అమరవీరుల చిహ్నమని, వీటిలో ఇదే పెద్దదని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఢిల్లీలోని బాపుఘాట్‌ను విదేశీయులు ఎలా సందర్శిస్తారో అదే తరహాలో హైదరాబాద్‌కు వచ్చే విదేశీ పర్యాటకులు కూడా అమరవీరుల చిహ్నాన్ని సందర్శించుకునేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ అమరవీరులకు ఏమాత్రం గౌరవం తగ్గకుండా ఆర్అండ్‌బీ అధికారులు, కేపీసీ కన్‌స్ట్రక్షన్స్, అర్కిటెక్చర్, శిల్పి, ఇంజినీర్లు ఎంతో కష్టపడి పనిచేశారని తెలిపారు.

రేపు అమరవీరుల స్మృతివనం వద్ద డ్రోన్లతో లేజర్ షో

- మంత్రి శ్రీనివాసగౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 22న అమరవీరుల స్మృతివనం, తెలంగాణ రాష్ట్ర సచివాలయం వద్ద 750 డ్రోన్లతో లేజర్ మెగా డ్రోన్లషో నిర్వహిస్తున్నట్లు మంత్రి శ్రీనివాసగౌడ్ వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లో మెగా షోలో ప్రదర్శించే డ్రోన్లను టూరిజం కార్పొరేషన్ ఎండీ మనోహర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం వివిధ జిల్లాలైన వరంగల్, సిద్దిపేట, నిజామాబాద్, ఖమ్మం జిల్లాలలో లేజర్ షోలను ప్రదర్శిస్తామని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తన్మయి, భాస్కర్ రెడ్డి, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

మమతా సర్కార్‌కి సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల వేళ మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పంచాయితీ ఎన్నికలకు కేంద్ర భద్రతా బలగాలను మోహరించాలంటూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టును మంగళవారం ఆశ్రయించాయి. ఈ పిటిషన్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. ఈ సందర్భంగా ఆయా పిటిషన్లను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. బెంగాల్‌లో ఒకేరోజులో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నందున స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, సజావుగా ఎన్నికలు జరగాలన్నదే హైకోర్టు ఆదేశాల వాస్తవ ఉద్దేశమని స్పష్టం చేసింది.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.

బిజినెస్

ఈ ఏడాది 28 బిలియన్ల ఫార్మా ఎగుమతులు

- గతేడాది ఆశించిన స్థాయిలో నమోదు కాలేదు
- ఫార్మాగ్జిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ్ వెల్లడి
- వచ్చే నెలలో అంతర్జాతీయ ఎగ్జిబిషన్



హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 28 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.30 లక్షల కోట్లు) విలువ చేసే ఔషధ ఉత్పత్తుల ఎగుమతులు అంచనా వేస్తున్నామని ఫార్మాగ్జిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ్ భాస్కర్ అన్నారు. 2022-23లో 3.25 శాతం వృద్ధితో 25.39 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయన్నారు. తొలిసారి 25 బిలియన్ల మార్క్‌ను చేరుకున్నప్పటికీ.. పరిశ్రమ ఇంతకంటే ఎక్కువ 27 బిలియన్లుగా అంచనా వేసిందన్నారు. ముఖ్యంగా ఆఫ్రికా, సిఐఎస్ దేశాలకు చేసే ఎగుమతుల్లో ప్రతికూల వృద్ధి చోటు చేసుకుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఫార్మాగ్జిల్ రెగ్యులేటరీ ఎఫైర్స్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న చుండుతో కలిసి ఉదయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడారు. గతేడాది దేశంలో ప్రస్తుతం 50 బిలియన్ డాలర్ల విలువ చేసే ఔషధ ఉత్పత్తులు నమోదయ్యాయన్నారు. ఇందులో సగం ఎగుమతులు జరగడం విశేషమన్నారు. ఈ రంగం ఎగుమతుల్లో తెలుగు రాష్ట్రాల వాటా అత్యంత కీలకంగా ఉందన్నారు. గ్లోబల్ ఎగుమతుల్లో విలువ పరంగా భారత్ 11వ స్థానంలో, సంఖ్య పరంగా 3వ స్థానంలో ఉందన్నారు. గ్లోబల్ టాప్ 25 ఫార్మా కంపెనీల్లో ఎనిమిది భారత్‌కు చెందినవేనని అన్నారు. ఔషధ ముడి సరుకుల ఎగుమతుల్లో చైనా అగ్రస్థానంలో ఉందన్నారు. ఆ దేశం దాదాపుగా 1.73 ట్రిలియన్ డాలర్ల ఫార్మా ఎగుమతులు చేస్తోందన్నారు. ఇతర దేశాలతో పోల్చితే ఇది చాలా ఎక్కువన్నారు. మొత్తం ప్రపంచానికి కావాల్సిన ఎపిఐ, ఇంటర్మీడియట్ ముడి సరుకుల ఎగుమతుల్లో చైనా ఏకంగా 65-70 శాతం వాటా కలిగి ఉందన్నారు. దిగుమతులను తగ్గించుకోవడానికి భారత్ పిఎల్ఐ స్కీమ్ కింద ప్రోత్సాహకాలు ఇస్తున్నప్పటికీ పెద్ద పురోగతి కనబడటం లేదన్నారు. స్వల్పంగా మాత్రమే దిగుమతులు తగ్గాయన్నారు.

మూడు రోజులు ఫార్మా ఎగ్జిబిషన్

జులై 5,7,8 తేదిల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ ఫార్మా ఎగ్జిబిషన్ (ఐపెక్స్) 9వ ఎడిషన్ వివరాలను రవి ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. దీనికి 120 దేశాల దిగుమతి, ఎగుమతి దారులు సహా 3500 మంది ఎగ్జిబిటర్లు, 4500 మంది విదేశీ ప్రతినిధులు, లక్షకు పైగా సందర్శకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ ప్రదర్శన వ్యాపారాన్ని పెంచుకునేందుకు ప్రపంచ దేశాల సాంకేతికతను పంచుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పిస్తుందన్నారు.

ఐఐటీ బాంబేకు రూ.315 కోట్ల విరాళం

- ప్రకటించిన నందన్ నిలేకని

ముంబయి: దిగ్గజ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు, ఆధార్ ఆవిష్కర్త నందన్ నిలేకని తాను చదువుకున్న ఐఐటీ బాంబేకు ఏకంగా రూ.315 కోట్ల భారీ విరాళం అందించారు. ఈ నిధులను ఆ విద్యా సంస్థలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు, ఇంజినీరింగ్, టెక్నాలజీలో పరిశోధనలు వంటి వాటికి వినియోగించాలని ఆయన సూచించారు. 1973లో ఐఐటీ బాంబేలో ఆయన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డిగ్రీ పూర్తి చేశారు. ఇది వరకు కూడా నిలేకని ఆ సంస్థకు రూ.85 కోట్ల విరాళం ఇచ్చారు. ఐఐటి బాంబేతో 50 ఏళ్ల అనుబంధం కలిగి ఉన్నారు.

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ఎస్‌బీఐ ఎండీ జానకిరామన్

న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూ టీ గవర్నర్‌గా ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ స్వామి నాథన్ జానకిరామన్ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఈ హోదాలో కొనసాగుతారని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మహేశ్ కుమార్ జైన్ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. దీంతో ఆ స్థానంలో జానకిరామన్‌ను నియ మించారు. ప్రస్తుతం ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ ఉండగా.. డిప్యూటీ డైరెక్టర్లుగా మైఖెల్ పాత్ర, ఎం రాజేశ్వరరావు, టి రవిశంకర్ ఉన్నారు.

మలబార్ గోల్డ్ ప్రచారకర్తగా జూనియర్ ఎన్‌టీఆర్



హైదరాబాద్ : ప్రముఖ ఆభరణాల రిటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా మరోసారి ప్రముఖ నటుడు జూనియర్ ఎన్‌టీఆర్ నియమితులయ్యారు. తమ ప్రచారకర్తగా ఎన్‌టీఆర్‌కు తిరిగి స్వాగతం పలుకుతున్నామని ఆ సంస్థ పేర్కొంది. ఆయన నియామకం సంస్థ 30వ వార్షికోత్సవ మెరుపులు రెట్టింపు చేయడానికి దోహదం చేయనుందని మలబార్ గోల్డ్ ఆశాభావం వ్యక్తం చేసింది.

గ్రేట్ ప్లేస్ టు వర్క్‌లో సింక్రోనీకి ఐదో స్థానం

హైదరాబాద్ : పని చేసేందుకు అత్యుత్తమ కంపెనీలో ఒక్కటీగా తమ సంస్థ నిలిచిందని ప్రీమియర్ కన్స్యూమర్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ వెల్లడించింది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా జాబితాలో తమ సంస్థ ఐదో స్థానం దక్కించుకుందని పేర్కొంది. తమ ఉద్యోగులకు సమ్మిళిత, మద్దతుతో కూడిన, స్ఫూర్తిదాయక వాతావరణం అభివృద్ధి చేయడంలో సింక్రోనీ రాజీలేని నిబద్ధతకు ఇది ప్రతీకగా నిలుస్తుందని తెలిపింది. తమ సంస్థలో 50 శాతం మహిళా ప్రాతినిధ్యం కలిగి ఉండటంతో పాటుగా 100 మంది వికలాంగులు ఉన్నారని సింక్రోని ఇండియా బిజినెస్ లీడర్ ఆండీ పొన్నేరీ పేర్కొన్నారు.

పండోర మాయాజాలాన్ని తెలుగు ప్రేక్షకులకు చేరువ చేయాలని కోరుకున్నా : శ్రీనివాస్ అవసరాల

నవతెలంగాణ-హైదరాబాద్ : పండోర మాయాజాలాన్ని తెలుగు ప్రేక్షకు లు ఆస్వాదించేందుకు, వారి హృదయాలకు చేరువ కావాలని తాను కోరుకున్నానని అవతార్: ది వే ఆఫ్ వాటర్ తెలుగు వెర్షన్ కి డైలాగ్స్ రాసిన శ్రీనివాస్ అవసరాల తెలిపారు. జేమ్స్ కామెరూన్ సృష్టించిన అవతార్: ది వే ఆఫ్ వాటర్లో తెలుగు వెర్షన్కు సంభాషణలు రాయడంలో భాగమైనందుకు చాలా ఉత్సాహంగా ఉన్నానని రచయిత శ్రీనివాస్ అవసరాల పేర్కొన్నారు. ఈ చిత్రంలో సల్లి కుటుంబం చుట్టూ కథను అల్లుకుని ఉంటుంది. వారు తమ వంశాన్ని మరియు పండోరాను తమ గ్రహం మీదకు ఆహ్వానం లేకుండా వచ్చిన అతిథుల నుంచి రక్షించుకునేందుకు కఠినమైన ప్రయత్నాన్ని చేస్తూ ఉంటారన్నారు. ఈ చిత్రం ఇప్పుడు డిస్నీప్లస్ హాట్స్టార్లో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషలలో ప్రసారం అవుతోందన్నారు. శ్రీనివాస్ తన ఉత్సాహాన్ని పంచుకుంటూ అవతార్: ది వే ఆఫ్ వాటర్ వంటి గ్రాండ్ ప్రాజెక్ట్ లో భాగం కావడం నిజంగా చాలా ఆనందంగా ఉందన్నారు. జేమ్స్ కామెరూన్ చిత్రాన్ని వివరించడం ఒక సవాలుగా భావిస్తూ ఒక ఉత్తేజకరమైన ప్రయాణాన్ని చేశానన్నారు. తాను మొదటి చిత్రాన్ని ఇష్టపడ్డాను, అవతార్: ది వే ఆఫ్ వాటర్ కోసం వేచి చూశానన్నారు. హృదయాలను హత్తుకునే శక్తి కథకు ఉందన్నారు.

ప్రొడక్టివిటీ- పవర్ హౌస్ షవోమి ప్యాడ్ 6ని పరిచయం చేసిన షవోమి

నవతెలంగాణ-హైదరాబాద్ : దేశంలోని అత్యంత విశ్వసనీయ స్మార్ట్ ఫోన్, ఏఐఓటి బ్రాండ్ షవోమి ఇండియా తన అత్యంత ప్రతిష్టాత్మకమైన టాబ్లెట్ - షవోమిప్యాడ్ 6ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది వినియోగదారులకు ప్రొడ క్టివిటీ, సృజనాత్మకత, వినోదాల కచ్చితమైన సమ్మేళనాన్ని అందిస్తోంది. ఈసంద ర్భంగా షవోమీ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనూజ్ శర్మ మాట్లాడుతూ... గత ఏడాది, షవోమిప్యాడ్ తో తాము టాబ్లెట్ వర్గం డైనమిక్స్ను పూర్తిగా మార్చా మన్నారు. దీని విడుదల ఆండ్రాయిడ్ టాబ్లెట్లపై వినియోగదారుల ఆసక్తిని పెంచేం దుకు, మెరుగైన పోటీని నెలకొల్పిందన్నారు. చివరకు ఆండ్రాయిడ్ టాబ్లెట్ విభాగ ంలో చాలాకాలం పాటు కనిపించని కొన్ని అవసరమైన ఆవిష్కరణలను తీసుకువచ్చి ందన్నారు. షవోమి ప్యాడ్ 6ఈ విభాగంలో మరింత ముఖ్యమైన పురోగతిని సూచిస్తూ, ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న వినియోగదారు కోసం రూపొం దించారన్నారు. టాబ్లెట్ సృజనాత్మకత, వినియోగాన్ని మెరుగు పరచడమే కాకుండా, ఎటువంటి లోపం లేకుండా కనెక్టివిటీ, అత్యుత్తమ పనితీరుతో పూర్తి యూజర్ అనుభ వాన్ని అందజేస్తుందనే తమ వాగ్దానాన్ని నిలుపుతుందన్నారు. వినియోగదారులను ప్రతిదీ మెరుగ్గా చేసేందుకు వీలు కల్పిస్తుందని తెలిపారు.

కేసుల దర్యాప్తుల్లో న్యాయపరమైన చిక్కులపై దృష్టి పెట్టండి

డీఎస్పీలు, అదనపు ఎస్పీలకు న్యాయ నిపుణుల సూచనలు

- డీజీపీ కార్యాలయం నుంచి అధికారులకు ఆన్‌లైన్ వర్క్‌షాప్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

క్లిష్టమైన కేసుల దర్యాప్తుల్లో న్యాయపరంగా చిక్కులు ఎదురుకాకుండా తగిన శ్రద్ధ వహించాలని పోలీసు అధికారులకు న్యాయ నిపుణులు సూచించారు. డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు మంగళవారం డీజీపీ కార్యాలయం నుంచి ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వర్క్‌షాప్‌లో పోలీసు లీగల్‌సెల్ విభాగానికి చెందిన న్యాయ నిపుణులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్, సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్, డీజీపీ, ఉన్నతాధికారులకు న్యాయ సలహాదారుడైన ప్రముఖ న్యాయవాది రాములుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయ నిపుణులు మాట్లాడుతూ.. కేసు నమోదు చేయటంలో వహిస్తున్న శ్రద్ధ తదుపరి దర్యాప్తుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లోపిస్తున్నదనీ, కొందరు దర్యాప్తు అధికారుల్లో ఉన్న నిర్లక్ష్యం కూడా దీనికి కారణమవుతున్నదని వారు అన్నారు. నేరాలు చేసిన వారికి కోర్టులలో శిక్షలు పడితేనే నిందితులలో భయాన్ని పాదుగొలపగలమనీ, అదే సమయంలో బాధితులకు న్యాయం కూడా జరుగుతుందని డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. కేసులు కోర్టులలో వీగిపోకుండా ఉండాలంటే దర్యాప్తు ప్రారంభం నుంచి ఆ కేసుకు సంబంధించిన న్యాయ నిపుణులతో తగిన సలహాలు, సూచనలు తీసుకొని ముందుకు సాగితేనే చక్కటి ఫలితాలు లభిస్తాయని ఆయన అన్నారు. నేరాలకు పాల్పడ్డ నిందితులు ఆ కేసు నుంచి తప్పించుకోవటానికి చట్టపరమైన లొసుగులను ఎప్పుడూ అన్వేషిస్తూనే ఉంటారనీ, వారికి ఆ అవకాశాన్ని ఇవ్వకుండా శాస్త్ర, సాంకేతిక పరంగా తగిన ఆధారాలను సేకరించాల్సినవసరం ఉన్నదనీ, అప్పుడే నేరస్థుల జిత్తులు పారకుండా ఉంటాయని పోలీసు లీగల్ సెల్ విభాగానికి చెందిన అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కొన్ని క్లిష్టమైన కేసులకు సంబంధించి వివిధ ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు, అదనపు ఎస్పీలు అడిగిన పలు ప్రశ్నలకు న్యాయ నిపుణులు సమాధానాలిచ్చారు.

ఈ నెల 24, 25 తేదీల్లో ఏఎఫ్ పీఐ సదస్సు

ఫ్యామిలీ ఫిజీషియన్ల ఆవశ్యకతపై చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్‌పీఐ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభాగాలు తొలిసారిగా సంయుక్తంగా సదస్సు నిర్వహించనున్నాయి. ఈ మేరకు ఏఎఫ్‌పీఐకాన్-2023 తెలంగాణ, ఏపీ ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్మయి లింగుట్ల మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లోని గ్రీన్‌పార్క్ హోటల్లో ఈ సదస్సును నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఫ్యామిలీ మెడిసిన్ ప్రస్తుత పరిస్థితిపై జరిగే చర్చా వేదికలో డాక్టర్ పి.రఘురాం (కిమ్స్ హాస్పిటల్), డాక్టర్ సంతోష్ కుమార్ (ఎన్ఎంసీ సభ్యులు), ఏఎఫ్‌పీఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ రమణ్ కుమార్ పాల్గొంటారు. ప్రాథమిక స్థాయిలో ఆరోగ్య సేవలను మెరుగ్గా అందించేందుకు, ప్రజలకు ఆస్పత్రుల భారాన్ని తగ్గించడంలో ఫ్యామిలీ మెడిసిన్ స్పెషాలిటీ పోషించగలిగిన కీలకపాత్రపై సదస్సు అవగాహన కల్పించనున్నది.

ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏఎఫ్ పీఐ తెలంగాణ చాప్టర్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వి.శ్రీనివాస్ అధ్యక్షత వహించనుండగా ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ఏఎఫ్‌పీఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ రమణకుమార్, ఏఎఫ్‌పీఐ తెలంగాణ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ విక్రమ్ చేర్యాల, డాక్టర్ జి.మల్లేశ్వరమ్మ (ఏఎఫ్‌పీఐ, ఆంధ్రప్రదేశ్) గౌరవ అతిథులుగా హాజరు కానున్నారు. సదస్సు మొదటి రోజు హెల్త్ అండ్ వెల్‌నెస్ అసెస్‌మెంట్ ఇన్ క్లినికల్ ప్రాక్టీస్, ఫ్యామిలీ ఫిజీషియన్స్ ఫోరం అండ్ పీజీ అప్‌డేట్స్-బేసిక్స్ అండ్ రీసెంట్ అడ్వాన్సెస్, టేక్ హోం మెసేజెస్, మేనేజ్ మెంట్ గైడ్‌లైన్స్‌తో పాటు మాతా, శిశు ఆరోగ్యంపై ఆరు సెషన్లను నిర్వహించనున్నారు. రెండో రోజు వివిధ అంశాలపై ఐదు సెషన్లు, రెండు వర్క్ షాప్‌లను నిర్వహించనున్నారు.

ఆ పార్టీలపై చర్యలు తీసుకోండి

- ఎలక్షన్ కమిషన్‌కు ఏడీఆర్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థుల నేర చరిత్రను ప్రచురించడంలో విఫలమైన రాజకీయ పార్టీలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విజ్ఞప్తి చేసింది.

ఈ మేరకు ఎలక్షన్ కమిషన్‌కు ఏడీఆర్ లేఖరాసింది. సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో తమ అభ్యర్థుల నేర చరిత్ర, పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి రాజకీయ పార్టీలు వెల్లడించడం తప్పనిసరి అని ఎడిఆర్ తన లేఖలో గుర్తు చేసింది. అలాగే నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయడానికి గల కారణాలను, నేరచరిత్ర లేని ఇతర వ్యక్తులను అభ్యర్థులుగా ఎందుకు ఎంపిక చేయలేకపోయారనే విషయాలను కూడా రాజకీయ పార్టీలు వెల్లడించాల్సి ఉంటుందని ఎడిఆర్ తెలిపింది. తన ఆదేశాలను పాటించనందుకు 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 రాజకీయ పార్టీలకు సుప్రీంకోర్టు జరిమానా విధించిన విషయాన్ని కూడా ఏడీఆర్ గుర్తుచేసింది.

దీని తరువాత ఈ ఏడాదిలో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు, 2022లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, పంజాబ్ ఎన్నికలు, 2021లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతం) అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని ఏడీఆర్ తెలిపింది. ఈ ఎన్నికల్లో నిబంధనలు పాటించని రాజకీయ పార్టీలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

బెంగాలీలకు రాష్ట్రావిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో స్థిరపడ్డ ఎనిమిది లక్షల మంది బెంగాలీలకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ పశ్చిమబెంగాల్ రాష్ట్రావిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వించారు. ఈ కార్యక్రమంలో ఆయా బెంగాలీ అసోసియేషన్ల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాలను కళాకారులు ఆలపించారు. గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో బెంగాలీలు భాగమయ్యారని గుర్తు చేశారు. నిజాం కాలేజీ మొదటి ప్రిన్సిపాల్ అఘోర నాథ్ ఛటోపాధ్యాయ, ఆయన పిల్లలు హరింద్రనాథ్ ఛటోపాధ్యాయ, సరోజినీ నాయుడు తమ గోల్డెన్ త్రిషోల్డ్ ఇంటిని 1974లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వివిధ రంగాల్లో సేవలందించిన బెంగాలీ ప్రముఖులను గుర్తుచేసుకున్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు

బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. యోగా, ధాన్యం, ప్రాణాయామాలు కోవిడ్-19 వల్ల ఏర్పడిన మానసిక, శారీరక ప్రభావాలను అధిగమించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.

రచయిత సల్మాన్ రష్దీకి ప్రతిష్టాత్మక జర్మన్ పురస్కారం

బెర్లిన్: ప్రముఖ రచయిత సల్మాన్ రష్దీ ప్రతిష్టాత్మక జర్మన్ పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్యంలో చేసిన విశేష కృషికి, నిరంతరం ప్రమాదాలు ఎదురవుతున్నా చెక్కుచెదరని ఆయన సంకల్పం, సానుకూల వైఖరికి గాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 22న ఫ్రాంక్ ఫర్ట్‌లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఆయన రచనల్లో కథనాత్మక దృష్టితో పాటు నిరంతర సాహిత్య ఆవిష్కరణ, హాస్యం, మరియు జ్ఞానాన్ని మిళితం చేస్తారని జ్యూరీ తెలిపింది. హింసాత్మకతో కూడిన పాలనాశక్తులు మొత్తం సమాజాన్ని నాశనం చేసే విధానాన్ని వివరించడంతో పాటు వ్యక్తుల ప్రతిఘటనను నాశనం చేయలేరని కూడా వివరిస్తారని పేర్కొంది. గతేడాది ఆగస్టులో న్యూయార్క్‌లో నిర్వహించిన ఓ సాహిత్య వేడుకలో ఆయన దాడికి గురైన సంగతి తెలిసిందే. ఆయన నిరంతరం శారీరక, మానసిక సమస్యలతో పోరాటం చేస్తున్నప్పటికీ .. ఇప్పటికీ రచనలను కొనసాగిస్తున్నారని జ్యూరీ ప్రశంసించింది.

కాశ్మీర్‌లో ఎస్ఐఏ సోదాలు

- సోషల్ మీడియా దుర్వినియోగం పేరుతో...

శ్రీనగర్: సోషల్ మీడియా దుర్వి నియోగానికి సంబంధించిన కేసులో జమ్ముకాశ్మీర్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎస్ఐఏ) మంగళవారం సోదాలు జరిపింది. లోయలోని నాలుగు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. పలు మొబైల్ ఫోన్స్, సిమ్ కార్డులతో పాటు ఇతర డిజిటల్ వస్తువులను సీజ్ చేసినట్టు వివరించారు. వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వేర్పా టువాద, భారత వ్యతిరేక భావాలను ప్రచారం చేయడంలో ప్రమేయం ఉన్న వ్యక్తులు, బృందాలను గుర్తించే లక్ష్యంతో ఈ సోదాలు చేపట్టినట్టు తెలిపారు.

కుప్వారా, అనంతనాగ్, పుల్వామా, శ్రీనగర్ జిల్లాల్లో ఎస్ఐఏ బందాలు సోదాలు జరిపాయని అన్నారు. భారతదేశంపై ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి, ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడానికి సోషల్ మీడియా సంస్థలు తమ విదేశీ సహచరులకు సహకరిస్తున్నాయన్న ఎస్ఐఏ కాశ్మీర్ ఫిర్యాదు మేరకు ఈకేసును నమోదు చేసినట్టు తెలిపింది.

ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లపై సుప్రీం ఆదేశాల అమలుకు తీరిక లేదా?: హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ట్రాన్స్‌జెండర్ లేదా ఎస్సీ కోటాల్లో పిటీషనర్‌కు నీట్ పీజీ సీటు కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ కోరిన కేటగిరీ (గైనకాలజీ)లో సీటు రాకపోతే పిటిషనర్‌కు ఉన్న అర్హతల ప్రకారం మెరిట్‌కు అనుగుణంగా ఏ కేటగిరీలో సీటు వస్తే ఆ సీటు ఇవ్వాలంది. ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ల కల్పన అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కర్నాటకలో మార్గదర్శకాలు జారీ అయ్యాయనీ, అదే విధంగా తెలంగాణలో కూడా చేయాలని చెప్పింది. నీట్ పీజీ కౌన్సిలింగ్ నోటిఫికేషన్‌లో ట్రాన్స్‌జెండర్ల రిజర్వేషన్ల ప్రస్తావన లేదంటూ డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్ దాఖలు చేసిన రిట్‌ను మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రయివేటు వ్యక్తులదే స్థలం

బేగంపేటలో గ్రీన్‌ల్యాండ్ గెస్ట్ హౌస్ వద్ద 3,500 గజాల స్థలం ప్రయివేటు వ్యక్తులదేనని హైకోర్టు తీర్పు చెప్పింది. సర్వే నెంబర్ 214/1లోని స్థలంపై హక్కుల కోసం చంద్ర రేఖ ఇతరులు వేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.మాధవీదేవి తీర్పు చెప్పారు. అది ప్రభుత్వ భూమేనని అధికారులు ఆధారాలు చూపలేదని చెప్పింది.

సీఎస్ అఫిడవిట్ అస్పష్టత

సమాచార ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకాలు ఎప్పటిలోగా చేస్తారో స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వ అధికారులు అఫిడవిట్ దాఖలు చేయడంపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. సీరియస్ పరిశీలనలో ఉందంటూ ఇతర వివరాలు లేకుండా సీఎస్ అఫిడవిట్ దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. గడువు కావాలని మళ్లీ ప్రభుత్వ న్యాయవాది కోరడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. సమాచార కమిషనర్ల నియామకానికి చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తరపు కార్యదర్శి ఎం. పద్మనాభరెడ్డి దాఖలు చేసిన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. జులై 5న జరిగే విచారణలోనైనా స్పష్టంగా చెప్పాలంది. ఆ విచారణకు ఏజీ లేదా అదనపు ఏజీ విచారణకు రావాలంది.

స్టైల్స్‌పై లైఫ్‌స్టైల్ లో 50% వరకు తగ్గింపు ధరలు

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశం లో ఎక్కువ మంది ఇష్టపడే ఫ్యాషన్ డెస్టినేషన్ లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఔత్సాహికులు మరియు ట్రెండ్‌సెట్టర్‌లకు 50% వరకు అద్భుతమైన తగ్గింపుతో వారి ఇష్టమైన స్టైల్స్‌లో మునిగిపోయే అవకాశాన్ని అందిస్తూ, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సేల్ ఈవెంట్‌ను ప్రకటించింది. ప్రముఖ జాతీయ మరియు అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్‌ల నుండి అత్యాధునిక స్టైల్‌ల శ్రేణితో, సాటిలేని ధరలతో ఫ్యాషన్ ప్రేమికులు తమ వార్డ్‌రోబ్‌ను మహోన్నతంగా చేసుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని లైఫ్‌స్టైల్ సేల్ అందిస్తుంది. సరసమైన ధరలకు ఉన్నతమైన ఫ్యాషన్‌ని అందించడానికి లైఫ్‌స్టైల్ యొక్క నిబద్ధత ఫ్యాషన్ ప్రియుల సరసన దీనిని ఒక ప్రియమైన ఎంపికగా చేస్తుంది. లైఫ్‌స్టైల్ సేల్‌లో దుస్తులు, పాదరక్షలు, హ్యాండ్‌బ్యాగ్‌లు, బ్యూటీ ప్రొడక్ట్‌లు, సన్‌గ్లాసెస్, వాచీలు మరియు మరెన్నో విస్తృతమైన ఎంపిక ఉంటుంది, అన్నీ తాజా ట్రెండ్‌లను ప్రదర్శించడానికి మరియు ప్రతి ఫ్యాషన్ అవసరాలను తీర్చడానికి చాలా జాగ్రత్తగా ఎంపిక చేయబడతాయి. క్లాసిక్ డిజైన్‌ల నుండి సమకాలీన స్టైల్‌ల వరకు, ప్రతి ఫ్యాషన్-ఫార్వర్డ్ వ్యక్తికి సరిపోయే రీతిలో ఇవి ఉంటాయి.

సింగరేణితో ఎన్టీపీసీ ఒప్పందం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బొగ్గు సరఫరా కోసం ఎన్టీపీసీ సింగరేణి కాలరీస్‌తో నాలుగు ఒప్పందాలు చేసుకుంది. కర్నాటకలోని కుడిగీ థర్మల్ కేంద్రానికి ఏడాదికి 67.5 లక్షల టన్నులు, మహారాష్ట్ర షోలాపూర్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి 28.2 లక్షల టన్నులు, రామగుండం ప్లాంట్లకు సంబంధించి బొగ్గు సరఫరా కోసం ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాల మేరకు 207 లక్షల టన్నుల బొగ్గును మూడు ప్లాంట్లకు అవసరాన్ని బట్టి సర్దుబాటు చేసేలా ఒప్పందం చేసుకున్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ జే ఆల్విన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఒప్పందలపై ఆ సంస్థ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) కే సూర్యనారాయణ, ఎన్టీపీసీ సౌత్ అండ్ వెస్ట్రన్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేబశిష్ ఛటోపాధ్యాయ సంతకాలు చేశారు. సింగరేణి ఏజీఎం మార్కెటింగ్ ఎస్ రాజశేఖర్‌రావు, డీజీఎం టి శ్రీనివాస్, డీజీఎం కోల్ మూమెంట్ ఎస్ సం జయ్, డీజీఎం మార్కెటింగ్ సురేంద్ర రాజు, అడిషనల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి, ఎన్టీ పీసీ నుండి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్యూయల్ మేనేజ్‌మెంట్ ప్రదీప్ కుమార్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

అసోంలో వరద ఉధృతి

- 10 జిల్లాల్లో ప్రభావం

గౌహతి: అసోంలో వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. మంగళవారం నాటికి 10 జిల్లాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉందని, ఈ జిల్లాల్లో ఇప్పటికీ సుమారు 31 వేల మంది వరదలతో ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. మరోవైపు అస్సాంలో రాబోయే 5 రోజుల్లో భారీ వర్షాలు నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. రెడ్‌ఎలర్ట్ జారీ చేసింది. అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఏఎస్‌డీఎంఏ) విడుదల చేసిన డైలీ ఫ్లడ్ రిపోర్టు ప్రకారం చిరాగ్, దర్రాంగ్, ధేమాజి, ధుబ్రి, దిబ్రూగఢ్, కొక్రాఝార్, లఖీంపూర్, నల్బరి, సోనిట్‌పూర్, ఉదల్‌గురి జిల్లాల్లో 30,700 మందికి పైగా ప్రజలు వరదల బారీన పడ్డారు.

అయితే ఏ జిల్లాలోనూ పునరావస కేంద్రాని ఏర్పాటు చేయలేదు. కానీ 25 పంపిణీ కేంద్రాల ద్వారా సహాయక సామాగ్రిని అంద చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం 444 గ్రామాలు ముంపులో ఉన్నాయని, 4,741.23 హెక్టార్లల్లో పంటలు నాశనమయ్యాయని ఎఎస్‌డిఎంఎ తెలిపింది. అలాగే అనేక ప్రాంతాల్లో కోతలు ఏర్పడుతున్నాయని, కొండ చరియలు విరిగి పడుతున్నాయని తెలిపింది. భారీ వర్షాల కారణంగా రోడ్లు, వంతెనలు వంటి మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతున్నాయని వెల్లడించింది. పట్టణ ప్రాంతాలు కూడా వరద ముంపునకు గురవుతున్నా యని తెలిపింది. బ్రహ్మపుత్రా నదితో సహా రాష్ట్రంలో అన్ని నదులు ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయని చెప్పింది.

నేడు సెంథిల్ బాలాజీకి శస్త్రచికిత్స

చెన్నై : ఈడీ అరెస్టు చేసిన తమిళనాడు మంత్రి వి.సెంథిల్‌బాలాజీకి ఈ నెల 21న ఇక్కడి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో హృదయ సంబంధిత శస్త్రచికిత్సను చేయనున్నారు. ఈ విషయాన్ని తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి మా. సుబ్రమణ్యం మంగళవారం వెల్లడించారు. క్యాష్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో గతవారంలో సెంథిల్‌బాలాజీని ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అదే రోజు సెంథిల్ గుండెపోటుకు గురికావడంతో ముందుగా అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరువాత కోర్టు ఆదేశాలతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

'సెంథిల్‌బాలాజీకి తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. కాబట్టి రేపు చేస్తున్నారు' అని మంత్రి సుబ్రమణ్యం మంగళవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ వైద్యులు గుర్తించేవరకూ కూడా 'క్రిటికల్ బ్లాక్స్' గురించి సెంథిల్‌బాలాజీకి తెలియదని సుబ్రమణ్యం చెప్పారు. ప్రస్తుతం సెంథిల్‌బాలాజీ చికిత్స పొందుతున్న కావేరీ ఆసుపత్రే ఈ నెల 14న అతనికి బైపాస్ సర్జరీ చేయాలని తొలిసారి సూచించింది.

నవతెలంగాణ వరంగల్ రీజనల్ మేనేజర్.. బోయినపల్లి దేవేందర్ రావుకు పితృవియోగం

నవతెలంగాణ-వరంగల్



నవతెలంగాణ వరంగల్ రీజనల్ మేనేజర్ బోయినపల్లి దేవేందర్ రావు తండ్రి బోయినపల్లి గోపాల్‌రావు (85) వరంగల్ జిల్లా నల్లబెల్లి గ్రామంలో అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి పలువురు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నారు. మృతునికి నలుగురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు నవతెలంగాణ వరంగల్ రీజియన్ మేనేజర్ బోయినపల్లి దేవేందర్ రావు. కాగా, దేవేందర్, ఆయన కుటుంబానికి నవతెలంగాణ సీజీఎం ఎం.ప్రభాకర్, ఇన్‌చార్జి ఎడిటర్ రాంపల్లి రమేష్, మఫిషిల్ ఇన్‌చార్జి వేణు తమ సంతాపాన్ని తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్డ్ కరీంనగర్లోని ఇద్దరు ఆకాష్ బైజూస్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కరీంనగర్ : టెస్ట్ ప్రిపరేషన్ సేవల్లో జాతీ య అగ్రగామి ఆకాష్ ్ బైజూస్, కరీంనగర్ లోని విద్యార్థులు ఇద్దరు అ త్యంత ప్రతిష్టాత్మకమై న జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జెఈఈ) అడ్వాన్స్డ్ 2023 లో



అద్భుతమైన ఫలి తాలు సాధించి తల్లిదండ్రులతో పాటుగా ఇనిస్టి ట్యూట్ కు గర్వకారణంగా నిలిచారు. ఈ ఇద్దరు విద్యార్థుల్లో వేముల సిద్ధార్థ 1056 ర్యాంక్ సాధించగా, సంకిటి ఐశ్వర్య రెడ్డి 3683 ర్యాంక్ సాధించింది. ఈ ఫలితాలను ఐఐటీ గౌహతి విడుదల చేశారు. ప్రపంచంలో అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షగా భావిస్తోన్న జెఈఈలో విజయం సాధించేందుకు వీరు ఆకాష్ బైజూస్ ఇనిస్టిట్యూట్లో క్లాస్ రూమ్ ప్రోగ్రామ్ లో చేరారు. కాన్సెప్ట్ లను అర్థం చేసుకోవడంలో తాము పడిన కష్టం, లెర్నింగ్ షెడ్యూల్ను కట్టుబడి ఉండటమే తమ విజయానికి కారణం గా అభి వర్ణించారు. విద్యార్థులను అభినందించిన ఆకాష్ బైజూస్ రీజనల్ డైరెక్టర్ ధీరజ్ కు మార్ మిశ్రా మాట్లాడుతూ... అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినం దిస్తున్నానన్నారు. వారు పడిన కష్టం, అంకితభావం, వారి తల్లిదండ్రులు అందించిన మద్దతు గురించి ఈ ఫలితాలు ఎంతో వెల్లడిస్తాయన్నారు. భవిష్యత్లో మరిన్ని విజయాలను వారు సాధించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

కొత్త ప్రైవసీ ఫీచర్లను ప్రారంభించిన వాట్సప్

నవతెలంగాణ-హైదరాబాద్ : ఒక ప్రైవేట్ మెసేజ్ శక్తికి సంబంధించిన అంశాలను వాట్సప్ నేతృత్వంలోని యూగా తన నూతన సమీక్ష అనంతరం వెల్లడించింది. ఢిల్లీలోని మాల్స్ పరిధిలోని మహిళల రెస్టూమ్లలో ప్రైవేట్ స్పేస్లలో కనిపించే మిర్రర్డ్ మెసేజెస్ శ్రేణిని ప్రారంభించేందుకు నటి అనుష్క శర్మతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈసందర్భంగా నటి అనుష్క శర్మ మాట్లాడుతూ... మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడటం సురక్షితమని ఎప్పుడూ భావించరన్నారు. అయినప్పటికీ వారు తమను వ్యక్తిగతంగా సంప్రదించే స్నేహితునితో మాత్రం మాట్లాడతారన్నారు. మహిళలు ఇతరులతో నమ్మకంగా ఉండేందుకు, సురక్షితమైన స్థలాన్ని కలిగి ఉండటం, వారి భద్రత, శ్రేయస్సు ప్రమాదంలో ఉన్నప్పుడు మాట్లాడేందుకు, సహాయం కోరడానికి మహిళలకు ప్రైవేట్ సంభాషణ ఎలా శక్తినిస్తుంది అనే అంశంపై అవగాహన కల్పించేందుకు తాను వాట్సప్ భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నానన్నారు. మెటా ఇండియా ఉపాధ్యక్షురాలు సంధ్యా దేవనాథన్ మాట్లాడుతూ... వాట్సాప్లో వినియోగదారులు వారి కుటు ంబం, స్నేహితులతో వ్యక్తిగత సంభాషణలను రక్షించడం తాము వారికి అందించగల అత్యంత ముఖ్యమైన గోప్యత అని విశ్వసిస్తున్నామన్నారు. వినియోగదారులు వారి అత్యంత ప్రైవేట్ సంభాషణలను కలిగి ఉండటానికి సురక్షితమైన స్థలాన్ని అందించేందుకు వాట్సప్ అంతర్నిర్మిత రక్షణ పొరలను మరింత బలోపేతం చేసే, జోడించే రెండు కొత్త గోప్యత-మొదటి ఫీచర్లను అందిస్తున్నందుకు తాము సంతోషిస్తున్నామన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ చైర్మెన్‌గా శ్రీధర్‌కుమార్ లోథ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల జేఏసీ నూతన కమిటీ ఎన్నికైంది. ఈ జేఏసీ నూతన చైర్మెన్‌గా కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం జూమ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రాజేష్ కన్నా, చైర్‌పర్సన్‌గా పల్లా రేష్మారెడ్డి, వర్కింగ్ చైర్మెన్‌గా డాక్టర్ రామేశ్వరరావు, కో చైర్మెన్‌గా డాక్టర్ ఎస్ రవికుమార్‌తోపాటు మరో 47 మందిని ఎన్ను కున్నారు. విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యుల రైజ్ చేయాలని కోరుతూ దశలవారీగా కార్యాచరణను రూపొందించారు. బుధవారం ఉన్నత విద్యామండలి అధికారులను కలుస్తారు. ఈనెల 22న వినూత్న నిరసన, 23న పరిపాలన భవనం ముందు ధర్నా, 24న అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు ఇస్తారు. 26న కాలేజీల ముందు ధర్నా, 27న వినూత్న నిరసన, 28న విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, సీఎస్ శాంతికుమారిని కలిసి వినతిపత్రం సమర్పిస్తారు.